గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 353 | శనివారం | 14-06-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00

## తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యోగులకు 3.64 శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన డీఏ 2023 జనవరి 1 నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ మెరుపు దాడులు

### అణుశక్తి శుద్ధి కేంద్రాలు లక్ష్యంగా బాంబుల వర్షం

- ముగ్గురు రివల్యూషనరీగార్డ్స్ టాప్ కమాండర్స్ మృతి
- క్షిపణి దాడుల్లో ఆరుగురు అణుశాస్త్రవేత్తలు మరణం
- 100 డ్రోన్లతో ఇరాన్ ఎదురుదాడి
- 10 శాతం మేరకు పెరిగిన చమురు ధరలు

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ నుంచి నాకు ఫోన్ వచ్చింది. భారతదేశ ఆందోళనను పంచుకొని, సత్వర ప్రాంతీయ శాంతి, సుస్థిరత పునరుద్ధరణ అవసరాన్ని నొక్కి చెప్పాను.
– ప్రధాని మోదీ



**టెహ్రాన్ :** ఇరాన్ ప్రధాన అణుశుద్ధిస్థావరాలపై, ఇతర నగరాలలో సైనిక కేంద్రాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. శుక్రవారం తెల్లవారకముందుగానే 200 యుద్ధ విమానాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. ఇరాన్‌లోని పలు ప్రాంతాలలో 100 లక్షాలపై గురి పెట్టి విధ్వంసం సృష్టించాయి. దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)కు చెందిన ముగ్గురు ఉన్నతస్థాయి కమాండర్లు, ఇరాన్ యురేనియం శుద్ధి కార్యకలాపాలలో నిమగ్నమైన ఆరుగురు అణుశాస్త్రవేత్తలు మరణించారు. ఇరాన్ గగనతల వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తమ దేశ సర్వాధినేత ఆయెుతుల్లా అలీ ఖొమైనీ సురక్షితంగా ఉన్నారని ఇరాన్ భద్రతాదళాలు ప్రకటించాయి. ఇరాన్ అణుశుద్ధి కార్యక్రమాలు జరిగే కేంద్రాలు, టాప్ కమాండర్స్ కేంద్రాలు, క్షిపణి సామర్థ్య కేంద్రాలు లక్ష్యంగా ఇజ్రాయెల్ చీకటి దాడులు చేసింది. దాడుల అనంతరం ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. ఇరాక్, జోర్డాన్ గగనతలాల మీదుగా ప్రయాణించిన ఇరాన్ డ్రోన్లు ఇజ్రాయెల్ గగనతలంలోకి దూసుకెళ్ళి ఎదురుదాడులు చేశాయి. 1980 లో ఇరాన్–ఇరాక్ మధ్య పదేళ్ళపాటు తీవ్ర యుద్ధం జరిగిన తర్వాత అంత భారీస్థాయిలో యుద్ధ దాడులను ఇరాన్ ఎదుర్కోవడం, నష్టాలను చవిచూడటం మళ్ళీ ఇదే మొదటిసారి. ఈ దాడుల ఫలితంగా ఇజ్రాయెల్, ఇరాన్, జోర్డాన్, ఇరాక్ దేశాలు తమ తమ గగనతల వ్యవస్థలను మూసివేశాయి. దీంతో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన పౌరవిమానాలు వెనక్కు తిరిగి వెళ్ళిపోయాయి. ఇరాన్‌లో వివిధ సాయుధ బలగాల ప్రధానాధిపతుల ఛైర్మన్ మేజర్ జనరల్ మహ్మద్ బఘేరీ, ఐఆర్‌జిసి చీఫ్ కమాండర్ హుస్సేన్ సలామీ, ఖతంఅల్–అన్బియా ప్రధాన కార్యాలయం కమాండర్ మేజర్ జనరల్ ఘొలమలీ రషీద్‌లు ఇజ్రాయెల్ చేసిన వేరు వేరు క్షిపణి దాడుల్లో మరణించారు. అణుశాస్త్రవేత్త, ఇస్లామిక్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు మహ్మద్ మెహ్దీ టెహ్రాన్చి, అణుశాస్త్రవేత్త,ఇరాన్ అణుశక్తిసంస్థ మాజీ అధిపతి ఫెరేడౌన్ అబ్బాసీ కూడా వేరు వేరు క్షిపణి దాడుల్లో మరణించినవారిలో ఉన్నారు. ఇరాన్ ఐఆర్‌జిసి ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు మరణించినట్లు ఇరాన్ భద్రతాదళాలు

తరువాయి 2లో

పశ్చిమాసియాలో విస్తృత ఘర్షణలకు

## ఇజ్రాయెల్ పురిగొల్పింది

### వామపక్ష పార్టీల ఖండన

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ చర్య ప్రాంతీయ, భౌగోళిక శాంతిపై దీర్ఘకాలిక పరిణామాలతో కూడిన ప్రమాదకరమైన ఉద్రిక్తతలకు దారి తీస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు సిపిఐ జాతీయ సమితి శుక్రవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. ఎలాంటి కవ్వింపు చర్య లేని దాడుల ద్వారా అంతర్జాతీయ చట్టాలనే కాకుండా ఇరాన్ సార్వభౌత్వాన్ని కూడా ఉల్లంఘించిందని జరిగిందని, పశ్చిమ ఆసియాలో విస్తృత ఘర్షణలను పురిగొల్పిందని విమర్శించింది. ఇజ్రాయెల్ పదే పదే సైనిక చర్యలకు దిగడం, అందుకు అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలు మద్దతుగా నిలబడడం ద్వారా మొత్తం ప్రాంతాన్ని తీవ్రమైన అస్థిరత, అభద్రతలోకి నెట్టివేస్తుందని సిపిఐ మండిపడింది. అన్ని రకాల దురాక్రమణలు, యుద్ధోన్మాదాన్ని

తరువాయి 2లో



20 మందికంటే ఎక్కువ పిల్లలున్న చోట

## ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు

- ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పెంపే లక్ష్యం
- మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థికీ మెరుగైన విద్య అందాలని, ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 20 మంది కంటే ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సిఎం వెల్లడించారు. పాఠశాలలు పునర్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ అధికారులతో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికీ మెరుగైన విద్య అందే విధంగా వ్యవస్థను తీర్చిద్దాలని సిఎం ఆదేశించారు. ఈ క్రమంలో బోధన ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థను మార్పు చేయాలని సిఎం సూచించారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకుని హెచ్‌ఎండిఎ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ తదితర విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా

తరువాయి 2లో





## విమాన ప్రమాదస్థలిలో ప్రధాని మోదీ పరిశీలన

- ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- మృత్యుంజయుడితో ఘటనపై ఆరా
- 265 మంది మృతిచెందినట్లు పోలీసుల వెల్లడి

**అహ్మదాబాద్ :** గుజరాత్ అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురిని గుర్తించి వారి బంధువులకు మృతదేహాలను అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. పాక్షికంగా లేదా పూర్తిగా కాలిపోయిన ఇతర మృతదేహాల విషయంలో, వారి డిఎన్‌ఎ నమూనాలను సరిపోల్చడానికి దాదాపు 72 గంటలు పడుతుందని పోలీసులు తెలిపారు. కాగా, ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ సందర్శించి, అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. మోదీ ఉదయం సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయానికి చేరుకుని నేరుగా విమాన ప్రమాద స్థలానికి వెళ్లారని అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం టేకాఫ్ అయిన

తరువాయి 2లో

### బ్లాక్ బాక్స్ లభ్యం

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానానికి సంబంధించి అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ లభ్యమైంది. భవన శిథిలాల నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) వెల్లడించింది. ప్రమాద ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 40 మంది సిబ్బంది పౌరవిమానయాన శాఖ బృందాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. విమానంలో కీలకంగా ఉండే బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని విశ్లేషిస్తే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునే

తరువాయి 2లో

## దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందితే అసమానతలు ఎందుకు పోలే!

- ప్రజలు పేదరికంలో ఎందుకు మగ్గుతున్నారు?
- కేంద్ర సర్కార్ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ మభ్యపెడుతోంది
- సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శ




ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

భారతదేశం ఆర్థికంగా జర్మనీని దాటి నాల్గవ స్థానం ఆక్రమించిందని కేంద్ర సర్కార్ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతుందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. అర్థికంగా దేశం అభివృద్ధి చెందితే అసమానతలు ఎందుకు పోలేదని, ప్రజలు పేదరికంలో ఎందుకు మగ్గుతున్నారని ప్రశ్నించారు. ప్రతిరోజు రూ.280ల నుండి రూ.320లు సంపాదిస్తే పేదలు ధనవంతులుగా ఎలా మారుతారని ప్రశ్నించారు. నెలకు రూ.8వేల నుండి రూ.9వేలల్లో కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారన్నారు. బతుకుదెరువు లేకుండా అర్థాకలితో ప్రజల్లో జీవనం సాగిస్తున్నారని, ప్రపంచ దేశాలో ఆకలితో అలమటిస్తున్నవారిలో దేశం 101 స్థానంలో నిలిచిందని, ప్రజలకు విద్య, వైద్యం కల్పించటంలో 126 స్థానంలో నిలిచినట్లు సూచికలు తెలుపుతున్నాయన్నారు. కేంద్రం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, వాస్తవాలను మరుగునపడేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తుందని

తరువాయి 12లో

ఫార్మూలా ఇ–కార్ రేస్ కేసు

## కెటిఆర్‌కు మళ్లీ నోటీసులు

ఈ నెల 16న విచారణకు రావాలని ఎసిబి స్పష్టీకరణ

విచారణకు హాజరవుతా : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు ఫార్ములా ఇ–కార్ రేసు కేసులో మరోసారి ఎసిబి నోటీసులు జారీ చేసింది. 16వ తేదీన సోమవారం ఉదయం 10గంటలకు విచారణకు హాజరుకావాలని ఎసిబి నోటీసులలో స్పష్టం చేసింది. జనవరిలో కెటిఆర్‌ను విచారించిన ఎసిబి ఇప్పుడు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ కేసులలో నేరుగా విదేశీ సంస్థ ఎఫ్‌ఇఒకు రూ.45.71కోట్లు చెల్లించి ఫెమా నిబంధనలు ఉల్లంఘించారని ఇటు ఎసిబితో పాటు అటు ఇడి సైతం కేసులు నమోదు చేశాయి. జనవరి నెలలో కెటిఆర్‌తో పాటు నిందితులను దర్యాప్తు సంస్థలు విచారించాయి. ఫార్ములా ఈ ఆపరేషన్స్ సిఇఒతో పాటు స్పాన్సర్ గ్రీన్ కో అనుబంధ సంస్థ ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీ ప్రతినిధులను, ఐఎఎస్ అర్వింద్ కుమార్‌ను, హెచ్‌ఎండిఎ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బిఎల్‌ఎన్ రెడ్డిను విచారించాయి. తాజాగా ఈ కేసులో కెటిఆర్‌ను మరోసారి ఎసిబి విచారణకు పిలవడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. 2023లో హైదరాబాద్‌లో ఫార్ములా ఇ–కార్ రేస్‌ను నిర్వహించారు. ఇ–రేస్ నిర్వహణలో

తరువాయి 2లో

### గురుకుల బాలికలు ఎవరెస్ట్ అధిరోహణ

ప్రజాపక్షం / ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారు. గత నెల 25వ తేదీన నేపాల్‌కు బయలుదేరిన విద్యార్థినుల బృందం, 27వ తేదీన ఎవరెస్ట్ శిఖర అధిరోహణను ప్రారంభించింది. తొమ్మిదవ రోజుకు వారు శిఖరాన్ని చేరుకున్నారు. బిసి. గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబాబాద్, నిజామాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల నుండి మొత్తం 20 మంది విద్యార్థులు ఈ సాహసయాత్రకు బయలుదేరారు. ఈ బృందంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు హిమబిందు, బిక్కుబాయి కూడా ఉన్నారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి విజయం సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాబాయి అభినందించారు.

రైతు భరోసాకు

## 54 ఎకరాల పరిమితి

ఈ నెలాఖరు లోపు రైతుల ఖాతాల్లోకి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ఖమ్మం

రైతు భరోసాకు గత చట్టాలను , నిబంధనలను పరిశీలించిన మీదట 54 ఎకరాల వరకు రైతు భరోసా అందించనున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా మొత్తాన్ని ఈ నెలాఖరు లోపు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమం సందర్భంగా మీడియాతో చిట్‌చాట్

తరువాయి 12లో

## ప్రభుత్వ విద్య దుస్థితికి కారకులెవరు?

- ప్రభుత్వమా... ఉపాధ్యాయులా ?
- ప్రైవేటుపై తల్లిదండ్రుల మోజు
- అక్కడ ఉపాధ్యాయులే... విద్యార్థులేరి!




ప్రజాపక్షం/ఖమ్మం

ప్రభుత్వ విద్య అత్యంత పతన దశకు చేరుకుంది. వందలాది మంది విద్యార్థులతో అలరారిన ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు కనిష్ట అంకెను లేదంటే సంఖ్యకు చేరుకున్నాయి. వందలాది మంది విద్యార్థులు ఉన్న ప్రైవేటు పాఠశాలలు గొప్ప డిగ్రీలు, విశేష అనుభవం, ఉత్తమ అవార్డులు అందుకుని బోధన చేసే సిబ్బంది ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడం చూసి పక్కున నవ్వుతున్నాయి. (నవ్వినా ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదనుకోండి) వేలు, వందల ఓట్లు కలిగిన గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఒకరిద్దరు పిల్లలున్నారు. ఉన్నత స్థానాల్లో ఉండి అందుకు తగినట్లు వేతనాలు పొందుతూ పండితాగ్రేసరులు బడిబాట

తరువాయి 12లో

## సాగుకు సమాయత్తం

- రైతులకు కలిసివచ్చిన అకాలవర్షాలు
- అందుబాటులో పత్తి విత్తనాలు
- మిర్చి నుండి ఈసారి పత్తి వైపు రైతుల మొగ్గు

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి



పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. వరి, పత్తిసాగు చేసిన రైతులు ఇప్పటికే కురిసిన వర్షాలతో దుక్కులు దున్ని సిద్ధంచేశారు. పొడిదుక్కుల్లోనే నాటుకునేందుకు సమాయత్తమయ్యే రైతులకు ఇటీవలి వర్షాలు కొంత కలిసివచ్చాయి. హనుమకొండ జిల్లాలో గత నెలాఖరులోనే ప్రారంభమైన రోహిణికార్తె ప్రారంభంలోనే పత్తి రైతులు విత్తనాలు నాటేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. నీటి ఆధారం ఉన్న రైతులతో పాటు వర్షాల మీదనే ఆధారపడి సాగుచేసే రైతులు కూడా దుక్కులను సిద్ధంచేసుకొని సన్నద్ధమయ్యారు. వరి, మొక్కజొన్న పంటలు సైతం నాటుకునేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. మిర్చిని తగ్గించుకుని పత్తి, మక్క సాగును పెంచుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. వాణిజ్య పంటలపైన ఉన్న మక్కువతో వరుసగా మూడు సంవత్సరాల నుంచి మిర్చి పంట సాగు చేసినా సరైన ధరలురాకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ఈ ఏడాది రైతులు ఎర్ర బంగారానికి ప్రత్యామ్నాయంగా తెల్లబంగారం

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## భద్రతామండలి అత్యవసర సమావేశానికి ఇరాన్ విజ్ఞప్తి

**టెహ్రాన్ :** భద్రతామండలి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం తెల్లారకముందే ఇజ్రాయెల్ భారీ ఎత్తున 200 యుద్ధ విమానాలతో ఇరాన్‌పై దాడులు చేసి భారీ నష్టం చేయడంతో ఇరాన్ ఐక్యరాజ్యసమితికి ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయాద్ ఇరావన్ ఈ మేరకు లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్‌లోని యూదు మతఛాంధస ప్రభుత్వం అన్యాయంగా, ఉద్దేశపూర్వకంగా, చట్టవిరుద్ధంగా, చాలా నిర్లక్ష్యపూరితంగా ఇరాన్‌పై దురాక్రమణ దాడులకు పాల్పడిందని, ఇరాన్ అణుశుద్ధి కర్మాగార వ్యవస్థలపైన, ఇరాన్ పౌర ప్రాంత ప్రజల మౌలిక సదుపాయాలపైన దారుణమైన దాడులు చేసిందని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి చేసిన అంతర్జాతీయ చట్టాలకు ఈ దాడులు పూర్తి విరుద్ధమని, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని పేర్కొంది.

# ఇరాన్‌ను లొంగదీసేందుకేనా ఇదంతా?

### చర్చలు జరుగుతాయనే ఆశిస్తున్నా:ట్రంప్

**వాషింగ్టన్ :** ట్రంప్ ఒక పథకం ప్రకారం ఇరాన్‌ను లొంగదీసుకోవడానికి ఇజ్రాయెల్‌తో దాడులు చేయించారా? అందులో భాగంగానే అంతర్జాతీయ అణునిఘా సంస్థ గవర్నర్స్ బోర్డు ఇరాన్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిందా? తమకేమీ తెలియదని ఉద్దేశపూర్వకంగానే పైకి ప్రకటనలు చేస్తున్నారా? పలు దేశాలలో మీడియా వార్తలన్నీ ఈ విషయాలనే ఇప్పుడు ప్రధానంగా చర్చిస్తున్నాయి. గడచిన రెండు నెలలుగా జరుగుతున్న పరిణామాలు ప్రస్తుత దాడులతో నిర్ధారణయ్యాయి. ఈ పరిస్థితి ఎటు దారితీస్తుందో అనే కొత్త సందేహాలు, ప్రశ్నార్థకాలమధ్య డోనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా శుక్రవారంనాడు ఒక పోస్టింగ్ పెడుతూ, నిర్ణీత ప్రకారం ఆదివారం నాడు (జూన్ 15) మస్కట్‌లో అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరుగుతాయని తాను ఆశాభావంతో ఉన్నానని పేర్కొన్నారు. ఇరాన్ అణుకార్యక్రమాన్ని పరిమితం చేసేందుకు వీలుగా గతం కంటే మెరుగైన ఒప్పందం తమతో చేసుకోవాలని తాజా ప్రకటనలో ఇరాన్‌కు ట్రంప్ విజ్ఞప్తి చేశారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తుందని తమకు ముందస్తు సమాచారం ఉందని కూడా ఆయన కుండబద్దలుకొట్టినట్లు చెప్పారు.

ఇటీవలికాలంలో అమెరికా, ఇజ్రాయెల్ మీడియాలో ఇరాన్‌పై దాడులు జరుగుతాయనే వార్తలు తరచు ప్రచురితమవుతున్నాయి. ఒకవైపు ఐఎఇఎ అణుశక్తిసంస్థ ఇరాన్‌పై చేసిన విమర్శనాత్మక తీర్మానం, ఆ వెనువెంటనే ట్రంప్ చేసిన ప్రకటనలు ప్రపంచానికి ఇంకా పూర్తిగా చేరకముందే ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని కట్టడి చేసేందుకు వీలైన ఒప్పందాన్ని చేసుకోవడానికి చేరువగా ఉన్నందు వల్ల ఈ సమయంలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చెయ్యకూడదని ట్రంప్ ప్రకటించారు. తర్వాత అర్థరాత్రి దాటగానే ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఇరాన్‌ను ప్రత్యక్ష చర్చలకు ఒప్పించేందుకు, అణుహక్కులు వదులుకునేందుకు తిరస్కరిస్తున్నందుకే బెదిరింపు చర్యలను రుచి చూపించేందుకే ఇజ్రాయెల్‌తో దాడులు చేయించారన్న కథనాలు కూడా వెలువడుతున్నాయి. శాటిలైట్స్ సహాయంతో ఇరాన్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇజ్రాయెల్‌కు అమెరికా సమకూర్చిందని, గతంలో కూడా ఇదే తరహా సహకారం అందించిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ట్రంప్ మొదటి విడత అధికారంలోకి వచ్చిన తర్వాత 2018లో ఇరాన్‌తో అణుఒప్పందాన్ని రద్దుచేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇరాన్‌తో మరింత ఉత్తమస్థాయిలో అణు ఒప్పందం చేసుకుని ఇరాన్ అణు కార్యక్రమాన్ని కట్టడి చేస్తామని ప్రకటించారు. అమెరికాతో ముఖాముఖీ చర్చల ప్రశ్నేలేదని ఇరాన్ స్పష్టం చేసిన తర్వాత ఒమన్ మధ్యవర్తిత్వంలో పరోక్ష చర్చలకు ట్రంప్ అంగీకరించారు. చర్చల్లో ఒక మేలైన ఒప్పందం చేసుకోకపోతే ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తామని ఏప్రిల్ రెండో వారం వరకూ ట్రంప్ బహిరంగ ప్రకటనలు చేస్తూనే ఉన్నారు.

ట్రంప్ ఒత్తిడి మేరకు ఏప్రిల్ 12వ తేదీ నుండి ఇరాన్–అమెరికా మధ్య అణుసమస్యపై పరోక్ష చర్చలు ప్రారంభమయ్యాయి. ఒమన్ మధ్యవర్తిగా మొదటి విడత చర్చలు మస్కట్‌లో జరిగాయి. రెండో విడత చర్చలు ఏప్రిల్ 19న రోమ్‌లో జరిగాయి. మొత్తం ఐదువిడతలుగా చర్చలు జరిగినప్పటికీ రెండు దేశాలమధ్య ఒక ఒప్పందం ఆలోచనే ప్రారంభం కాలేదు. ఐదో విడత చర్చలు మే 23న రోమ్‌లో జరిగాయి. ఆ తర్వాత కూడా ఇరాన్–అమెరికా



మధ్య ప్రకటనల యుద్ధం కొనసాగింది. అణుసామర్థ్యాన్ని సమకూర్చుకోవడం తమ హక్కు అనీ, శాంతియుత ప్రయోజనాలకోసమే తాము దీనిని ఉపయోగిస్తామని, తమ దేశ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదని ఇరాన్ ప్రకటించింది. చివరకు ఎలాగో అలాగ వచ్చే ఆదివారంనాడు అంటే జూన్ 15న మస్కట్‌లో ఆరో విడత చర్చలు రెండు దేశాలమధ్య జరుగుతాయని మధ్యవర్తిదేశం ఓమన్ ప్రకటించింది. తర్వాత ఐఎఇఎ కూడా అణు భద్రత విషయంలో ఇరాన్ బాధ్యత రహితంగా వ్యవహరిస్తోందని విమర్శలు చేస్తూ వియన్నా సమావేశంలో ఒక తీర్మానం చేసింది. తర్వాత గంటల వ్యవధిలోనే ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమయ్యాయి.

### ఇప్పటికైనా అణుఒప్పందం చేసుకోండి ఇరాన్‌కు ట్రంప్ హితవు

ఇరాన్‌కు తాను అవకాశాల మీద అవకాశాలు ఇస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ ఇప్పటికైనా అమెరికాతో ఒక మెరుగైన అణుఒప్పందం చేసుకోవాలని హితవు చెప్పారు. శుక్రవారం తెల్లారకముందే ఇజ్రాయెల్‌కు చెందిన 200 యుద్ధ విమానాలు, క్షిపణులు ఇరాన్‌పై దాడులు జరిపి భారీ నష్టం చేసిన తర్వాత ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేశారు. అలస్యం అమృతం విషం, అస్సలు చేయకుండా ఉంటేకంటే, ఆలస్యంగానైనా ఒప్పందం చేసుకోవడం మంచిదని అన్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పూర్తిగా మిగలకుండా పోకముందే ఈ ఒప్పందం జరగాలన్నారు. ఇక తదుపరి ఇజ్రాయెల్ మరిన్ని క్రూరమైన దాడులు చేసే అవకాశం ఉందని ఆయన హెచ్చరిక చేశారు. ఈ ఒప్పందం లేకపోతే మధ్యప్రాచ్యంలో భారీఎత్తున సామూహిక సంఘర్షణ జరిగే అవకాశం ఉందని కూడా ఆయన ఇరాన్‌కు హెచ్చరించారు.

# దేవుడి దయవల్ల ఆరంభ దాడుల్లోనే విజయం

### ఇరాన్ ప్రజలకు నియంతృత్వ విముక్తి దగ్గరలోనే ఉంది
### నేతన్యాహూ తొలి స్పందన



**జెరూసలెం:** దేవుడి దయవల్ల ఇరాన్‌ను చావు దెబ్బ తీశామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. ఎంతో విజయవంతంగా ఇరాన్‌కు చెందిన కీలకమైన అణుశుద్ధి కేంద్రాలను ధ్వంసం చేశామని చెప్పారు. తమ దాడులు కొనసాగుతాయని ఆయన చెప్పారు. ఈ దెబ్బతో ఇరాన్‌లో 46 ఏళ్ళుగా కొనసాగుతున్న అణచివేత, అత్యంత క్రూరమైన నియంతృత్వ వ్యవస్థ క్షీణదశ ప్రారంభానికి దారితీయగలదన్న ఆశాభావాన్ని నేతన్యాహూ వ్యక్తం చేశారు. ఇరాన్ విముక్తి దినం చాలా దగ్గరలోనే ఉందని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. తమ యుద్ధం ఇరాన్ ప్రజలతో కాదని, ఇరాన్‌లో సాగుతున్న నియంతృత్వానికి వ్యతిరేకంగా తాము యుద్ధం చేస్తున్నామన్న సదేశాన్ని దీనిద్వారా పంపుతున్నామన్నారు. ఇరాన్ న్యూక్లియర్ కాంప్లెక్, మిలిటరీ కాంప్లెక్స్,మిలిటరీ కమాండర్స్ కాంప్లెక్స్‌లపై విజయవంతంగా దాడి చేసి వారిని హతమార్చామన్నారు. మొట్టమొదటి ప్రారంభదాడులే విజయవంతమయ్యాయని అన్నారు. ఇరాన్ ప్రభుత్వం చేసే అణ్వాయుధ విధ్వంసానికి ఇజ్రాయెల్ దేశం బలికాకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు.

'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో చాలా విజయవంతంగా ఇరాన్ సీనియర్ కమాండర్లను, అణుశాస్త్రవేత్తలను హతమార్చామని చెప్పారు. ''దేవుడి సహాయంతో మేం ప్రారంభదాడుల్లోనే ఘన విజయం సాధించాం, ఇంకా మరిన్ని సాధించడానికి వెళుతున్నాం, ఇరాన్ అణుశుద్ధి కార్యక్రమానికి సంబంధించి గుండెకాయ వంటి కీలక ప్రదేశాన్ని నాశనం చేశాం,నటాంజ్ లో ఉన్న అత్యంత ప్రధానమైన అణుశుద్ధి కేంద్రాన్ని ధ్వంసం చేశాం, ప్రథమశ్రేణికి చెందిన ఇరాన్ అణుశాస్త్రవేత్తలపై గురిపెట్టి హతమార్చాం, అత్యంత కీలకమైన వారి ఖండాంతర క్షిపణి కార్యాక్రమాన్ని నాశనం చేశాం'' అని ఘనంగా ప్రకటించుకున్నారు. ఇరాన్ చేపట్టిన అణుకార్యక్రమం యావత్ ప్రపంచానికీ పెద్ద ప్రమాదంగా మారిందని ఆయన అన్నారు. దాడులకు సంబంధించిన ఒక వీడియోను కూడా ఆయన విడుదల చేశారు. ఇరాన్‌దేశంలో లోలోపలికి చొచ్చుకువెళ్ళి దాడులు చేశామని నేతన్యాహూ చెప్పారు.

**ఇరాన్ అణుబాంబులకు బలికాదల్చుకోలేదు,అందుకే...**

''దశాబ్దాలుగా ఇరాన్ బాహాటంగా ఇజ్రాయెల్‌ను ధ్వంసం చేయడం గురించి మాట్లాడుతోంది, ఈ వినాశనం చేయడంకోసం భారీఎత్తున అణ్వాయుధాలవైపు మళ్ళింది, ఎక్కువసంఖ్యలో అణుబాంబులు సమకూర్చుకోవడంకోసం ఇటీవలికాలంలో పెద్దమోతాదులో యురేనియంను శుద్ధిచేసే కార్యక్రమాన్ని ఉద్ధృతం చేసింది, ఇరాన్‌కు బలైపోవడం మాకు ఇష్టంలేదు, దీనిని ఎదుర్కొంటాం, దాదాపు తొమ్మిది అణుబాంబులు తయారు చేయగల సామర్థ్యాన్ని ఇరాన్ సమకూర్చుకుంటున్నది, ఏడాది కావొచ్చు, కొన్ని నెలలు పట్టొచ్చు, ఇజ్రాయెల్ ఉనికికి ఇరాన్‌వల్ల చాలా స్పష్టమైన ప్రమాదం పొంచి ఉంది, మేం బలి కాదల్చుకోలేదు'' అని నేతన్యాహూ అన్నారు.

ఇరాన్ గగనతల వ్యవస్థలకు భారీ నష్టం జరిగిందని నేతన్యాహూతోపాటు ఇరాన్ కూడా ధృవీకరించింది. కాగా ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లలో చాలా వాటిని తమ గగనతలం వెలుపలే కూల్చివేశామని ఇరాన్ రక్షణదళాలు ప్రకటించాయి. ఇరాన్ దాడులు చేస్తుందన్న భయం లేదని, ఎంతో కాలం బాంబుదాడుల రక్షణ కేంద్రాలలో తలదాచుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందని ఇరాన్‌పై దాడుల అనంతరం శుక్రవారం ఉదయం 1.50 గంటలకే ఇజ్రాయెల్ రక్షణశాఖ ప్రకటించింది. ఇరాన్‌తో భారీ ఎత్తున యుద్ధం కొనసాగుతుందన్న భయంతో వేలసంఖ్యలో ప్రజలు సూపర్ మార్కెట్లపై ఎగబడ్డారు. మంచినీటి బాటిల్స్‌ను ప్రజలు భారీస్థాయిలో కొనుగోలు చేశారు. క్షణాల్లో వాటర్ బాటిల్స్‌స్టాక్స్ మాయమయ్యాయి.

## ఇది యుద్ధమే ఇజ్రాయెల్‌కు కఠినశిక్ష తప్పదు



**టెహ్రాన్:** ఇజ్రాయెల్ చేసిన దాడుల వెనుక సూత్రధారి అమెరికా ప్రభుత్వమేనని ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా అలీ ఖొమైనీ అన్నారు. తమ దేశంపై ఇజ్రాయెల్ చేసిన దాడులను యుద్ధ ప్రకటనగా పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆ దాడులకు గాను ఇజ్రాయెల్–అమెరికా రెండు దేశా లూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వ స్తుందని, అందుకు సిద్ధంగా ఉండాలని ఖొమైనీ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌కు కఠినశిక్ష తప్పదని ఖొమైనీ ప్రత్యేకించి ఇజ్రాయెల్‌కు హెచ్చరిక జారీ చేశారు. ఈ మేర కు వందల డ్రోన్లతో ఆ దేశంపై ఇరాన్ ఎదురు దాడులు చేస్తోంది. ఈ దాడులవల్ల ఎదురయ్యే పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఖొమైనీ అన్నారు. ఇరాన్ సాయుధబలగాల ఉన్నతాధికారులు స్పందిస్తూ, ఇజ్రాయెల్ ఇక అన్ని రకాల హద్దులను దాటేసిందని, అన్ని రకాల ఎర్రగీతలూ దాటి ముందుకు వచ్చిందని, ఇజ్రాయెల్ చేసిన నేరాలకు పరిమితి లేకుండా పోయిందని, అందువల్ల ఇజ్రాయెల్ దాడులకకు ప్రతిస్పందనగా ఇరాన్ అంతులేని, ఎడతెగని సమాధానం చెబుతుందని, ఇరాన్ చెప్పే సమాధానానికి ఒక పరిమితి ఉండబోదని, ఈ దాడులకు ఇరాన్‌ఖ దేశమే ఒక ముగిం చెబుతుదని హెచ్చరించారు. కాగా ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఒక ప్రకటన చేస్తూ ఇజ్రాయెల్ దాడులకు ఖండించారు. ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం చెబుతామని, శత్రువు చేసిన బుద్ధిలేని చర్యకు గట్టి బదులిస్తామన్నారు.

## మాకేం తెలియదు: దూరంగా ఉంటాం



**వాషింగ్టన్ :** ఇరాన్ అణుస్థావరాలపై ఇజ్రాయెల్ చేసిన దాడులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ దాడులకు తాము దూరంగా ఉంటామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఒక ప్రకటన చేశారు. అమెరికాకు ఈ దాడులకు సంబంధం లేదన్నారు. ''ఒక విషయం నన్ను స్పష్టంగా చెప్పనివ్వండి, ఇరాన్ ప్రభు త్వం అమెరికానుగానీ, అమెరికా ప్రయోజనాలనుగానీ లక్ష్యంగా చేసుకోరాదు'' అన్నారు. మధ్యప్రాచ్యంలో అమెరికా సైన్యాన్ని రక్షించుకోవడమే తమ ప్రథమ కర్తవ్యమని అన్నారు. ఇజ్రాయెల్ మనుగడ సాగించాలంటే ఈ దాడులు చేయకతప్పదని ఆ దేశం గట్టిగా భావిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. గడచిన కొద్ది రోజులుగా ఇరాన్‌కు ప్రత్యక్షంగానే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధ హెచ్చరికలు జారీ చేస్తూ వస్తున్నారు. దాడులకు కొద్ది గంటలు ముందుగా, ఇరాన్‌పై సైనిక చర్యల అవసరం లేకుండానే అణుపదార్థాల శుద్ధి కార్యక్రమాన్ని పరిమితం చేసుకోవడానికి ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు. కానీ శుక్రవారంనాడు మార్కో రుబియో స్పందిస్తూ, ఇరాన్‌పై దాడులు చేయాలని ఇజ్రాయెల్ ఏకపక్ష నిర్ణయం తీసుకుందని, తమకు సంబంధం లేదని అన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారంనాడు ఆలస్యంగా ట్రంప్ జాతీయ భద్రతా సమావేశం నిర్వహించారు. దీనిని అత్యవసర సమావేశంగా పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులు, తదుపరి పర్యవసానాల గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఈ వివరాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది. వైట్‌హౌస్ సిట్యూయేషన్ రూమ్‌లో ఈ సమావేశం జరిగింది.

# మెరుపు దాడులు

(మొదటి పేజీ తరువాయి)

కూడా ధృవీకరించాయి. ఈ సైనిక దాడుల్లో స్త్రీలు, పిల్లలు, సామాన్యులు కూడా మరణించినట్లు ప్రత్యక్షసాక్షులు చెప్పారు. రాజధాని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల్లో నివాసిత భవనాలు కూడా ఉన్నాయి. ఇరాన్ వాయువ్యప్రాంత నగరం తబ్రిజ్‌లో ఉన్న ఇరాన్ సైనిక విమానాశ్రయంపై కూడా శుక్రవారం తెల్లవారి పొద్దెక్కిన తర్వాత దాడులు చేసింది. ఇరాన్ బుషెహర్‌లోని నటాంజ్ అణుశుద్ధి కర్మాగారంలో కూడా అనేక పేలుళ్ళు సంభవించాయి. రాజధాని టెహ్రాన్ నగర సమీపంలో, ఇతర ఇరాన్ నగరాలపై ఇజ్రాయెల్ దాడులు చేసిందని ఇరాన్ అధికార మీడియా ప్రకటించింది. భారీ దాడుల కారణంగా ఇరాన్ నగరాలలో ఆకాశమంతటా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. ఇరాన్ అణు,సైనిక కేంద్రాల భవంతులవద్ద అగ్నిగోళాల్లా మంటలు పైకి ఎగశాయి. స్త్రీలు, పిల్లలు మృతదేహాలు చెల్లాచెదురుగా పడిఉన్న దృశ్యాలను స్టేట్ మీడియా చూపించింది. మరోవైపు ఇజ్రాయెల్ పత్రిక 'టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' ఆ దేశ సైనిక వ్యవహారాల మంత్రి ఇజ్రాయెల్ కట్జ్‌ను ఉటంకిస్తూ, దేశంలో అత్యవసర పరిస్థితిని విధించినట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్ గగనతల్లాన్ని మూసివేసింది. దాడులకు ప్రతిగా ఏ క్షణంలోనైనా ఇరాన్ ఎదురుదాడులు చేస్తుందని ముందుగానే తమ సైన్యం సర్వసన్నద్ధంగా ఉందని, ఇరాన్ దాడులు సమర్థవంతంగా తిప్పికొడతామని కట్జ్ చెప్పినట్లు పత్రిక పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులతో తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరాన్ 100 డ్రోన్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఆ డ్రోన్ల దాడిని ఇజ్రాయెల్ సైన్యాలు తిప్పికొట్టే పనిలో నిమగ్నమయ్యాయి. ఒక్కసారిగా మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రజ్వరిల్లి ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరుకోవడంతో అంతర్జాతీయస్థాయిలో చమురు ధరలు ఒక్కసారిగా 10 శాతం మేరకు పెరిగాయి. దీంతో మధ్యప్రాచ్యంలో అమెరికా తన ప్రయోజనాలకోసం ఆరని సరికొత్త చిచ్చు రేపినట్లయింది. ఇరాన్‌పై దాడులు చేస్తామని గడచిన కొద్దికాలంగా ఇజ్రాయెల్ దూకుడుగా ప్రకటనలు చేస్తూనే ఉంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుండీ ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తుందన్న వార్తలు అడపాదడపా వినిపిస్తూనే ఉన్నాయి. హమాస్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నది ఇరాన్ ప్రభుత్వమేనని, ఆయొతుల్లా ఖొమైనీ అండదండలతోనే హమాస్ ఉగ్రవాదులు, హౌతీ ఉగ్రవాదులు అటు గాజాలోనూ, ఇటు ఎర్ర సముద్రంలోనూ దాడులు చేస్తూ మధ్యప్రాచ్యంలో తలనొప్పిగా తయారయ్యారని ఇజ్రాయెల్ ప్రకటనలు చేస్తూనే ఉంది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోకపోతే ఇజ్రాయెల్‌కు మనుగడ ఉండదని ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ రెండుసార్లు అమెరికా పర్యటన సందర్భంగా ట్రంప్‌తో అభిప్రాయాలు పంచుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

# యుద్ధం పెరక్కుండా వెనక్కి తగ్గండి

### ఇజ్రాయెల్– ఇరాన్‌లకు భారత్ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** యుద్ధాన్ని విస్తరించకుండా వెనక్కు తగ్గాలని ఇజ్రాయెల్–ఇరాన్ దేశాలకు భారత ప్రభుత్వం శుక్రవారంనాడు విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయెల్ దాడులు తీవ్ర ఆందోళన కలిగించాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అదేవిధంగా ఇరాన్, ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులు సురక్షిత ప్రదేశాలలో ఉండాలని, అవసరమైతేగానీ బయటకు రావొద్దని కోరింది. వీలైనంతవరకూ ఇళ్ళల్లోనే ఉండాలని కోరింది. ఇరాన్‌లోకి దూసుకువెళ్ళిన ఇజ్రాయెల్ క్షిపణులు, డ్రోన్లు అనేక ప్రాంతాలలో దాడులు చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడుతున్న తరుణంలో భారతదేశం ఇరాన్‌లో ఉన్న భారతీయులు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ''ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఇటీవల జరుగుతున్న పరిణామాలపట్ల మేం చాలా ఆందోళన చెందుతున్నాం, మధ్యప్రాచ్యంలో నెలకున్న పరిస్థితులను చాలా జాగ్రత్తగా గమనిస్తున్నాం, శుక్రవారంనాడు ఇరాన్ అణుస్థావరాలపై ఇజ్రాయెల్ చేసిన దాడులను కూడా చాలా జాగ్రత్తగా గమనిస్తున్నాం, రెండు దేశాలూ యుద్ధ వాతావరణానికి దూరంగా ఉండాలని, వెనక్కు తగ్గి ఉండాలని కోరుతున్నాం, యుద్ధం విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం'' అని భారత విదేశీవ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటన పేర్కొంది.

ఈ రెండు దేశాలతోనూ భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, అందువల్ల ఈ విషయంలో అన్నివిధాల సహాయ సహకారాలు అందించేందుకు, మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని పేర్కొంది. రెండు దేశాలలో ఉన్న భారతీయులతో భారత దౌత్యకార్యాలయాలు అందుబాటులో ఉన్నాయి, అక్కడ నివసించే భారతీయులకు తగిన ఆదేశాలు, జాగ్రత్తలు జారీచేశాం'' అని పేర్కొంది.

## 'ఆపరేషన్ రైజింగ్ లయన్ ' మా సొంత నిర్ణయం

**టెల్అవీవ్ :** ఇరాన్‌పై దాడి చేయాలన్నది తమ సొంత నిర్ణయమని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ ప్రకటించారు. ''ఆపరేషన్ రైజింగ్ లయన్'' పేరుతో ఇరాన్ కీలక అణుశుద్ధి కేంద్రాలపైన,సైనిక కేంద్రాలపైన ఇజ్రాయెల్ దాడి చేసింది. దాడి చేయాలన్న తమ నిర్ణయాన్ని ఎవ్వరూ ప్రభావితం చేయలేదని ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా ఖొమైనీ వ్యాఖ్యలకు సమాధానంగా నేతన్యాహూ చెప్పారు. ఇరాన్ నుండి తమకు అణు ప్రమాదం ఉందని, హమాస్ ఉగ్రవాదులను, హౌతీ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నది ఇరాన్ ప్రభుత్వమేననీ అనేకసార్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఒకవైపు అమెరికా–ఇరాన్ మధ్య ఆరో విడత అణు కట్టడి ఒప్పంద చర్చలు మరో 48 గంటల్లో ప్రారంభం కానున్నదశలో ఇజ్రాయెల్ దాడులు చేయడం గమనార్హం. ఐతే చర్చలు ఉన్నందువల్ల ఇజ్రాయెల్ దాడులు చేయకూడదని ట్రంప్ చెప్పడం కూడా ప్రత్యేక విశేషమే. గాజాలో గడచిన మార్చి నెల రెండో తేదీతో ఇజ్రాయెల్–హమాస్ మధ్య 45 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పూర్తయిన తర్వాత నుండి పరిస్థితులు చేజారి కొత్త పుంతలు తొక్కాయి. మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఆహారం సహా ఇతర మానవతా సహాయం రానివ్వకుండా ఇజ్రాయెల్ మూడునెలలపాటు అడ్డుకుంది. దీంతో గాజాలో కరువు పరిస్థితులు తాండవించాయి. అంతర్జాతీయ సమాజం గతంలో లేనివిధంగా తీవ్రస్థాయిలో ఇజ్రాయెల్‌పై ఒత్తిడిన పెంచాయి. సర్వత్రా ఇజ్రాయెల్‌కు తీవ్ర వ్యతిరేకత ఎదురుకావడంతో మానవతా సహాయాన్ని పరిమితంగా అనుమతించాలని నిర్ణయించింది. గాజాలో పరిణామాలపై ఇజ్రాయెల్‌కు ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. గాజాలో పరిస్థితులకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చరించింది. ఉనికిని కాపాడుకోవాలంటే హమాస్‌కు,హౌతీలకు మద్దతు ఇస్తున్న ఇరాన్‌ను, దాని అణుకార్యక్రమాన్ని దెబ్బ తియ్యాల్సిందేనని నేతన్యాహూ ఎప్పటినుండో చెబుతున్నారు.

## ఇజ్రాయెల్ పురిగొల్పింది

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ బలంగా వ్యతిరేకిస్తుందని తెలిపింది. ఇజ్రాయెల్‌ను నిలవరించేందుకు, హింసాత్మక చర్యలకు జవాబుదారీ చేసేందుకు అంతర్జాతీయ సమాజం, ప్రత్యేకించి ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. భారత ప్రభుత్వం మౌనాన్ని విడనాడి, అలీన విధానం,శాంతి, సార్వభౌమత్వంపై గౌరవంపై ఆధారిత మన దీర్ఘకాలిక విదేశాంగ విధానం ఆధారంగా దాడిని నిర్ద్వంద్వంగా ఖండించాలని సిపిఐ డిమాండ్ చేసింది. కాగా, ఇరాన్‌పై అమెరికా దాడులను సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే సైనిక చర్యలను నిలిపివేయాలని సిపిఐ(ఎం) మరో ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ చర్య ద్వారా ఇజ్రాయెల్ మరోసారి దూర్త దేశంగా వ్యవహరిస్తున్నట్లు నిరూపించుకున్నదని,పశ్చిమాసియా దేశాలపై ఇష్టానుసారం దాడులను చూస్తూ అంతర్జాతీయ చట్టాలు,సంప్రదాయాలనుఉల్లంఘించిందని విమర్శించింది. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉన్న విషయం అందరికీ తెలిసిందేనని, అమెరికా ప్రత్యక్ష లేదా బలమైన అండ లేకుండా ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌కు పాల్పడదని తెలిపింది. గత 20 మాసాలుగా పాలస్తీనాలో మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్ తాజాగా ఇరాన్‌పై చేసిన దాడి ద్వారా ఆ ప్రాంతంలో తన ఆధిపత్యానికి సమర్థవంతమైన సవాలు రాకుండా నిర్మూలిస్తున్నదని పేర్కొంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దుందుడుకు దాడి అమెరికా–ఇజ్రాయెల్ కూటమి ప్రాంతీయ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని రుద్దడంలో భాగంగా ఉద్దేశ్యపూర్వక వ్యూహమని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పేర్కొంది. ఈ దాడులపై మౌనంగా, ఏ చర్య తీసుకోకుండా ఉంటే అమెరికా–ఇజ్రాయెల్ కూటమితో భారత దేశం కుమ్మక్కైనట్లేనని విమర్శించింది. తాజా ఇజ్రాయెల్ దాడి ద్వారా శతృత్వాలను నిరోధించేందుకు ఐక్యరాజ్య సమితి తన బాధ్యతలను నిర్వర్తించడంతో మరోసారి విఫ లమైందని, అంతర్జాతీయసంక్షోభాలను ఎదుర్కొనడంలో అసమర్థతను నిరూపించు కుందని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎద్దేవా చేసింది.

## బ్లాక్ బాక్స్ లభ్యం

(మొదటి పేజీ తరువాయి)

వీలు కలుగుతుంది.

**డిజిటల్ వీడియో రికార్డర్‌ను స్వాధీనం**

కూలిన ఎయిర్ ఇండియా విమానం శిథిలాల నుంచి డిజిటల్ వీడియో రికార్డర్ (డివిఆర్) లభించింది. ప్రమాద స్థలానికి చేరుకున్న గుజరాత్ యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఎటిఎస్) అధికారులు దీనిని స్వాధీనం చేసుకున్నారు. 'ఇది ఒక డివిఆర్. దీనిని మేం శిథిలాల నుంచి స్వాధీనం చేసుకున్నాం. ఫోరెన్సిక్ ల్యాబ్ బృందం ఇక్కడికి వస్తుంది' అని ఎటిఎస్ అధికారి మీడియాతో అన్నారు. అయితే విమాన శిథిలాల్లో లభించిన డిజిటల్ వీడియో రికార్డర్ (డివిఆర్)ను పరిశీలించిన తర్వాత ఎయిర్ ఇండియా విమానం ప్రమాదం గురించి కొంత సమాచారం తెలిసే అవకాశమున్నది.

## మోదీ పరిశీలన (మొదటి పేజీ తరువాయి)

కొద్దిసేపటికే మేఘనినగర్ ప్రాంతంలోని బిజె మెడికల్ కాలేజీ కాంప్లెక్స్‌లోకి బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం (ఎఐ 171) కూలిపోయిన ప్రదేశంలో దాదాపు 20 నిమిషాల పాటు మోదీ పరిశీలించారు. పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్ మోహన్ నాయుడు, గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి విమానం కూలిపోయి కళాశాల, హాస్టల్‌లోకి ఎలా దూసుకెళ్లిందే ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆ తరువాత మోదీ సిటీ సివిల్ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ ఈ దుర్ఘటనలో ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి విశ్వాస్ కుమార్ రమేష్‌తో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడిన ఇతర వ్యక్తులను కూడా కలిశారు. ప్రధాని ఆసుపత్రిలోని సి7 వార్డును సందర్శించారు. అక్కడ 25 మంది గాయపడినవారు చికిత్స పొందుతుండగా, వైద్యులతో సంభాషించారు. అహ్మదాబాద్ విమానాశ్రయానికి సమీపంలోని గుజ్‌సెయిల్ కార్యాలయంలో మోడీ రాష్ట్ర, పౌర విమానయాన అధికారులతో సమావేశం కాగా, వారు మోదీకి విషాదం గురించి వివరించారు.

**ఆరుగురు మృతదేహాలను గుర్తించాం : చిరాగ్ గోసాయి**

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా 242 మందితో లండన్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కూలిపోయిన విషయం విదితమే. గురువారం పోస్ట్ మార్టం కోసం అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి తీసుకువచ్చిన 265 మృతదేహాలలో, ఇప్పటివరకు ఆరుగురు బాధితులను గుర్తించామని, వారి ముఖాలు చెక్కుచెదరకుండా ఉన్నాయని పోలీసు ఇన్‌స్పెక్టర్ చిరాగ్ గోసాయి తెలిపారు.

# మళ్లీ నోటీసులు (మొదటి పేజీ తరువాయి)

భారీ అవినీతి, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది. ముఖ్యంగా, హెచ్‌ఎండిఎ బోర్డు నిధులలో రూ.54.89 కోట్ల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్)ను ప్రధాన నిందితుడిగా (ఎ1) ఎసిబి కేసులో నమోదు చేసింది.ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ (ఎ2), హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డి (ఎ3) కూడా కేసులో నిందితులుగా ఉన్నారు.భుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఎసిబి విచారణ ప్రారంభించింది. కెటిఆర్‌ర్ సహ ఇతర అధికారులను ప్రశ్నించింది.కెటిఆర్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, డబ్బుల చెల్లింపులో తనకు సంబంధం లేదని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. 2024లో హైకోర్టు, డిసెంబర్ 30 వరకు కెటిఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది. దీంతో కెటిఆర్‌ను కేవలం గతంలో ఒకసారి విచారించారు. గత నెలలో ఎసిబి కెటిఆర్‌కు నోటీసులు జారీ చేసింది. కెటిఆర్ విదేశీ పర్యటనల కారణంగా విచారణకు హాజరయ్యేందుకు సమయం కోరారు. దీంతో ఎసిబి ఈ నెల 16న విచారణకు హాజరుకావాలని తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది.

**ప్రజల గొంతుకగా పోరాడుతున్న తమను అడ్డుకోలేరు :** చిల్లర చేష్టలు, పనికిరాని డ్రామాలతో ప్రతినిత్యం తెలంగాణ ప్రజల గొంతుకగా పోరాడుతున్న తమను సిఎం, కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోలేరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. చట్టాలను గౌరవించే పౌరునిగా, తాను తప్పకుండా ఈనెల 16న(సోమవారం ఉదయం 10 గంటలకు) ఎసిబి విచారణకు హాజరవుతానని, విచారణకు అన్ని విధాలుగా సహకరిస్తానని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నోటీసుల పేరుతో సిఎం రేవంత్ రెడ్డి నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి,ప్రభుత్వాన్ని నడపడం చేతకాని జోకర్ సిఎం ప్రజల దృష్టి మరల్చేందుకు పూటకో వేషం వేస్తున్నారని పేర్కొన్నారు ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హెచ్‌ఎండిఎ అధికారిక బ్యాంకు ఖాతా నుంచి పారదర్శకంగా,సాధికారికంగా పంపించిన రూ.44 కోట్లను ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్‌లోనే ఉన్నాయని, వాటిని వెనక్కి రప్పించడం చేతకాక సిఎం తనకు ఎసిబి నోటీసులు పంపించారని ఆరోపించారు. హైదరాబాద్ నగరానికి తెలంగాణకు ఎంతగానో పేరు తీసుకువచ్చిన ఫార్ములా ఈ రేసును అర్ధాంతరంగా రాజకీయ దురుద్దేశంతో సిఎం రద్దు చేసి,ఫార్ములా ఈ సంస్థ వద్ద ఉన్న రూ 44 కోట్లను వెనక్కి తీసుకొచ్చే ప్రయత్నం ఉద్దేశాపూర్వకంగా పక్కనపెట్టి, నోటీసుల పేరుతో ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకునేందుకు కుట్ర చేశారని కెటిఆర్ ఆరోపించారు.

## 571 పాఠశాలలు

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సిఎం ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని, డే స్కాలర్స్‌కు ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సిఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మరో ఐదు రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాగల ఐదు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుకుగా మారాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈనెల 14న నిర్మల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 15న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, 16, 17 తేదీల్లో ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో, 18న ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

### మతం పేరుతో ప్రజల్లో చిచ్చుపెడుతున్న...
# బిజెపి సర్కారు నుంచి దేశాన్ని రక్షించాలి

### సిపిఐ జగిత్యాల జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, చాడ పిలుపు

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** సోదరుల్లా కలిసిమెలిసి ఉంటున్న దేశ ప్రజల్లో మతం పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిచ్చు పెడుతోందని, మోదీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం నుంచి దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలోని దేవిశ్రీ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన జగిత్యాల సిపిఐ జిల్లా 4వ మహాసభలకు ఇరువురూ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో తొలుత కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ మతం పేరుతో ఎన్నికల్లో ఓట్లు దండుకుని ప్రజలకు మేలు చేయడంలో బిజెపి సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని, అదాని, అంబాని, టాటా, బిర్లా వంటి పెట్టుబడి దారుల గుత్తాధిపత్యంలోనే సంపద చిక్కుకున్నదని, ప్రధాని నరేంద్రమోదీ దళారుల కొమ్ముకాస్తున్నారని సాంబశివరావు ఆరోపించారు. ఎర్రజెండాకు గొప్ప చరిత్ర ఉందని, మనిషి ఉన్నంత కాలం ఎర్ర జెండా ఉంటుందన్నారు. దేశాన్ని కాపాడేది సైనికులైతే... సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులన్నారు. సిపిఐ నాయకులు పార్టీలు మారితే పెద్ద పదవులు పొందేవారని, ఎర్రజెండా నీడలోనే పేదలకోసం బతుకుతున్నామని, చనిపోతే ఎర్ర జెండా కప్పాలని కోరుకుంటున్నామని చెప్పారు. సిపిఐ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన సురవరం సుధాకర్‌రెడ్డి ఒకప్పుడు పార్టీ మారితే ఆయన ముఖ్యమంత్రి అయ్యేవారని, కానీ ఆయన పేదలకోసమే ఎర్ర జెండా నీడలోనే ఉన్నారని గుర్తు చేశారు. సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రసంగిస్తూ ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతూ పెంచి పోషిస్తున్న నరేంద్రమోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం నుండి దేశాన్ని రక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అమలుపర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు కావస్తున్నా రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందడంలేదన్నారు. పౌరహక్కుల నాయకులు, ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని ఆయన మండిపడ్డారు.



**'ఎరుపెక్కిన' జగిత్యాల...**

అంతకుముందు జగిత్యాల టవర్ సర్కిల్ నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన సిపిఐ శ్రేణుల ర్యాలీ ఎర్రసైన్యాన్ని తలపించింది. తహసీల్ చౌరస్తా మీదుగా జంబీగద్దె నుంచి దేవిశ్రీ గార్డెన్‌లో జరిగిన మహాసభ వరకూ ర్యాలీగా చేరుకుంది. జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, బీడి కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొక్కుల శాంత, సిపిఐ జిల్లా కోశాధికారి ఎం.డి ముక్రం, టిజెఎస్ జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు ఆముద లింగారెడ్డి, టిఫి జెఎసి స్టేట్ స్టీరింగ్ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ పొన్నం రాజమల్లు, నాస్తిక సంఘం జిల్లా నాయకుడు ఉప్పులేటి నరేష్, జిల్లా నాయకులు సుతారి రాములు, ఎన్నం రాధ, ఎద్దండి భూమయ్య, ఇరుగురాల భూమేశ్వర్, మోనుగూరి హన్మంతు, వెన్న మహేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణను కలిసిన మందకృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణను ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశాడు. హైదరాబాద్‌లోని నారాయణ నివాసంలో మంద కృష్ణ భేటీ అయ్యారు. ఈ సందర్భంగాఎస్‌సి వర్గీకరణ, చట్టసభల్లో బిసిల రిజర్వేషన్లు, కులగణన, తదితరఅంశాలపై సుమారు గంటసేపు చర్చించారు. అంతకుముందు నారాయణ మందకృష్ణ మాదిగను పద్మశ్రీ అవార్డ్‌ను వరించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. పద్మ శ్రీ అవార్డు పట్ల గతంలో భిన్నమైన అభిప్రాయం వుండేదని, కానీ పద్మశ్రీ అవార్ట్ ను మందకృష్ణకు ఇవ్వడం వల్ల ఆ అవార్డుకే గౌరవం వచ్చిందన్నారు. గతంలో మీడియా ముందు తను మాట్లాడిన ఇదే విషయాన్ని నారాయణ ఈ సందర్భంగా గుర్తు చేశారు. నమ్మిన ఆశయం కోసం, ఎత్తుకున్న ఎజెండా కోసం మూడు దశాబ్దాలపాటు అలుపెరగని పోరాట ఫలితమే ఈ పద్మశ్రీ అవార్డ్ అని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో క్లిష్ట పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవశ్యకత ప్రజాస్వామిక వాదులపై ఉన్నదని నారాయణ పేర్కొన్నారు. చిన్నచిన్న అంశాలను పక్కన పెట్టి, భిన్నాభిప్రాయాలు గౌరవిస్తూనే విశాల ప్రజా ఆకాంక్షల మేరకు కలిసి పనిచేయాల్సిన అవసరముందనిఆయన పేర్కొన్నారు.

# 16న రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె.రామకృష్ణా రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 16వ తేదీన వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనున్న రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు తెలిపారు. ఆ కార్యక్రమాన్ని అన్ని రైతు నేస్తం కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతునేస్తం కార్యక్రమానికి ప్రతి ప్రాంతం నుంచి కనీసం 250మంది రైతు ప్రతినిధులు హాజరయ్యే విధంగా కార్యక్రమాన్ని సముచితంగా నిర్వహించాలని కలెక్టర్లను కోరారు. రైతులు వ్యవసాయ నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 500 కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని విస్తరించి, ఈ నెల 16 నుండి అదనంగా మరో 1000 కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ సదుపాయం ద్వారా నిపుణులు ఏ పంటలు వేసుకోవాలి, ఆధునిక సాగు విధానాల గురించి రైతులకు తరచూ సూచనలు ఇస్తారని సిఎస్ వివరించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రతి రైతునేస్తం కేంద్రంలో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారితో పాటు మండల స్థాయి అధికారిని నియమించాలని కలెక్టర్లను కోరారు.

## రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మరోసారి 'ఫార్ములా ఈ కార్ రేసింగ్' నోటీసులు

### హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే 'ఫార్ములా ఈ కార్ రేసింగ్' వ్యవహారంలో కెటిఆర్‌కు మరోసారి నోటీసులు జారీ చేశారని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కెటిఆర్‌ను ఆయన నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే సిఎం రేవంత్ రెడ్డి నోటీసులు పంపించారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందని, పెట్టుబడులు కూడా వచ్చాయని, తెలంగాణ ప్రతిష్ట పెంచినందుకే కెటిఆర్‌కు నోటిసుల ఇచ్చారా అని హరీశ్ రావు ప్రశ్నించారు.

**రాజకీయ కక్ష సాధింపులో భాగమే నోటీసులు : కవిత**

ఇదిలా ఉండగా కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు జారీ చేయడాన్ని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత శుక్రవారం ఖండించారు. ఈ మేరకు ఆమె తనట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కెటిఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఆరోపించారు.

## 'జనసాక్షి' ఎడిటర్‌పై కేసులను ఉపసంహరించుకోవాలి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జనసాక్షి పత్రిక ఎడిటర్ ఎంఎం రహమాన్‌పై పోలీసులు నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాదులో ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా పెద్దదాన్వాడ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల ఏర్పడే దుష్ఫలితాల నేపథ్యంలో గత ఎనిమిది నెలలుగా అక్కడి ప్రజలు, రైతులు చేస్తున్న పోరాటాలను జనం సాక్షి పత్రిక వరుస కథనాలను ప్రచురిస్తుందన్నారు. దీంఓ అక్కసు పెంచుకున్న ఫ్యాక్టరీ యజమాన్యం ఎడిటర్ రహమాన్ పై ప్రధాన నిందితుల జాబితాచేర్చడం భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు లాంటిదని తెలిపారు. తక్షణమే అతనిపై పెట్టిన కేసులు అన్నిటిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే.. 50 హార్డ్‌డిస్క్‌లను నాశనం చేశాం

### ఎస్ఐబి మాజీ డిఎస్‌పి డి.ప్రణీత్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ బాస్ ఎస్ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాను ఎస్ఐబి కార్యాలయంలో ఉన్న 50 హార్డ్‌డిస్క్‌లను నాశనం చేశామని సిట్ విచారణలో ఎస్ఐబి మాజీ డిఎస్‌పి డి.ప్రణీత్‌రావు వెల్లడించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కేసులో రెండుసార్లు ప్రభాకర్‌రావును విచారించిన తరువాత అతను వెల్లడించిన అంశాలను రుఢీ చేసుకునేందుకు ఇదే కేసులో నిందితుడైన ప్రణీత్‌రావును నాలుగు గంటల పాటు వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్ నేతృత్వంలో జూబ్లీహిల్స్ ఎసిపి పి. వెంకటగిరి సహా ఐదుగురు సభ్యుల విచారించింది. ఈ రకంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను దర్యాప్తు అధికారులు వేగం పెంచారు. పరారీలో ఉన్న నిందితులందరు హైదరాబాద్ చేరుకోవడంతో వారం రోజుల నుంచి ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ బృందం ఎడతెరిపిలేకుండా విచారణను కొనసాగిస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ ఫోన్ ట్యాపింగ్ బండారం బట్టబయలవుతుందని, వెంటనే కార్యాలయంలో ఉన్న హార్డ్‌డిస్క్‌లను మాయం చేయాలని ప్రభాకర్‌రావు ఆదేశించడాని వెల్లడించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే తాను కార్యాలయంలో ఉన్న సిసికెమెరాలను ఆఫ్ చేసి హార్డ్‌డిస్క్‌లను కార్యాలయం నుంచి దొంగిలించి ఎత్తుకెళ్లడం జరిగిందని, వాటి స్థానంలో కొత్త హార్డ్‌డిస్క్‌లను అమర్చడం జరిగిందని ప్రణీత్‌రావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కోసం ఎస్ఐబిలో స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఒటి)ని ఏర్పాటు చేయడం కూడా ప్రభాకర్‌రావు ఆదేశాలమేరకే చేశామని వెల్లడించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్‌లో వరంగల్ జిల్లాకు చెందిన కొంత మంది ఇన్‌స్పెక్టర్లు కూడా సహకరించారని విచారణలో తెలిపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రణీత్‌రావు గతంలోనే ఈ కేసులో అరెస్టై ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. ప్రణీత్‌రావు వెల్లడించిన అంశాలపై శనివారం ప్రభాకర్‌రావును సిట్ అధికారులు మరోసారి విచారించనున్నారు. ఇదే కేసులో అరెస్టై బెయిల్‌పై ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావును కూడా మరోసారి విచారించనున్నారు. శనివారం ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావును ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

# పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ప్రభుత్వం

### గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
### అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పార్టీలు రాజకీయాలకతీతంగా పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, కరీంనగర్ సుధా చైర్మన్ కే నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావులతో కలిసి శుక్రవారం పెద్దపల్లి జిల్లాలో పర్యటించి ఎలిగేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన పోలీసు స్టేషన్ కార్యాలయం, సమీకృత కలెక్టరేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటుచేసిన మహిళా పోలీస్ స్టేషన్ లను ప్రారంభించారు. పెద్దపల్లి పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చందపల్లి రాంపల్లి గ్రామంలో నిర్మించిన 466 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చందన్ పల్లి గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు ఉంటూ సంక్షేమం కోసం కృషి చేసే నాయకుడు పెద్దపెల్లి ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సన్న బియ్యం లో పురుగులు ఉన్నాయని కొందరు రాజకీయాల కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు అటువంటివారిని ఈసడించుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు.గత పాలకుల హయాంలో పేదల కోసం ఇల్లు నిర్మించ లేదని వారి కోసం మాత్రం పెద్ద పెద్ద భవనాలు కట్టుకున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 22 వేల 500 కోట్లతో మొదటి విడతలో 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేసిందని, రాబోయే 3 సంవత్సరాలలో మొత్తం 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.రాజకీయాలకతీతంగా నిరుపేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరుచేశామని, రాబోయే 3 సంవత్సరాలలో మరో మూడు విడతలుగా ఇండ్లు ఇస్తామన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మౌలిక వసతులు కల్పించి అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్, డిసిపి కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి.వేణు, జే.అరుణశ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ ,ప్రజా ప్రతినిధులు, అధికారులుపాల్గొన్నారు.



## త్వరలోనే రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో త్వరలోనే రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీహెచ్ఎంసి, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు ఇస్తూ ప్రభుత్వం జిఓ జారీ చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి. వెంకటేశం, నేతలు వి. మారయ్య, రామకృష్ణ (బిఆర్‌టియు), ఖాజా భాయ్ (ఎఐటియూసి) వి.ప్రవీణ్, లింగం గౌడ్ (టియుసిఐ) తదితరులు శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో ఎజెఎసి నేతలు మంత్రిని ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం తక్షణమే ఆటో మీటర్ చార్జీలు పెంచాలని మంత్రిని కోరారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల ఆర్థిక సహాయం అందించాలని, మంత్రికి విజ్ఞప్తి చేశారు. సిఎంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.





## కార్మిక సమస్యలపై ఉమ్మడి ఎజెండాతో పనిచేద్దాం

### టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న పిలుపు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మిక సమస్యలపై ఉమ్మడి ఎజెండాతో పనిచేద్దామని టిజిఎస్ ఆర్‌టిసి చైర్మన్ ఈదురు వెంకన్న పిలుపునిచ్చారు. టిజిఎస్ ఆర్‌టిసి కార్మిక సంఘాల సమావేశం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఎస్‌వికె కేంద్రంలో శుక్రవారం ఈదురు వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇ.అశ్వత్థామ రెడ్డి జెఎసి తరపున ప్రతినిధులు రాజలింగం (టిఎంయు), కమాల్ రెడ్డి (ఎన్‌ఎంయు) హాజరుకాగా, ఎస్‌డబ్ల్యూఎఫ్ నుండి రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కె. హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి. యాదగిరి మాట్లాడుతూ టిజిఎస్ ఆర్‌టిసిలో ఉన్న కార్మిక సంఘాలు అన్ని ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సమిష్టి ఎజెండాతో పనిచేద్దామన్నారు. ఈ సమావేశానికి హాజరైన అన్ని కార్మిక సంఘాలు జెఎసి ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేశాయని తెలిపారు. అయితే ఎస్‌డబ్ల్యూయు, బిఎంఎస్, ఎస్‌టిఎంయు సంఘాలు హాజరు కానందున, ఈనెల 24వ తేదీన మరోసారి సమావేశం కావాలని నిర్ణయించామని తెలిపారు. ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధులు బి. యాదయ్య, మీడియా ఇన్‌చార్జ్ పి.అప్పారావు, ఎం.వెంకట్ గౌడ్, ఎన్. కమలాకర్, గోలి రవీందర్, రహిమొద్దీన్, స్వాములయ్య, రాములు, రాంచందర్, రాంరెడ్డి, ఎ.జ్యోతి, మాజీద్, వి.బాబు, కె.ఎస్. పాల్, పాపయ్య గౌడ్ పాల్గొన్నారు.

## 16న రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సామూహిక దీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగ విరమణ ప్రయోజనాలను తక్షణమే అందజేయాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఉపాధ్యాయలు, ఉద్యోగులు ఈనెల 16న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నారు. సంఘాలకు అతీతంగా నిర్వహించనున్న ఒక్కరోజు సామూహిక దీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు డి.బాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రండి

## 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ఇతర రాష్ట్రాలకు సంక్షేమం, అభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పలు దేశాల ప్రతినిధులను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం బంజారాహిల్స్ తాజ్ దెక్కన్ హోటల్ లో 'ఇంటర్నేషనల్ బిజినెస్ కొలాబరేషన్(ఐబిసి)' ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్ 2025'ను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. 'మొదట్లో చాలా మంది తెలంగాణ ఏర్పాటు అసాధ్యమన్నారు. కానీ.. ఆనతి కాలంలోనే తెలంగాణ అన్ స్టాపబుల్ అనే స్థాయికి ఎదిగింది. రాష్ట్ర జిడిపిరూ.16.12 లక్షల కోట్లకు చేరింది. 10.1 శాతం వృద్ధి రేటుతో దేశ సగటు (9.9%)ను దాటేసింది. తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు. ఇది దేశ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ. ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సేకరించగలిగాం. గత 14 నెలల్లో లైఫ్ సైన్సెస్ లో రూ. 40వేల కోట్ల పెట్టుబడులను సాధించాం. 2 లక్షల ఉద్యోగాలు సృష్టించాం. రాష్ట్ర జిడిపిలో సేవల రంగం వాటా 66.3 శాతం. దేశంలో ఇది 55 శాతంగా ఉంది. ఇవి అంకెలు కాదు... తెలంగాణ పురోగతికి నిదర్శనాలు' అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'ప్రతి భాగస్వామ్యం ఒక లావాదేవీ కాదు... అది ఒక మార్పు. అందుకే అంతర్జాతీయ భాగస్వామ్యాలతో తెలంగాణ పురోగతిని మరో అడుగు ముందుకు తీసుకెళ్లాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆగ్రో ఇన్నోవేషన్, ఏఐ గవర్నెన్స్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, డిజిటల్ ఫార్మింగ్, ఫ్యూచర్ రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మానుఫ్యాక్చరింగ్, క్లీన్ ఎనర్జీ తదితర అంశాల్లో ప్రపంచ దేశాలతో పని చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. 'మిగిలిన రాష్ట్రాలు ట్రెండ్ను అనుసరిస్తే... తెలంగాణ దాన్ని సృష్టిస్తుంది. అందుకే కేవలం ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు మాత్రమే రావొద్దు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు కలిసి రండి' అని పిలుపునిచ్చారు. 'బ్రెజిల్, జర్మనీ, రష్యా, కామెరూన్, మాల్టా, యూకే, బల్గరేయా, బెల్జియం, యూఏఈ, దుబాయి తదితర 25 దేశాల ప్రతినిధులు ఒకే వేదిక పైకి రావడం శుభపరిణామమన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించండి' అని కోరారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ డిప్లోమేటిక్ రిలేషన్స్(ఐవోడీఆర్) మాల్టా గవర్నర్ లిల్లో మ్రా, కార్యదర్శి మార్సెల్లో పట్టి, బెల్జియం ఎంపీ ఇవాన్ పెట్రోవ్, జర్మనీ డిప్లొమాట్ డానియల్ జెర్బిన్, అర్జెంటీనా ఎంపి క్లాడియో సింగోలనీ, ఐబిసి ఛైర్మన్ సాల్మన్ గట్టు, డైరెక్టర్ గ్లోరియా సుహాసిని పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **UPPALANCHI AMMULU, S/o. UPPALANCHI LAKSHMAN,** (old Name), Sy.No. 87, Mahalakshmi Residency, Kompally, Quthbullapur, KV Rangareddy Dist. 500014, Telangana state, has my name changed as **UPPALANCHI NANDINI, S/o. UPPALANCHI LAKSHMAN** (New Name) for all purposes

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 01/EE-I(H)/GHMC/2025-2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 12.06.2025

**పని పేరు:** భద్రతా ఏర్పాట్లు, **మొత్తం:** 01 పని, **అంచనా విలువ:** రూ. 6.79 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభం తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 13.06.2025న సా.04.00గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 21.06.2025న మ.03.30గం.ల వరకు, **అధికారి చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I (హౌసింగ్), జిహెచ్ఎంసి. ఫోన్ నం. 7331189771. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I (హౌసింగ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 3530-PP/CL/ADVT/1/2025-26, Date: 13-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్.

NIT No. Engg-05/GHMC/PTC-C-22/2025-26 షార్ట్ టెండర్ ప్రకటన తేది: 11.06.2025

**పని పేరు:** 1 నెం. వరద నీటి కాలువ, 1 నెం. సిసి రోడ్, **అంచనా విలువ / ఇసివి:** రూ.62.00లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 14.06.2025న ఉ.10.30గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం:** 20.06.2025న మ.3.00గం.ల వరకు, ఇ.ఇ. **పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22. ఫోన్ నెం. 9154167952. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 3554-PP/CL/ADVT/1/2025-26, Date: 13-06-2025

ప్రజాపక్షం
శనివారం, 14 జూన్

# పెను విషాదం

అహ్మదాబాద్‌లో గురువారం (జూన్ 12) మధ్యాహ్నం సంభవించిన ప్రయాణికుల విమాన ప్రమాదం భారత పౌర విమానయాన చరిత్రలో అరుదైన పెను విషాద సంఘటనల్లో ఒకటిగా మిగిలిపోతుంది. సర్దార్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎయిర్ ఇండి యా బోయింగ్ 787–8 డ్రీమ్ లైనర్ 242 మందితో (230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది) బయలుదేరిన కొద్దిసేపటికే బిజె మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాలపై కూలిపోయి ముక్కలైంది. ఆయిల్ టాంక్‌లు పేలిపోయి అగ్నిజ్వాలలు ఎగిసిపడ్డాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. శిథిలమైన విమానంలో మంటల్లో చిక్కుకున్న ప్రయాణికులు, సిబ్బంది మాడి మసి అయిపోయారు. మొత్తం 242 మందిలో ఒక్క వ్యక్తి మినహా అందరూ విగత జీవులైనారు. రమేష్ అనే ఆ వ్యక్తి ఎమర్జెన్సీ ద్వారం నుంచి దూకి స్వల్ప గాయాలతో బయటపడడం ఒక అద్భుతం. విమానం మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాలను ఢీకొట్టడంతో 28 మంది డాక్టర్లు, మెడికోలు, ఇతరులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య 269 అయింది.

ఆ ప్రాంతమంతా మరుభూమిగా మారింది. చాలా భవనాలు దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు పూర్తి అయితే మరికొన్ని మృతదేహాలు బయటపడవచ్చు. గాయపడిన స్థానికులు 50 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విమాన ప్రమాదానికి కారణాలేమై ఉంటాయా అని ఎలక్ట్రానిక్ మీడియా రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ బ్లాక్ బాక్సు ఆ రికార్డింగ్‌లను విశ్లేషిస్తే తప్ప అసలు కారణాలు తెలిసే అవకాశం లేదు. ఈలోపు డిజిసిఎ దర్యాప్తు బృందం, ప్రభుత్వం నియమించే ఉన్నత స్థాయి కమిటీలు పలు కోణాల నుంచి అధ్యయనం చేసి విమానయాన భద్రతను మరింత కట్టుదిట్టం చేసే సిఫారసులు చేస్తాయి. అసువులు బాసిన వారిలో 169 మంది భారతీయులు, 52 మంది బ్రిటీషర్లు, 7గురు పోర్చుగీసు, 1 కెనడియన్, ఇద్దరు పైలెట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బంది.

దిగ్భ్రాంతికరమైన ఈ ప్రమాదం హృదయాలను కలచివేసింది. ప్రమాద ప్రదేశం మరీ భయానకం. దగ్ధపటలమైన ఆ ప్రాంతం శిథిలాలతో చెల్లాచెదురుగా ఉండటమే గాక అగ్ని జ్వాలలకు పొగ చూరిపోయింది కాలిపోయిన మృతదేహాలు కొన్ని కుచించుకుపోయాయి, కొన్ని గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. కాబట్టి మృతదేహాలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అందజేయడం ఎంతో కష్టతరం. డాక్టర్లు ప్రయాణికులందరి డిఎన్‌ఏ తీసుకున్నారు. రక్తసంబంధీకులుగా మృతుల అవశేషాల కోసం ముందుకు వచ్చిన వారి డీఎన్‌ఏ సరిచూసుకొని అందజేస్తారు. ఈలోపు కొన్ని శవ అవశేషాలు కుళ్లిపోతాయి. రాజధానిలోనే ఈ ప్రమాదం సంభవించినందున సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగడం సాధ్యమైంది.

ఇప్పుడు ఎయిర్ ఇండియా ప్రభుత్వ సంస్థ కాదు, టాటాల సంస్థ. వారు మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. మెడికల్ కాలేజీ హాస్టల్‌ను పునర్నిర్మించి ఇస్తామన్నారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదం 47 సంవత్సరాల క్రితం 1978 జనవరి 1న ఎయిర్ ఇండియా బోయింగ్ 747 –237 బి(దాని పేరు ఎంపరర్ అశోక) ముంబయి విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే అరేబియా సముద్రంలో కూలిన ఘటనను గుర్తుకు తెస్తున్నది. రాత్రిపూట జరిగిన ఆ ప్రమాదంలో 190 మంది ప్రయాణికులు, 23 మంది సిబ్బంది –అందరూ చనిపోయారు. 1985 జూన్ 23న ఏఐ 182 (ఎంపరర్ కనిష్క) అట్లాంటిక్ సముద్రంపై ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తుండగా టెర్రరిస్టు దాడికి గురైంది. అందులోని 307 మంది ప్రయాణికులు, 22 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగినప్పుడల్లా భద్రత చర్యల కట్టుదిట్టంపై సమీక్షలు జరుపుతూ మెరుగుదల సాధిస్తూ ముందుకు సాగటమే జీవితం.

# ఔను వాళ్లిద్దరూ విడిపోయారు...
# తిరిగి దగ్గరవ్వాలని చూస్తున్నారు!



ఎం. కోటేశ్వరరావు

కేవలం మూడు నిమిషాల్లోనే విడిపోయిన జంట ఉదంతం ప్రపంచంలో అత్యంత తక్కువ సమయం మనుగడ సాగించిన వివాహంగా చరిత్రలో నమోదైంది. కువాయిట్‌లో 2019లో ఇది జరిగింది, ప్రమాదవశాత్తూ తూలిపడిన వధువును బుద్ధిలేనిదానా అని తిట్టిన వరుడు తనకు అక్కర లేదనటంతో కోర్టుకు ఎక్కారు. అంతకు వందేళ్ల క్రితం ఒక హాలీవుడ్ జంట కేవలం 20నిమిషాల్లోనే విడిపోయింది. వివాహం మీద పునరాలోచనలో పడ్డ నటి భర్తను హానీమూన్ రూమ్‌లో పెట్టి బయట తాళం వేసి వెళ్లిపోయిందట. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్, ప్రపంచ అగ్రరాజ్య అధిపతి డోనాల్డ్ ట్రంప్ ప్రేమాయణం చెడింది. ఇద్దరూ లాభాలు తప్ప మరొకటి పట్టని పక్కా వ్యాపారులే. ఛీ పో అంటే ఛా పో అనుకున్నారు, అంతలోనే మరోసారి దగ్గరయ్యేందుకు చూస్తున్నారు, సిగ్గూ ఎగ్గులేని బతుకులు. ప్రేమలో పడటానికి, విడిపోవటానికి, తిరిగి దగ్గర కావటానికి డాలర్లు తప్ప మరొక అంశాన్ని ఊహించటం కష్టం. జెఫ్రీ ఎప్‌స్టెయిన్ అనే అమెరికన్ పక్కా తిరుగుబోతు, తార్పుడుగాడు. పద్నాలుగు, పదిహేనేండ్ల ఆడపిల్లలను వలవేసి పట్టటం అనుభవించటం, బడాబాబులకు తార్చటం, తద్వారా లబ్దిపొందటం వాడి చరిత్ర. 2019లో జైల్లో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. వాడి గురించి దర్యాప్తు చేసిన పోలీసులు సేకరించిన సమాచారాన్ని జెఫ్రీ ఫైల్స్ అంటున్నారు. వాటిలో డోనాల్డ్ ట్రంప్ పేరు ఉందన్నది తాజాగా ఎలన్ మస్క్ పేల్చిన బాంబు. అందుకే వాడిని జైల్లో లేపేశారని బయటకు ఆత్మహత్య చేసుకున్నాడని కథలు అల్లారని చెబుతారు. వీడి ఖాతాదార్లలో ట్రంప్ ఉన్నట్లు ఎక్స్ చేసిన మస్క్ దాన్ని వెనక్కు తీసుకున్నాడు. డోనాల్డ్ ట్రంప్ పేరు ఎప్‌స్టెయిన్ ఫైల్స్‌లో ఉంది, అందుకే వాటిని బహిర్గత పరచలేదు అని మస్క్ పేర్కొన్నాడు. తరువాత దాన్ని తొలగించాడు. దీని మీద తన సామాజిక మాధ్యమం ట్రూత్‌లో నాకు వ్యతిరేకంగా ఎలన్ మస్క్ మారటాన్ని నేను పట్టించుకోను అన్నాడు ట్రంప్, ఎయిర్ ఫోర్స్ ఒన్ విమానంలో ప్రయాణిస్తూ దాని గురించి నేనసలు ఆలోచించటం లేదన్నాడు.అయితే మస్క్ కంపెనీలతో ప్రభుత్వ కాంట్రాక్టుల గురించి ప్రతి అంశాన్ని పరిశీలిస్తామన్నాడు. డెమోక్రటిక్ పార్టీకి నిధులు ఇస్తే సంగతి చూస్తానని బెదిరించాడు.

ట్రంప్‌ను పదవి నుంచి అభిశంసన ద్వారా తొలగించాలని మస్క్ అన్నాడు. అదే నోటితో లాస్ ఏంజల్స్‌లో వలస కార్మికుల నిరసనలను అణచివేసేందుకు మిలిటరీని దింపిన ట్రంప్‌ను పొగుడుతున్నాడు. మస్క్‌తో మాట్లాడేదేలేదు అన్న ట్రంప్ మాట మార్చాడు. మస్క్ ఫోన్ చేస్తే మీరు మాట్లాడతారా అన్న విలేకర్ల ప్రశ్నకు దాని గురించి నిజంగా నేను ఆలోచించలేదు, నేను ఊహించగలను, దాని గురించి ఆలోచిస్తా అన్నాడు తప్ప అవునని కాదని చెప్పలేదు. దోచుకొనేదగ్గర, వాటాల పంపిణీలో దెబ్బలాట, జనాన్ని అణచటంలో ముద్దులాట. వర్గనైజం ఇది. ఎలన్‌మస్క్ పెద్ద వ్యాపారి, పారిశ్రామికవేత్త. తన టెస్లా కార్లను అమ్ముకోవాలన్నా, స్టార్‌లింక్‌ను పలుదేశాల్లో ఏర్పాటు చేయాలన్నా అమెరికా పాలకుల అండకావాలి. మన నరేంద్రమోడీ ఇటీవలనే అనుమతించటం దానికి పక్కా నిదర్శనం. డెమోక్రటిక్ పార్టీ మద్దతుదారుగా ఉన్న ఆ పెద్దమనిషి అందుకోసమే డోనాల్డ్ ట్రంప్‌కు ఎన్నికల విరాళాల రూపంలో ఆర్థికంగా భారీ మొత్తంలో సమర్పించుకున్నాడు. అధికారానికి వచ్చిన మరుసటి రోజు నుంచే సతాయించటం మొదలు పెట్టాడు. రానున్న రోజుల్లో వినియోగదారులందరూ విద్యుత్ కార్లే కొనుగోలు చేయాలంటూ ఒక విధాన నిర్ణయం చేయాలని, వాటి మీద ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని పెంచాలని, వారికి అందుబాటులో మూలమూలనా చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాడు. ట్రంప్ దానికి అంగీకరించలేదు. ఎందుకని ? అమెరికా కార్ల కంపెనీల యజమానుల చరిత్రను చూసినపుడు తమ కార్లను అమ్ముకొనేందుకు ప్రజారవాణా వ్యవస్థలైన బస్సులు, రైళ్లను, ట్రామ్‌లను పక్కన పెట్టేసే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి విజయవంతమయ్యారు. వారికి పెట్రోలు, డీజిలు అమ్ముకొనే కంపెనీలు వత్తాసు పలికాయి. ఎక్కడో దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన ఎలన్ మస్క్ ప్రపంచ కుబేరుడు కావచ్చు కానీ ఇప్పటికే ఉన్న చమురు కార్ల పరిశ్రమ మొత్తాన్ని మూసివేయించేంత మొనగాడా అది జరిగితే నీ సంగతి తేలుస్తామని ఆ రంగంలోని కంపెనీలు ట్రంప్‌ను హెచ్చరించటంతో ఇరకాటంలో పడి వెనక్కు తగ్గాడు. వారి మధ్య వైరానికి అసలు కారణం ఇదే !



ఎలన్ మస్క్, డోనాల్డ్ ట్రంప్‌ల అక్రమ సంబంధాలు జగమెరిగిన సత్యం. ఇంతకు ముందు గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్జీ బెన్ భార్య నికోలే సహాన్‌తో మస్క్ పెట్టుకున్న అక్రమ సంబంధం కారణంగా వారిద్దరూ విడిపోయారు. తాజా ఉదంతానికి వస్తే అమెరికా అధ్యక్ష భవనంలో ఉన్నత అధికారిగా పనిచేస్తున్న స్టెఫాన్ మిల్లర్ భార్య కాటీ మిల్లర్‌తో సంబంధం పెట్టుకున్నట్లు గుప్పుమంది. ట్రంప్ మీద ఆగ్రహంతో మస్క్ డోజ్ పదవికి రాజీనామా చేసి బయటకు వెళ్లినపుడు అప్పటి వరకు అధ్యక్ష భవనంలో ఉద్యోగిగా ఉన్న కాటీ కూడా రాజీనామా చేసి ఎలన్ మస్క్ కంపెనీలో పని చేసేందుకు వెళ్లిపోయింది. వేరే సందర్భంలో స్టెఫాన్ మిల్లర్ "అమెరికాను తిరిగి వెనక్కు తీసుకువచ్చాం" అని ఎక్స్‌లో పోస్టు పెట్టాడు. దాని మీద మస్క్ స్పందిస్తూ "నేను నీ భార్యను తీసుకుపోయినట్లేనా" అని వ్యాఖ్యానించాడు. అయితే అదంతా నిజం కాదని తానలాంటి పోస్టు పెట్టలేదని మస్క్ చెప్పుకున్నప్పటికీ అప్పటికే జరగాల్సిందంతా జరిగిపోయింది. తన స్వంత కృత్రిమ మేథ గ్రోక్‌ను సంప్రదిస్తే అది కూడా మస్క్ పెట్టిన పోస్టు స్క్రీన్ షాట్ నిజమే అని చెప్పిందట. అమెరికా స్టాక్ మార్కెట్ వీటిని పెద్దగా పట్టించుకోదు. ఇద్దరూ రాజీబాటలో ఉన్నారని సంతృప్తి వ్యక్తం చేయటంతో మస్క్ కంపెనీల వాటాల ధరలు స్వల్పంగా పెరిగినప్పటికీ పడిపోయన నాటి స్థాయికి చేరలేదు. వెంటనే వారిద్దరూ కలవక పోయినా కొన్ని నెలలకు పూర్తిగా సర్దుకుంటారని భావిస్తున్నారు. ఇద్దరి మధ్య సంబంధాలు బాగున్నాయని అందరూ భావించినపుడు మార్చి నెలలో ట్రంప్ ఒక ఎర్ర టెస్లా కారు ముందు నిలిచి దానిని కొనుగోలు చేసినట్లు ఫొటోలకు ఫోజులిచ్చాడు. దాన్ని ఇప్పుడు వదిలించుకోవచ్చని అధ్యక్ష భవన సిబ్బంది చెబుతున్నారు.

మాజీ డెమోక్రాట్ అయిన మస్క్ 2016లో ట్రంప్ తొలిసారి అధికారానికి వచ్చినప్పటి నుంచి వాణిజ్య సలహా మండళ్లలో చోటు సంపాదించుకున్నాడు. రెండోసారి ఓడిపోయిన తరువాత ఇక చాల్లే మళ్లీ పోటీకి దిగవద్దన్నాడు. ఫ్లోరిడా గవర్నర్ దేశాంటిస్ పోటీ చేస్తే తాను మద్దతు ఇవ్వకపోయినా జో బైడెన్ మీద గెలుస్తాడని ఎక్స్ చేశాడు. కానీ 2024లో ట్రంప్‌కు అన్నీ తానే అన్నట్లు వ్యవహరించాడు. అతగాడి కోసమే తొలిసారిగా రిపబ్లికన్ పార్టీకి ఓటు వేశానన్నాడు. అమెరికా అధికారపీఠంపై అనుచరులతో ట్రంప్ దాడి చేయించినపుడు ఎక్స్ ఖాతాను రద్దు చేశారు. తరువాత దాన్ని మస్క్ కొనుగోలు చేసిన తరువాత 2022 చివరిలో పునరుద్ధరించాడు. ట్రంప్ సొంతంగా ట్రూత్‌సోషల్ అనే వేదికను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ట్రంప్ కేసుల్లో ఇరుక్కునపుడు ఐదు కోట్ల డాలర్లు మస్క్ ఇచ్చాడు. ట్రంప్ ఎన్నడూ తనను డబ్బు అడగలేదని తానే ఇచ్చినట్లు చెప్పుకున్నాడు. ఎన్నికల్లో 25 కోట్ల డాలర్లు ఖర్చు చేశాడు. అధికారానికి వచ్చిన తరువాత మస్క్ గొంతెమ్మ కోర్కెలు తీర్చే అవకాశం లేదని ట్రంప్ పక్కన పెట్టటం ప్రారంభించాడు, ఇచ్చిన పదవితో పండగ చేసుకో అన్నాడు. విద్యుత్ వాహనతయారీదారులు కష్టకాలంలో ఉన్నారు. వారు బిలియన్ల డాలర్లను సబ్సిడీగా ఇవ్వాలని కోరుకుంటున్నారు, అది సాధ్యం కాదనటంతో మస్క్ ఆశాభంగం చెందాడని ట్రంప్ చెప్పాడు. తన మద్దతు లేకపోతే రిపబ్లికన్లు ఓడిపోయి ఉండేవారని, కృతజ్ఞత చూపలేదని మస్క్ అంటే అతగాడికి పిచ్చి ఎక్కిందని, తానింకే మాత్రం అతగాడి గురించి ఆలోచించనని ట్రంప్ బదులిచ్చాడు. నేను చైనా, రష్యాలతో, ఇంకా చాల సమస్యలతో తీరిక లేకుండా ఉన్నాను, ఎలన్ గురించి ఆలోచించటం లేదు, మీకు తెలుసు అతగాడు బాగుండాలని కోరుకుంటున్నా అన్నాడు. గుడిలో లింగాన్ని, గుడినీ మింగాలనుకున్న మస్క్ ఇచ్చిన పదవితో సంతృప్తి చెందలేదు. దాంతో ఇద్దరూ రోడ్డెక్కారు. మస్క్ త్వరలో బయటకు వెళ్లిపోతాడని ట్రంప్ తన కాబినెట్, ఇతర ముఖ్యులతో వ్యాఖ్యానించినట్లు ఏప్రిల్ రెండవ తేదీన పొలిటికో పత్రిక రాసింది. మే చివరి వారంలో పదవీ కాలం ఒక రోజు ఉండగానే రాజీనామా చేశాడు.

ఈ బాగోతం చూసిన తరువాత సామాజిక మాధ్యమం, రాజకీయ వర్గాల్లో జోకులే జోకులు. సముచితమైన ఫీజు కింద మాకు స్టార్‌లింక్ కంపెనీ వాటాలు ఇస్తే ఇద్దరి మధ్య రాజీకుదుర్చుతాం, దెబ్బలాడుకోవద్దు అంటూ రష్యన్ మాజీ అధ్యక్షుడు మెద్వెదేవ్ చమత్కరించాడు. కావాలంటే మస్క్‌కు రాజకీయ ఆశ్రయం కల్పిస్తామని రష్యా ఇతర నేతలు చెప్పారు. ఎలన్ ఆశాభంగం చెందవద్దు, అమెరికాలో అసాధ్యమైన సమస్యలను ఎదుర్కొంటే మా దగ్గరకు రండి మాలో ఒకరిగా మారండి, మీ సాంకేతిక నైపుణ్యానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుం ది ఇక్కడ నిజమైన స్నేహితులు ఉన్నారంటూ ఎక్స్‌లు చేశారు. ఎవరెన్ని మాట్లాడినా ఒక డాలరు విలువ చేయవు అన్నది ట్రంప్, మస్క్ తీరు. ఈ మొత్తం ఉదంతంలో అంతిమంగా ట్రంప్‌దే పైచేయి అన్నది స్పష్టం. ఎందుకంటే అపరిమితమైన అధికారం ఉన్నందున ఎలన్ మస్క్ ఆర్థిక సామ్రాజ్యాన్ని కుప్పకూల్చివేసే అవకాశం ఉంది. అందుకే మస్క్ దారికి వచ్చినట్లు కనిపిస్తోంది. కొసమెరుపు ఏమి టంటే మంగళవారం నాడు ఎలన్ మస్క్ డ్రైవర్‌తో పనిలేని తన తొలి కారును ప్రయోగించి చూపాడు. దాంతో రోబో టాక్సీ రంగంలో అతగాడి కంపెనీ ఉందన్న భరోసాతో స్టాక్‌మార్కెట్‌లో వాటాల ధరలు పెరిగాయి.

# రక్తదానమే ప్రాణదానం

కృత్రిమంగా ప్రయోగశాలలో తయారుచేయలేని అమూల్య జీవన పదార్థం రక్తం. రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. రక్త విధులకు సత్సమానం లేదు. అనుక్షణం జీవ కణజాలానికి అవసరమైన ఆక్సీజన్‌ను సరఫరా చేస్తూ, వ్యర్థ పదార్థాలను విసర్జించే అమూల్య విధులను నిర్వహిస్తున్న రక్తం జీవితాలకే ఆధారం అవుతున్నది. ఒక వ్యక్తి ప్రమాదాలు, తీవ్ర వ్యాధులు, ప్రసవాలు, రక్తహీనత కలిగిన వ్యక్తులు, ఎముకల మజ్జ లోపాలు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర సందర్భాల్లో రక్తం అందించాల్సి వచ్చినపుడు ఏమీ ఆశించకుండా స్వచ్ఛందం రక్త దాతలు దేవుళ్ల రూపంలో కనిపిస్తారు. రక్తం దానం చేయడంతో ప్రాణా లు నిలబడతాయి, కుటుంబాలు నిలుస్తాయి. సమయానికి రోగికి సురక్షిత రక్త దాత దొరకడం ఓ అదృష్టం. రక్తం దొరక్క ప్రాణం పోవడం పౌర సమాజానికి అవమానకరం, ఆక్షేపణీయం. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల రోగులు రక్త దాతల అమూల్య సేవలతో ప్రాణాలను నిలుపుకుంటున్నారు.



ప్రాణ దాతలుగా విశేష కృషి చేస్తున్న స్వచ్ఛంద రక్త దాతలకు కృతజ్ఞతలు సమర్పించడం, నూతన రక్తదాతలను ప్రోత్సహించడం, రక్తదానం పట్ల అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రతి ఏటా జూన్ 14న ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆరోగ్య సంస్థ, రెడ్‌క్రాస్ సొసైటీ సమైక్య చొరవతో 2004 నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ రక్త దాతల దినోత్సవం (వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే) నిర్వహించడం జరుగుతోంది. రక్త గ్రూపులు ఏ,బి,ఓ అను వర్గాలుగా ఉంటాయని కనుగొన్న నోబెల్ పురస్కార గ్రహీత కార్ల్ ల్యాండ్‌స్టేయినర్ పుట్టిన రోజు జూన్ 14న ఈ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. 2025 ప్రపంచ రక్త దాతల దినం ఇతివృత్తంగా రక్తదానం, ఆశలు నిలుపుదాం : ఐక్యతతో ప్రాణదానం అనే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినం వేదికగా రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్త దాతల నిస్వార్థ సేవలను గుర్తించడం, విద్యాలయాల్లో సెమినార్లు లేదా కార్యశాలలు, అవగాహన ర్యాలీలు, సెలబ్రిటీలతో ప్రచారాలు, వీధి నాటికలు, ఫ్లాష్‌మాబ్స్, సామాజిక మాధ్యమ ప్రచారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వాలు/స్వచ్ఛంద సంస్థలు/పౌర సమాజం/అంతర్జాతీయ సంస్థల సమన్వయం లాంటి అంశాలను నిర్వహించాలి లేదా అవగాహన పరచాలి.

రక్తం, ప్లేట్‌లెట్స్ లాంటి ఇతర రక్త ఉత్పత్తుల దాతల కొరత భారత్‌ను పట్టి పీడిస్తున్నది. యువ జనాభా అధికంగా ఉన్న దేశంలో రక్త కొరత ఏర్పడడం శోచనీయం. 18 నుంచి 65 ఏండ్ల వయస్సు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఎప్పుడైనా రక్తదానం చేయవచ్చు. ప్రతి 3 నెలలకు ఒకసారి పురుషులు, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మహిళలు రక్తదానం చేయవచ్చు. రక్తదాత శరీర బరువు 45 కెజీలకు మించి ఉండాలి. రక్తంలో కనీస హిమోగ్లోబిన్ 12.5 గ్రా/డిఎల్ ఉండాలి. రక్త దానం వల్ల దాతకు పలు ప్రయోజనాలు కలుగుతాయి. దాత శరీరంలో రక్త రాళ్లు (బ్లడ్ స్టోన్స్) ఏర్పడకుండా అడ్డుకోవడం, దాత ఆరోగ్యానికి ఊతం లభించడం, దాత మానసిక సంతృప్తి పెరగడం, ప్రాణ దానం చేశాననే భావనతో సంతృప్తి లభించడం, గుండె ఆరోగ్యం మెరుగుపడడం, నూతన రక్త కణాలు ఉత్పత్తి కావడం లాంటి ప్రయోజనాలు రక్త దాతలకు కలుగుతాయి.

ప్రపంచవ్యాప్తంగా సాలీనా దాదాపు 120 మిలియన్ల రక్తదానాలు, భారత్‌లో 11.45 మిలియన్ల రక్తదానాలు జరుగుతున్నాయని తెలుస్తున్నది. భారత్‌లో 13 మిలియన్ల రక్త దానాల అవసరం ఉంది. అంటే, మన 12 లక్షల యూనిట్ల రక్తం కొరత ఉన్నది. ప్రపంవ్యాప్తంగా 170 దేశాల్లో 12,700 బ్లడ్ బ్యాంకులు పని చేస్తున్నాయి. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి 1000 మందిలో 33 రక్తదానం చేస్తుండగా, భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నలుగురు మాత్రమే రక్తదానానికి ముందుకు వస్తున్నారు. ప్రభుత్వాలు, బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవకులు, ఉన్నత విద్యా సంస్థలు కలిసి ప్రపంచ రక్త దాతల దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ అవగాహన కల్పించాలి. ఢిల్లీ లాంటి నగరాల్లో అవసరం కన్న అధికంగా రక్త దాతలు, బీహార్ లాంటి రాష్ట్రాల్లో రక్తదాతల తీవ్ర కొరత కనిపిస్తున్నాయి. రక్తదానంతో పాటు అవయవ దానాలు, పార్థివ గేహ దానాలను కూడా ప్రోత్సహించాలి, కొన ఊపిరితో ఉన్న అభాగ్యుల శ్వాసను నిలపాలి.


ప్రతీ యువకుడు సాలీనా కనీసం 2 లేదా 3 సార్లు రక్త దానం చేయడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం అవసరం అయినపుడు సంబంధిత రక్త గ్రూపు కలిగిన దాతలు ముందుకు రావాలి, మరో ప్రాణం నిలపడానికి వచ్చిన అద్భుత అవకాశాన్ని తీసుకోవాలి. రక్త కొరతతో ప్రాణాలు పోకుండా యువ దాతలు నడుం బిగించాలి. అభాగ్యుల ప్రాణాలు నిలుపడానికి డబ్బు మాత్రమే అవసరం కాదని, నిరుపేద యువకుడు కూడా రక్త దానం చేసిన మరొకరి ప్రాణం నిలుపవచ్చని తెలుసుకోవాలి. అత్యధిక యువత ఉన్న భారతంలో రుధిర కొరత వేధించడం అవమానకరం అని భావిద్దాం, స్వచ్ఛంద రక్తదాతలుగా మారుదాం.

**– నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం**

# వర్షాన్ని దాచే గుణం నేర్చుకుందాం

ప్రపంచం వేగంగా ముందుకు పోతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న జనాభా, నీటి వనరులపై అధిక భారం ఇవన్నీ కలసి మన భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నాయి. ప్రత్యేకించి మన దేశంలో గ్రామీణ ప్రాంతాలనుండి మహానగరాల వరకూ నీటి వినియోగం పెరిగిపోతోంది. భూగర్భజలాల పరిమితి, వర్షాలపై ఆధారపడిన వ్యవసాయ విధానం వంటి అంశాలు నీటి సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తున్నాయి.

ఇలాంటి సమయంలో ఇంకుడు గుంతలు ఒక చౌక, సాధారణ, సమర్థవంతమైన పరిష్కారంగా ముందుకు వస్తున్నాయి. కానీ దీనికి తగిన విధంగా ప్రాధాన్యత ఇవ్వడం, ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు ఉండేలా చేయడం ప్రభుత్వాల ముఖ్య బాధ్యతగా మారాల్సిన అవసరం ఉంది. వర్షపు నీటిని భూమిలోకి చేరుస్తూ, భూగర్భజలాలను పునరుత్పత్తి చేసే విధానంగా ఇంకుడు గుంతలు పని చేస్తాయి. ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక గుంత ఏర్పాటు చేయాలన్న నిబంధనను ప్రభుత్వాలు విధించాలి. ఇది కేవలం సలహా స్థాయిలో కాకుండా, చట్టబద్ధంగా అమలులోకి రావాలి.




**మహానగరాల్లో కొత్తగా ఇల్లు కట్టించుకునే వారు, అపార్ట్‌మెంట్లు నిర్మించుకునే వారు, ఇతర నిర్మాణాలు చేపట్టేవారు పర్మిషన్ పొందే దశలోనే ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు అందాలి. ఇంకుడు గుంత ఏర్పాటు చేయడమేగాక, కనీసం రెండు చెట్లు నాటడం తప్పనిసరి షరతుగా ఉండాలి. ఇది పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారుతుంది. నగరాల్లో పెరిగే ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే, నీటి నిల్వలను భద్రపరచాలంటే చెట్లు మరియు వర్షపు నీటి నిల్వలు ఎంతో అవసరం.**

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తించాలి – ప్రభుత్వాలు ప్రజలకు కేవలం నియమాలు విధించడం కాదు, అవగాహన కల్పించడంలో ముందుండాలి. గ్రామీణ ప్రాంతాల్లో నీటి విలువను తెలియజేయాల్సిన బాధ్యత స్థానిక పాలన వ్యవస్థలపైనా ఉంది. గ్రామపంచాయతీలు, వాటి పరిధిలోని వాలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు– అందరూ కలిసి నీటి విలువపై ప్రచారం చేయాలి. పాఠశాలల స్థాయిలో నుంచే విద్యార్థులకు నీటి విలువ, వృథా ఆపడం, గుంతల ఏర్పాటుపై బోధించాలి.

ఇదే సమయంలో ప్రజలకూ స్పష్టమైన బాధ్యత ఉంది. ఇంటి నిర్మాణం అనేది కేవలం ఇంటి గోడలు కాదు. అది ప్రకృతితో సంబంధాన్ని ఏర్పరచే అవకాశం. వాస్తవానికి మన పురాతన సంస్కృతిలో – వర్షపు నీటిని నిల్వ చేయడం, చెట్లు నాటడం, తోటలు పెంచడం చాలా సాధారణంగా కనిపించేవి. ఆధునిక జీవనశైలిలో ఇవన్నీ మరిచిపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాబట్టి, ప్రజలంతా కూడా తమ ఇంటి నిర్మాణంలో మరొక గదిని వేసినట్టు, ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేయడం, రెండు చెట్లు నాటడం తప్పనిసరి బాధ్యతగా భావించాలి.

పర్యావరణ పరిరక్షణ అనే ప్రక్రియలో భాగస్వాములవ్వాలంటే, నీటి విలువను గుండెల్లో పెట్టుకోవాలి. మౌలిక సదుపాయాల నుంచి ప్రారంభించాలి. ఇకపై ప్రభుత్వాల కార్యాచరణల్లో – నీటి నిల్వ, వృథా నివారణ, చెట్ల పెంపకం, గుంతల ఏర్పాటును కీలక భాగంగా చేస్తూ ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో వాటిని చేర్చాలి. నీటి భద్రత లేకుండా ఏ అభివృద్ధీ స్థిరంగా ఉండదు.

ప్రస్తుతం నీటి కొరత, భూగర్భ జలాల వనరుల హ్రాసం ప్రధాన సమస్యలుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) ఏర్పాటు చేయడం అత్యంత అవసరం. ఈ చర్య వర్షపు నీటిని భూగర్భంలోకి చొప్పించి నీటి లభ్యతను పెంచుతుంది. అయితే ప్రజలు స్వచ్ఛందంగా ఈ గుంతలు ఏర్పాటు చేసుకోవడంలో ఆసక్తి చూపడం తక్కువగా కనిపిస్తోంది.

**ఇలాంటి పరిస్థితుల్లో, ప్రభుత్వాలు ప్రోత్సాహకం అవసరం. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే ఇళ్లకు వార్షిక ఇంటి పన్నులో 10% నుండి 15% వరకు రాయితీ కల్పిస్తే, ప్రజలు ఉత్సాహంగా ఏర్పాటు చేసుకుంటారు. ఈ విధంగా ఒకవైపు ప్రజలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతూ, మరోవైపు నీటి భద్రత పెరుగుతుంది. ఇది పర్యావరణహితమైన చర్యగా మారుతుంది.**

ఈ విధానం ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరిగి, నగరాలు, గ్రామాలు నీటి పరిరక్షణలో ముందంజ వేయగలవు. దీని వల్ల భవిష్యత్ తరాలకు నీటి లభ్యతపై భరోసా కలుగుతుంది. అందువల్ల ప్రభుత్వాలు ఇటువంటి ప్రోత్సకాహాలను ప్రారంభించాలి. అంతిమంగా చెప్పాల్సిందల్లా: ప్రతి ఇంటి ముందు ఉండే ఇంకుడు గుంత, ప్రతి చెట్టు, ప్రతి నీటి బిందువు మన భవిష్యత్తుకి పెట్టుబడిగా మారాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత అయినంత మాత్రాన ప్రజలు తప్పించుకోలేరు. ప్రతి ఒక్కరూ – తాము ఉన్న స్థాయిలో – వీటి ఏర్పాటులో భాగస్వాములు కావాలి. ప్రభుత్వాలు ప్రేరణ కలిగించాలి, ప్రజలు అమలు చేయాలి. అప్పుడే మన సమాజం నీటి పరిరక్షణలో ముందుంటుంది. లేకపోతే, భవిష్యత్తు తరం మన తప్పుల పర్యవసానాన్ని అనుభవించాల్సి ఉంటుంది.

**– మన్నారం నాగరాజు**
95508 44433

# దళితులపై దాడులు ఇంకెన్నాళ్ళు?

దాడులు... అవమానాలు.. అణిచివేతలు వివక్ష... గ్రామ బహిష్కరణలు పునాదులను దళితుల వర్గాలు పెకిలివేయాలి. దళిత బహుజనులపై దాడులు ఇంకెన్నాళ్ళు అనే భావనలు ఉదయిస్తున్నాయి. దాడులు, దండన, అవమానాలు మూటలతో దళితులు బతుకు బండి లాగుతున్నారు. చరిత్ర నిర్మాతలు మూలవాసులు దళితులే అన్న చారిత్రక సత్యం సమాజానికి తెలియదా? అన్న ప్రశ్నలు వెంటాడుతున్నాయి. సమానత్వం, స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వం లభిస్తేనే దళితులు ఆత్మగౌరవంతో సమాజంలో జీవనం సాగిస్తారన్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ మాటలు ఎప్పుడు నిజం అవుతాయి? నిప్పుల కొలిమిలో అవమానాలు భరించిన దళితులు విముక్తి, సాయుధ, విప్లవ పోరాటాలు నిర్మించి సమిధలైన బతుకు బండికి భరోసా ఏది? శ్రామిక కులాలు విముక్తి పోరాటాలు సాగించడంలో దళిత బహుజనులు అగ్రభూమిక పోషించినా దాడులు ఎందుకు జరుగుతున్నాయి? అంబేద్కర్ ఆలోచన విధానంలో... గౌతమ బుద్ధుని తాత్విక వెలుగు దళితుల, శ్రమికులు బతుకు పోరాటం చేస్తున్న దాడుల పరంపరకు ముగింపులేదు. ప్రతీ ఘడియ, ప్రతీరోజు దళితులపై దాడులు నిత్యకృత్యం అవుతున్నాయి. ఒకవైపు పాలక వర్గాలు, మరోవైపు సామాజికంగా ఉన్నత స్థానంలో వున్న వ్యక్తులు, శక్తులు దాడులకు ఒడిగడుతున్నారు. కారంచేడు కన్నీళ్ళు ఇంకా కారుతున్నాయి. పదిరి కుప్పం ఘటన జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. నీరు కొండ సంఘటన నేటికీ నిలదీస్తున్నా.. ఎవరికీ కనువిప్పు కలగడం లేదు. రాష్ట్ర జనాభాలో 80 లక్షలకు పైగా దళిత జనాభా ఉంది. మాదిగ, మాల, బైండ్ల, నేత కాని మాల, మాదిగ, అయ్యా వార్లు, దాసనరజ, బంబాల కాటి కాపర్లు, మాదిగ బైండ్ల, దొమ్మర, డక్కలి సింధు మాదిగ, పాముల వంటి 59 కులాలను ఎస్‌సి జాబితాలో చేర్చారు. 23 శాతం ఎస్‌సి జనాభా ఉండగా, 15శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

ఇక తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై, దళిత మహిళలపై అత్యాచారాలకు అంతులేదు. దళితులపై జరిగే నేరాలు సగటున 25 శాతం నుంచి 30 శాతం మధ్య ఉన్నట్లు ఎన్‌సిఆర్‌బి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణలో చాలా గ్రామాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని లోక్‌సభలో హోంశాఖ ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రామాల్లో అధికంగా దళితులపై దాడులు జరుగుతున్నాయి. 2014–2021 సంవత్సరాల మధ్య దళితులపై 12,645 దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. 2014లో 1447, 2019లో 1690, 2021లో 1727 దాడులు జరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో వెల్లడించింది. పెద్దపల్లి, మహబూబ్‌నగర్, ఆర్మూర్, ఆదిలాబాద్, నేరెళ్ళ, దాడులు, హత్యలు జరిగాయి. ఇసుక మాఫియా దాడుల్లో నేరేళ్ళలో 40 మంది దళితులు మృత్యువాతపడ్డారు. శీలం రంగయ్య మరియమ్మ, జి.నరసయ్య, తలారీ సత్యం, లాకప్‌డెత్‌లు వెంటాడుతున్నాయి. నాటి సిఎం కెసిఆర్ నియోజకవర్గం, గజ్వేల్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో జరిగిన సహపంక్తి భోజనాల్లో దళిత కుటుంబాన్ని రానివ్వకపోవడం అంటే కుల దూరంహాకారం కాదా! మొత్తంగా గమనిస్తే 1991 నుంచి 2021 మధ్య 7 లక్షలు దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. ప్రతీ 12 నిమిషాలల్లో దౌర్జన్యం ప్రతి ఆరుగురు దళిత మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయి అంటే తీవ్రత ఎలా ఉందో ఇట్టే తెలుస్తోంది. 2019–2021లో దళితులపై దారుణాలు 45,961 నుండి 50,900 వరకు అంటే 11 శాతం పెరిగాయని ఎన్‌సిఆర్‌బి వెల్లడించింది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఉత్తరాఖండ్ 50 శాతం, మధ్యప్రదేశ్ 46 శాతం, గోవా 36 శాతం, యుపి 46 శాతం, దళితులపై దాడులు జరిగినట్లు విశిదమౌతుంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 6 శాతం దళితులపై దాడులు జరిగినట్లు స్పష్టమవుతుంది.

**– గుర్రం రాంమోహన్ రెడ్డి** 7981018644



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పట్టుబడిన నక్సల్ కమాండర్లు

**న్యూఢిల్లీ/భువనేశ్వర్ :** మల్కాన్‌గిరి జిల్లా అడవుల్లో జరిగిన కాల్పుల ఘటనలో సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్), ఒడిశా పోలీసులు శుక్రవారం ఇద్దరు మావోయిస్టు కమాండర్లను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. కంగెర్‌ఘాటి ప్రాంతానికి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు (ఎసిఎం) కేసా కవాసి (32), ఆంధ్రఒడిశా సరిహద్దు మావోయిస్టు మిలిటరీ ప్లాటూన్ ఎసిఎం రాకేష్ అలియాస్ సాను కుంజమ్ (30)లను ఆ జిల్లాలోని సోడి గూడ, తెంటులిగూడ గ్రామాల సమీపంలోని ప్రాంతం నుండి భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. కొద్దిసేపు జరిగిన కాల్పుల తర్వాత పట్టుబడిన ఇద్దరు మావోయిస్టుల నుండి ఒక పిస్టల్, పది ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఒక వాకీటాకీ, ఒక రేడియో, ఆరు రౌండ్ల బుల్లెట్లు, రెండు మాచేట్లు, కొన్ని ఇతర వస్తువులను దళాలు స్వాధీనం చేసుకున్నాయని అధికారులు తెలిపారు. బిఎస్ఎఫ్ 2వ బెటాలియన్ కమాండెంట్ వరుణేంద్ర ప్రతాప్ సింగ్, మల్కాన్‌గిరి పోలీస్ సూపరింటెండెంట్ వినోద్ పాటిల్ జిల్లా ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'విశ్వసనీయ' నిఘా సమాచారం ఆధారంగా ఆ ప్రాంతంలో పనిచేస్తున్న ఉమ్మడి దళాలు ఇద్దరినీ పట్టుకున్నాయని తెలిపారు.

# ఎలా బయటపడ్డానో నాకే తెలియదు..!

### విమాన ప్రమాదంపై మృత్యుంజయుడు



**న్యూఢిల్లీ :** గుజరాత్ రాష్ట్రంలో ఘోర విషాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిర్ ఇండియా బోయింగ్ ఎ171లో ప్రయాణిస్తున్న 242 మందిలో 241 మంది మరణించారు. అయితే, ఒకే ఒక్కరు రమేశ్ విశ్వాస్ కుమార్ బుచర్వాడ్ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడి మృత్యుంజయుడిగా నిలిచారు. ప్రస్తుతం అతను అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలను మీడియాతో పంచుకున్నారు. ఈ ప్రమాదం నుంచి బయటపడటం ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉందన్నారు. 'నేను ప్రమాదం నుంచి ఎలా సజీవంగా బయటపడ్డానో నాకే తెలియదు. ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. కొద్దిసేపు నేను చనిపోయాననే అనుకున్నా. కానీ కళ్లు తెరిచి చూడగా.. బతికే ఉన్నా. నేను మెల్లగా నా సీటు బెల్టు తీసి అక్కడి నుంచి బయటకు వచ్చా. నా ముందు ఉన్న ఎయిర్ హోస్టెస్, ప్రయాణికులు చనిపోయి ఉన్నారు. కొన్ని క్షణాల్లోనే మంటలు చెలరేగాయి. నేను గ్రౌండ్ ఫ్లోర్‌కు దగ్గరగా ఉన్నా. అక్కడ కొంత స్థలం ఉంది. అక్కడి నుంచి బయటకు వచ్చా. భవనం గోడ ఎదురుగా ఉండటంతో ఎవరూ బయటకు రాలేకపోయారు' అంటూ తాను బయటపడ్డ తీరు గురించి వివరించారు. ఇక ప్రమాదం ఎలా జరిగిందని అడగ్గా.. 'టేకాఫ్ అయిన ఒక నిమిషం తర్వాత.. విమానం గాల్లో స్టక్ అయినట్లు అనిపించింది. అప్పుడు గ్రీన్, వైట్ లైట్లు వచ్చాయి. పైలట్లు విమానాన్ని పైకి లేపేందుకు ప్రయత్నించగా.. అది వేగంగా వెళ్లి భవనంపై కూలిపోయింది' అని చెప్పుకొచ్చారు.

**ప్రాణాలతో బయటపడ్డ ఒకే ఒక్క ప్రయాణికుడు రమేశ్..**

బ్రిటిష్ జాతీయుడైన 38 ఏండ్ల రమేశ్ విమానంలో 11ఎ సీటులో కూర్చున్నారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్ వెనుక ఈ సీటు ఉంటుంది. తన కుటుంబాన్ని కలిసేందుకు భారత్‌కు వచ్చిన రమేశ్ తన సోదరుడు అజయ్ కుమార్ రమేశ్(45)తో కలసి లండన్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. విమానంలో 11ఎ సీటులో కూర్చున్న రమేశ్ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడు. విమానం అయిన 30 సెకండ్లకే భారీ శబ్దం వినిపించిందని, అంతలోనే విమా నం కూలిపోయిందని తెలిపాడు. అంతా క్షణాలలో జరిగిపోయింది అని రమేశ్ చెప్పుకొచ్చారు. ప్రమాదంలో రమేశ్‌కు ఛాతీ, కళ్లు, కాళ్లకు బలమైన దెబ్బలు తగిలాయి. అంతకు ముందు, విమానం కూలిపోయి దగ్ధమవుతుండగా గాయపడిన రమేశ్ అంబులెన్సు వైపు నడుచుకుంటూ వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విమానంలో ఇతర ప్రయాణికుల పరిస్థితి గురించి స్థానికులు రమేశ్‌ను అడగడం కనిపించింది. విమానం పేలిపోయింది అని గుజరాతీలో రమేశ్ చెప్పడం వినిపించింది.

**11ఎ సీటు ప్రత్యేకతలు**

ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 7878(డ్రీమ్‌లైనర్)లో 11ఎ సీటు ఎకానమీ క్లాస్ క్యాబిన్‌కు చెందిన మొదటి వరుసలో ఉంటుంది. బిజినెస్ క్లాస్‌కి వెనుక ఉంటుంది. క్యాబిన్‌కి అభిముఖంగా కూర్చుని చూస్తే ఎడమ వైపున 11ఎ సీటు ఉంటుంది. విమానం రెక్కలు ఉండే ప్రదేశానికి రెండు వరుసల ముందు ఈ విండో సీటు ఉంటుంది. ప్రమాద సమయాలలో సురక్షిత సీటుగా పరిగణించే 11ఎ సీటు ఎమర్జెన్సీ డోర్‌కు వెనుకనే ఉంటుంది.

# రూపాని కుటుంబానికి మోదీ పరామర్శ



**అహ్మదాబాద్ :** ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ మాజీ సిఎం విజయ్‌భాయ్ రూపానీ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అసువులు బాసిన వాళ్లలో విజయ్ రూపానీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. ప్రమాదం నేపథ్యంలో శుక్రవారం గుజరాత్ వెళ్లిన ప్రధాని మోదీ ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల యోగక్షేమాలు అడిగారు. అనంతరం విజయ్ రూపానీ ఇంటికివెళ్లి కుటుంబసభ్యులతో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పిఎం మోదీ.. విజయ్‌భాయ్ మన మధ్య లేరనేది ఊహించలేనిదన్నారు. తనకు దశాబ్దాలుగా ఆయన తెలుసన్న మోదీ.. భుజం భుజం కలిపి.. తామిద్దరం కలిసి పనిచేశామని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అత్యంత సవాలుతో కూడిన సమయాల్లో కూడా విజయ్‌భాయ్ వినయపూర్వకంగా కష్టపడి పనిచేసేవారని మోదీ అన్నారు. పార్టీ సిద్ధాంతానికి దృఢంగా కట్టుబడి ఉండేవారని, ఉన్నత స్థాయికి ఎదిగి, వివిధ బాధ్యతలను నిర్వహించి, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంతో శ్రద్ధాశక్తులతో సేవలందించారని మోదీ కీర్తించారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అయినా, రాజ్యసభ ఎంపిగా అయినా, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా అయినా, క్యాబినెట్ మంత్రిగా, రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా అయినా, ఆయనకు కేటాయించిన ప్రతి బాధ్యతలోనూ ఆయన ఎల్లప్పుడూ ఒక ప్రత్యేకమైన ప్రతిభను కనబరిచారని మోదీ చెప్పారు. విజయ్‌భాయ్ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందని, గుజరాత్ అభివృద్ధి ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఆయన అనేక చర్యలు తీసుకున్నారని ప్రధాని మోదీ అన్నారు. వాటిలో 'ఈజ్ ఆఫ్ లివింగ్' ముఖ్యమైనదని చెప్పారు. ఆయనతో జరిగిన సమావేశాలు, చర్చలు ఎల్లప్పుడూ గుర్తుండి పోతాయని మోదీ బాధాతప్త హృదయంతో అన్నారు. ఓం శాంతి.. అంటూ మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఫ్లైట్ మిస్... బతికిపోయా

### భావోద్వేగానికి గురైన భూమి చౌహాన్



**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్ విమా న ప్రమాదం మిగిల్చిన విషాదం అం తా ఇంతా కాదు. అందర్నీ తీవ్రంగా కలచివేసిన ఈ ఘటనలో ఎంతో మ ది తమ ఆప్తులను కోల్పోయారు. ఆలస్యం అమృతం విషం.. అని పెద్ద లు అంటుంటారు. ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలి, ఆలస్యం చేయొద్దని సూచిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే లండన్‌లో ఉండే భూమి చౌహాన్ అనే మహిళ రెండేళ్ల తర్వాత ఈ మధ్యే భారత్‌కు వచ్చింది. కొన్నాళ్ల తర్వాత తిరుగు ప్రయాణం కోసం ఆమె ఏర్పాట్లు చేసుకుంది. అందులో భాగంగా ఈనెల 12వ తేదీన లండన్‌కు వెళ్తున్న ఎయిరిండియా ఎఐ171కి టికెట్ బుక్ చేసుకుంది. అయితే విమానాన్ని ఆమె కొద్దిలో మిస్ అయింది. భూమి చౌహాన్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునేలోపు విమానం అక్కడి నుంచి వెళ్లిపోయింది. 10 నిమిషాలు ఆలస్యం కావడంతో ఫ్లైట్ మిస్ అయింది. అయితే అది ఆమెకు మంచే చేసింది. అయిన కొన్ని నిమిషాల్లోనే ఘోర ప్రమాదానికి గురైంది ఎయిరిండియా విమా నం. దీనిపై భూమి స్పందిస్తూ.. భగవంతుడే తనను కాపాడాడని చెప్పింది.

**వినాయకుడే కాపాడాడు..**

'దేవుడికి కృతజతలు. ఆ గణపతి బప్పానే నన్ను కాపాడాడు. విమాన ప్రమాద ఘటనను తలచుకుంటే భయమేస్తోంది. నా శరీరం ఇంకా వణుకుతోంది. నేను సరిగ్గా మాట్లాడలేకపోతున్నా. ప్రమాదం గురించి తెలిసి నా మెదడు స్తంభించింది. 10 నిమిషాలు ఆలస్యం కావడంతో ఫ్లైట్ మిస్ అయ్యా. దయచేసి బోర్డింగ్‌కు అనుమతించాలని వేడుకున్నా. కానీ అధికారులు నన్ను రానివ్వలేదు. దీంతో మధ్యాహ్నం 1.30 గంటలకు ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లిపోయా. 1.38 గంటలకు విమానం ప్రమాదానికి గురైంది. ఆ దేవుడే నన్ను కాపాడాడు' అని చెబుతూ భూమి భావోద్వేగానికి లోనైంది.

# పైలట్ ఉద్యోగం మానేసి నిన్నే చూసుకుంటా..

### తండ్రికి మాటిచ్చిన పైలట్ సుమిత్.. ఇంతలోనే ఘోరం



**న్యూఢిల్లీ :** గుజరాత్‌లో ఘోర విషాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన వందలాది కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. తమ వారిని కోల్పోయిన బంధువులు ఈ విషాద ఘటనను తలచుకుని బోరున విలపిస్తున్నారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఫ్లైట్ కెప్టెన్ సుమిత్ సబర్వాల్ చివరి మాటలను తలచుకొని ఆయన వృద్ధ తండ్రి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. విమానం లండన్ బయల్దేరే ముందు సుమిత్ తనకు ఫోన్ చేసి మాట్లాడినట్లు ఆయన తెలిపారు. లండన్ వెళ్లాక మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పాడని, ఇంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ బోరున విలపించారు. ప్రమా దం జరిగిన అనంతరం శివసేనకు చెందిన ఎమ్మెల్యే దిలీప్ లాండే గురువారం రాత్రి ముం బై శివారులోని పోవై ప్రాంతంలో ఉన్న సుమిత్ ఇంటికి వెళ్లారు. రెండేళ్ల క్రితం సుమిత్ తల్లి మరణించడంతో.. 80 ఏండ్ల తండ్రి బాగోగులు అతడే చూసుకుంటున్నాడు. సుమిత్ ఉద్యోగ రీత్యా పలు ప్రాంతాలకు వెళ్తుండగా.. ఇంట్లో అతని తండ్రి ఒక్కరే ఉంటున్నారు. దీంతో కొ న్ని రోజులు క్రితం వయోభారంతో బాధపడుతున్న తన తండ్రికి 'నాన్నా.. పైలట్ ఉద్యోగం మానేసి ఇక నిన్నే చూసుకుంటా' అని సుమిత్ మాటిచ్చాడు. ఇంతలోనే ఈ ఘోరం జరిగిపోయిందంటూ తన కుమారుడు చెప్పిన మాటల ను తరలచుకుని ఆ తండ్రి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, సుమిత్ సబర్వాల్‌కు 8,200 గంటల పాటు విమానం నడిపిన అనుభవం ఉంది.

# భారత వాయుసేన హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్



**నాంగాల్‌పుర్:** భారత వైమానికి దళానికి (ఐఎఎఫ్) చెందిన అపాచీ హెలికాప్టర్ శుక్రవారం నాడు అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. పంజాబ్‌లోని పఠాన్ కోట్ వైమానిక దళ కేంద్రం నుంచి బయలుదేరిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో నంగాల్‌పుర్ పరిధిలోని హాలెడ్ గ్రామంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. అయితే ప్రజా భద్రతకు ఎలాంటి ముప్పు కలగలేదని అధికారులు చెప్పారు. సమాచారం తెలిసిన వెంటనే పలువురు వైమానిక దళ అధికారులు, సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. దీనికి ముందు, వారం రోజుల క్రితమే ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్‌లో ఐఎఎఫ్ అపాచీ హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. గత ఏప్రిల్‌లోనూ జామ్ నగర్‌లోని భారత వాయుసేనకు చెందిన ఓ హెలికాప్టర్ వాతావరణ ప్రతికూలత కారణంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. అలాగే ఫిబ్రవరిలో ఐఎఎఫ్‌కు చెందిన మిరాజ్ 2000 ట్విన్ సీటర్ ఫైటర్ జెట్ మధ్యప్రదేశ్‌లోని శివపురిలో కుప్పకూలింది. అయితే ఈ మూడు ఘటనల్లోనూ పైలెట్లు సురక్షితంగా బయటపడ్డారు. గతేడాది నవంబర్‌లో ఐఎఎఫ్ మిగ్29 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తుండగా.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా సమీపంలోని వ్యవసాయ భూమిలో ప్రమాదవశాత్తూ కుప్పకూలింది. ఈ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. సాంకేతిక కారణాల వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

# అగ్రి గోల్డ్ కేసులో బాధితులకు ఊరట!

### రూ. 1000 విలువైన ఆస్తులను ఎపి ప్రభుత్వానికి అప్పగించనున్న ఇడి

**న్యూఢిల్లీ:** అగ్రి గోల్డ్‌ను నమ్మి పెట్టుబడులు పెట్టి నష్టపోయిన లక్షలాది మంది ఖాతాదారులకు ఊరట లభించనుంది. ఈ కేసులో సుమారు రూ. 1000 కోట్ల విలువైన ఆస్తులను ఆంధ్రప్రదేశ్ (ఎపి) ప్రభుత్వానికి అప్పగించనున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఇడి) ప్రకటించింది. పెట్టుబడిదారులను ఉద్దేశపూర్వకంగా మోసం చేసే ఈ 'పొంజీ పథకం' ద్వారా అగ్రి గోల్డ్ భారీ కుంభకోణానికి పాల్పడిన విషయం తెలిసిందే. అగ్రి గోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ 'అధిక రాబడి' లేదా 'నివాస స్థలం' హామీతో రియల్ ఎస్టేట్ పెట్టుబడులను ఆహ్వానించింది. దాదాపు 19 లక్షల మంది కస్టమర్ల (32 లక్షల ఖాతాదారులు) నుండి డిపాజిట్లు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయి తే, ఖాతాదారులకు లాభాలు చెల్లించడంగానీ, ప్లాటు ఇవ్వడంగానీ జరగలేదు. ఫెడరల్ దర్యాప్తు సంస్థ ఫిబ్రవరిలో రూ.3,339 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించింది.వాటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.6,000 కోట్లకు పైగా ఉంటుంది. ఇడి ఇప్పుడు కూడా అదే విధానాన్ని అమలు చేసింది. రూ. 611 కోట్ల విలువైన ఆస్తులను తిరిగి ఇచ్చింది. ఈ ఆస్తుల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.1,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ కేసులో దర్యాప్తు సమయంలో, ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం (సిఐడి)కి అటాచ్ చేసిన చరాస్తులను విడుదల చేయాలని కోరుతూ, హైదరాబాద్‌లోని ఇడి జోనల్ కార్యాలయం మే నెలలో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ), 2002లోని సెక్షన్ 8(8) కింద ప్రత్యేక కోర్టు (మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, హైదరాబాద్) ముందు దరఖాస్తును దాఖలు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (ఎపిపిడిఎఫ్ఇ) చట్టం, 1999 నిబంధనల ప్రకారం అగ్రి గోల్డ్ పోంజీ పథకాల బాధితులకు అటాచ్ చేసిన ఆస్తులను తిరిగి ఇవ్వడానికి వీలుగా ఈ దరఖాస్తు దాఖలు చేసినట్టు ఇడి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేసులో మోసపోయిన బాధితులకు సహాయం చేయడానికి పిఎంఎల్‌ఎలో ఆస్తుల పునరుద్ధరణ అనేది అనుమతించిన నిబంధనగా పేర్కొంది.

# ఊపందుకున్న 'నైరుతి'

**న్యూఢిల్లీ :** నైరుతి రుతుపవనాలు ఊపందుకున్నాయి. ఈనెల 25 నాటికి ఢిల్లీతో సహా వాయువ్య భారతదేశంలోని చాలా ప్రాంతాలకు విస్తరిస్తాయని, ఇది సాధారణ తేదీల కంటే చాలా ముందు అని వాతావరణ శాఖ అధికారులు భావిస్తున్నారు. కాగా, మే 24నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. అరేబియా సముద్రం, బంగాళాఖాతంపై బలమైన అల్పపీడన వ్యవస్థల సహాయంతో, రుతుపవనాలు తదుపరి కొన్ని రోజుల్లో వేగంగా ముందుకు సాగాయి, ముంబైతో సహ మధ్య మహారాష్ట్ర వరకు, మే 29 నాటికి మొత్తం ఈశాన్య ప్రాంతాన్ని విస్తరించాయి. అయితే, మే 28–29 నుండి జూన్ 10–11 వరకు నిలిచిపోయి మళ్ళీ చురుకుగా మారాయి. జూన్ ప్రారంభం నుండి వర్షపాతం లేకపోవడం ఉష్ణోగ్రతలలో పదునైన పెరుగుదలకు దారితీసింది. ఈనెల 8–9 నుండి వాయువ్య, మధ్య భారతదేశంలోని పెద్ద ప్రాంతాలలో వేడి తరంగ పరిస్థితులను ప్రేరేపించింది. భారత వాతావరణ అంచనా ప్రకారం, ఈనెల 18 నాటికి రుతుపవనాలు మధ్య, తూర్పు భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలను, వాయువ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాకు విస్తరించే అవకాశం ఉంది. 19–25 మధ్య వాయువ్య భారతదేశంలోని చాలా ప్రాంతాలకు విస్తరిస్తాయని అంచనా వేస్తున్నారు. జూన్ 30 సాధారణ ప్రారంభ తేదీ కంటే ముందుగా జూన్ 22–23 నాటికి ఈ వ్యవస్థ ఢిల్లీకి చేరుకునే అవకాశం ఉందని ఐఎండి అధికారి ఒకరు తెలిపారు. నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ 1 నాటికి కేరళలో ప్రారంభమై, జూన్ 11 నాటికి ముంబైకి చేరుకుంటాయి. జూలై 8 నాటికి మొత్తం దేశాన్ని కవర్ చేస్తాయి. ఇది సెప్టెంబర్ 17 నాటికి వాయువ్య భారత దేశం నుండి తిరోగమనం ప్రారంభించి అక్టోబర్ 15 నాటికి పూర్తిగా ఉపసంహరించుకుంటుంది. రుతుపవనాల ప్రారంభ తేదీ మొత్తం కాలానుగుణ వర్షపాతంతో నేరుగా సంబంధం కలిగి ఉండదని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కేరళ లేదా ముంబైకి ముందస్తు లేదా ఆలస్యంగా రావడం దేశంలోని ఇతర ప్రాంతాలలో ఇలాంటి పురోగతిని సూచించదు. రుతుపవనాలు సంక్లిష్టమైన ప్రపంచ, ప్రాంతీయ, స్థానిక కారకాలతో ప్రభావితమవుతాయని, గణనీయమైన వైవిధ్యంతో గుర్తించబడతాయని పేర్కొన్నారు. జూన్–సెప్టెంబర్ రుతుపవనాల కాలంలో భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెం.మీ.లో 106 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని మే నెలలో ఐఎండి అంచనా వేసింది. లడాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఈశాన్య ప్రాంతాలు, బీహార్, జార్ఖండ్ పశ్చిమ బెంగాల్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా. పంజాబ్, హర్యానా, కేరళ, తమిళనాడులోని కొన్ని వివిక్త ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది.

# యుఎన్‌లో ఏకాకి అవుతున్న భారత్

### గాజాలో తక్షణమే, శాశ్వత కాల్పుల విరమణ కోరే ముసాయిదా తీర్మానంపై...
### 149 దేశాలు అనుకూలంగా ఓటింగ్

**ఐక్యరాజ్యసమితి :** గాజాలో తక్షణమే, బేషరతుగా, శాశ్వత కాల్పుల విరమణను డిమాండ్ చేసే ముసాయిదా తీర్మానంపై ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో జరిగిన ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు అయ్యింది. 193మంది సభ్యుల ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో స్పెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించడానికి మూకుమ్మడి ఓటింగ్ జరిగింది.ఇది అన్నిపార్టీలు గౌరవించేలా తక్షణ షరతులు లేఇన, శాశ్వత కాల్పుల విరమణను డిమాండ్ చేసింది. హమాస్, ఇతర గ్రూప్‌లచే బంధించబడిన బందీలను గౌరవప్రదంగా, బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. భారతదేశం సహా 19దేశాలు ఓటింగ్‌కు దూరం జరిగాయి. కాగా 12దేశాలు ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాయగా, మొత్తం 149దేశాలు అనుకూలంగా ఓట్లు వేశాయి. గైర్హాజరైన దేశాలలో అల్బేనియా, కేమరూన్, ఈక్వడార్, ఇథియోపియా, మాలవి, పనామా, దక్షిణ సూడాన్, టోగో ఉన్నాయి. గాజాలో నానాటికీ మానవతా పరిస్థితి దిగజారిపోతున్న నేపథ్యంలో 'పౌరులను రక్షించడం, చట్టపరమైన మానవతా బాధ్యతలను సమర్థించడం' అనే టైటిల్‌తో కూడిన తీర్మానంపై ఓటు వివరణలో భాగంగా ఐక్యరాజ్య సమితిలో భారతదేశం తరపున శాశ్వత ప్రతినిధిగా వ్యవహరిస్తున్న భారత రాయబారి పర్వతనేని హరీష్ ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకొచ్చారు. మానవతావాదం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడటం పట్ల భారతదేశం తన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసిందని, పౌరుల ప్రాణనష్టాన్ని ఖండిస్తున్నామని పర్వతనేని హరీష్ తెలియజేశారు. ఇంతకుముందు భారతదేశం ఇజ్రాయేల్ పాలస్తీన్నా సమస్యపై చేసిన తీర్మానాలు, ఓటింగ్‌కు కూడా దూరంగా ఉందని హరీష్ చెప్పారు. 'చర్చల ద్వారా, దౌత్యం ద్వారా మాత్రమే వివాదాలను పరిష్కరించుకోవడం తప్ప వేరే మార్గం లేదని ఈ రోజు మనం ఓటేస్తున్నాం. ఈ కారణాల వల్లే, ఈ తీర్మానానికి మేం దూరంగాఉండాలనుకున్నాం' అని ఆయన స్పష్టంచేశారు.ఆక్రమిత దేశమైన ఇజ్రాయెల్ అధికార దిగ్బంధనను వెంటనే ముగించాలని, అన్ని సరిహద్దు క్రాసింగ్‌లను తెరిచి, గాజాలోని పాలస్తీనా పౌర జనాభాకు వెంటనే చేరుకునే స్థాయిలో సహాయం చేరుకునేలా భరోసా ఇవ్వాలని, అంతర్జాతీయ చట్టాలు, మానవతా సూత్రాల కింద బాధ్యతలను అనుసరించే క్రమంలో ఈ తీర్మానం ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేస్తోంది.

# వృద్ధుల్లో పెరుగుతున్న ప్రతికూల భావనలు



న్యూఢిల్లీ: వృద్ధుల్లో ప్రతికూల భావనలు పెరిగిపోతున్నాయి. ఎక్కువ మంది భయాందోళనల మధ్య రోజులు గడుపుతున్నారు. యువత తమను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం సర్వసాధారణమైంది. హెల్పేజ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ ఒక సర్వేలో 5,798 మందిని ప్రశ్నించింది. వీరిలో 70 శాతం మంది 60 సంవత్సరాలు దాటినవారుకాగా, మిగతా 30 శాతం మంది 18–30 సంవత్సరాల మధ్య వయసుగలవారు ఉన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, ప్రకటించిన తాజా నివేదికలో, వృద్ధుల ఆలోచనా సరళిపై పలు ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే, పట్టణ ప్రాంతాల్లోని వృద్ధుల్లో తాము 'ఒంటరితనం' అనుభవిస్తున్నామనే భావన ఎక్కువగా ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న సాంకేతిక విప్లవంలో, ప్రత్యేకించి డిజిటల్ లావాదేవీల్లో చాలా వెనుకబడి ఉన్నామనే అభిప్రాయం కూడా అత్యధిక శాతం మంది వ్యక్తం చేశారు. మధ్య, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లోని వృద్ధుల్లో ప్రతికూల భావనలు, ఆలోచనలు ఎక్కువ. ఒంటరితనాన్ని అనుభవించాల్సి రావడంతో, ఏదో ఒక విపత్తు జరగబోతున్నదనే ఆందోళన వారిలో పెరుగుతున్నది. 56 శాతం మంది వృద్ధులు ఇలాంటి ప్రతికూల ఆలోచనలతో సతమతమవుతున్నారు. విజ్ఞతతలో ఆలోచిస్తామని అనుకునేవారు 51 శాతం మంది ఉంటే, 54 శాతం మంది పిల్లలు తమను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయంతో ఉన్నారు. 'ఒక పనిని ఏ విధంగా చేయాలన్నది చర్చిస్తున్నారు. కానీ, అసలు ఆ పని గురించి తొలుత సమాచారం ఇవ్వడం లేదు. నిర్ణయాలు తీసుకున్న తర్వాతే, వాటి అమలు కోసం సంప్రదిస్తున్నారు' అని మదురైకి చెందిన ఓ వృద్ధుడు వ్యాఖ్యానించాడు. 'మా అభిప్రాయం అవసరం లేనప్పుడు, ఏ విధంగా చేయాలనే వ్యూహాలు మాత్రం మాకెందుకు' అని ప్రశ్నించాడు. ఇలావుంటే, డిజిటల్ లావాదేవీలు, స్మార్ట్ ఫోన్లను వాడడం వంటి విషయాల్లో యువతకు సంపూర్ణ అవగాహన ఉంటుండగా, వృద్ధులు నేర్చుకోవాలన్న కుతూహలాన్ని కనబరుస్తున్నారు. కానీ, అత్యధిక శాతం సంఘటనల్లో వృద్ధులకు వాటి గురించి ఏమీ నేర్పించకుండా, అవసరాలను తామే పూర్తి చేస్తామన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఆన్‌లైన్ మార్కెటింగ్ ఏ విధంగా చేయాలని అడిగినప్పుడు, తమ అవసరాలను తెలుసుకొని, యువకులే ఆ పనిని పూర్తి చేస్తున్నారే తప్ప తమకు సమాచారం ఇవ్వడం లేదన్నది అత్యధిక శాతం మంది వృద్ధులు చేస్తున్న ఆరోపణ. భావోద్వేగ సంబంధాల విషయంలోనూ ఇలాంటి తేడాలే కనిపిస్తున్నాయి. వృద్ధుల్లో 71 శాతం మంది, యువతలో 72 శాతం మంది క్రమం తప్పకుండా, ఏదో ఒక సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నారు. కానీ, వారి మధ్య భావోద్వేగ సంబంధాలు చాలా తక్కువ. ముక్తసరిగా మాట్లాడుకోవడం తప్ప, ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకోవాలన్న ఆసక్తి కనబరచడం లేదు. పిల్లలు తన విషయంలో నిర్లిప్తంగా ఉంటున్నారని ఎక్కువ మంది వృద్ధులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్య మెట్రో నగరాల్లో ఎక్కువ. పట్టణాలు, నగరాల్లో పరిస్థితి కొంత వరకూ మెరుగ్గా ఉన్నప్పటికీ, మెట్రో నగరాల్లో మాత్రం ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్న వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, యాంత్రిక జీవనానికి అలవాటు పడడం, కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ ఏదో ఒక పని చేయాల్సి రావడం వంటి అంశాలు వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఈ నివేదిక సారాంశం. దేశంలో 51 శాతం మంది వృద్ధులు ఇప్పటికీ బేసిక్ ఫోన్లే వాడుతున్నారు. స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తున్న వారిలో 13 శాతం మంది మాత్రమే సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నారు. సోషల్ మీడియాను ఏ విధంగా వినియోగించాలనేది పిల్లలు చెప్పడం లేదని 66 శాతం మంది వృద్ధుల ఆరోపణ. అదే విధంగా యువతీయువకుల్లో సహనం లేకుండాపోతున్నదని 71 శాతం మంది విమర్శిస్తున్నారు. ప్రతి విషయానికీ క్షణాల్లో ఏదో ఒక వివరణ ఇవ్వడం వారికి అలవాటుగా మారిందని 49 మంది భావిస్తున్నారు. రోజువారీ నగదు లావాదేవీల్లోనూ యువతపై ఆధారపడుతున్న వృద్ధులు 55 శాతం మందికాగా, ఎటిఎం నుంచి నగదు డ్రా చేసుకోవడం చాలా మందికి తెలియదు. పిల్లలు తాము చెప్పినట్టు వినితీరాలని 42 శాతం మంది పట్టుబడుతున్నారు. 68 శాతం మంది భవిష్యత్తును తలచుకొని ఆందోళన చెందుతున్నారు.

### యుద్ధం ఆపానని ట్రంప్ వ్యాఖ్యలపై

# ఇంకెన్నాళ్లు ప్రధాని మౌనం ?

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్, భారతదేశం మధ్య యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ లెక్కలేనన్నిసార్లు పదే పదే చెబుతున్నా ఆయన వాదనలను తిప్పికొట్టకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారి వ్యాఖ్యల పట్ల మౌనం వహించడం శోచనీయమని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడింది. కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరామ్ రమేష్ దీనికి సంబంధించి ట్రంప్ వీడియో క్లిప్‌ను తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'భారతదేశం, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపాను. దానిని వాణిజ్యంతో నిలువరించాను' అని ట్రంప్ పదేపదే వాదన వినిపించడాన్ని జైరామ్ రమేష్ విమర్శించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద సంఘటన విషయమై భారతదేశం విషాదంలో మునిగిఉన్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశం పాకిస్థాన్ యుద్ధం నిలువరించడం గురించి మరోసారి వ్యాఖ్యానించడం లెక్కలేనన్ని సార్లు పునరావృతంలో ఒక భాగమేనని జైరామ్ రమేష్ చెప్పారు. నిన్న (గురువారం) వాషింగ్టన్ డిసిలో కెన్నెడీ సెంటర్ నుంచి ట్రంప్ ఇదే విషయాన్ని మళ్లీ మాట్లాడారన్నారు. అయితే ఈ వ్యాఖ్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరవధికంగా మౌనం పాటిస్తున్నారని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ ఆరోపించారు. తాను దేనినైనా పరిష్కరించుకోగలుగుతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం నొక్కిచెప్పారని, కాశ్మీర్ విషయమై భారతదేశం పాకిస్థాన్ చాలాకాలంగా శతృత్వం కొనసాగిస్తున్నారని, అయితే తాను ఆ రెండు దేశాలను కలిసికట్టుగా ఉండే లా ఒకే తాటిపైకి తీసుకువస్తున్నానని ట్రంప్ చెప్పి ఉన్నారు. కశ్మీర్ విషయం భారతదేశం ద్వైపాక్షిక అంశం అని జైరామ్ రమేష్ గుర్తు చేస్తూ ఈ విషయంలో మూడవ దేశం మధ్యవర్తిత్వానికి భారత ప్రభుత్వం తలుపులు తెరవడం ఎందుకని ప్రశ్నించారు. భారతదేశం, పాకిస్థాన్ దేశాలను మేం సంఘటితంగా ఉండేలా చేస్తు న్నాం అని ట్రంప్ వైట్ హౌస్‌లో జరిగిన బిల్లు సంతకం ఉత్సవంలో మేం ఆ రెండింటినీ (భారత్‌పాక్) దేశాలను ఒక చోట చేర్చబోతు న్నాం అని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ సమాధానం ఇచ్చారు.ఈ శతృత్వం ఎంతకాలం కొనసాగుతుందని తాను ఆ దేశాలను ప్రశ్నించగా 2,000 సంవత్సరాలని ఆ రెండు దేశాలవారు తనకు సమాధానం చెప్పారని, అందుకు తాను నవ్వుతూ 'ఓహ్' అదా సమస్యా అని అన్నానని తెలియజేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధం విషయాన్ని పునరావృతం చేస్తూ తాను భారతదేశంపాకిస్థాన్ మధ్య యుద్ధం ఆపడానికి ఫోన్‌కాల్స్, వాణిజ్యంతో ఇరు దేశాల మధ్యన చర్చలు జరుపుతూ ఉన్నానని ట్రంప్ స్వయంగా చెప్పారు' అని జైరామ్ రమేష్ గుర్తుచేశారు.


**తెలంగాణ ప్రభుత్వము, జిల్లా గ్రంథాలయ సంస్థ, రాజన్న సిరిసిల్ల జిల్లా.**

సంఖ్య. 56/DMFT/2019   ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన   తేది: 13.06.2025

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గ్రంథలయమునకు కావలసిన, బీరువా, టేబుల్, కుర్చీలు, ర్యాక్ మొదలగు వస్తువులను, డోర్ డెలివరీని సరఫరా చేయుటకు ఆసక్తి గల ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ నందు రిజిస్టర్ అయిన వ్యాపారస్తుల నుండి టెండర్లు కోరడమైనది. టెండర్ నందు ఎంపిక అయిన టెండరుదారు ఒక సంవత్సరము కాలము 2025-26 సరఫరా చేయవలసి ఉంటుంది. మిగతా వివరాల కొరకు https://rajannasircilla.telangana.gov.in లేదా https://tender.telangana.gov.in నుండి పొందగలరు. టెండర్ ప్రోసెసింగ్ ఫీజును ప్రతి ఒక షెడ్యూల్‌కు రూ.5000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే) ఇట్టి టెండర్ ప్రకటనను మార్పులు చేర్పులు చేయుటకు మరియు పూర్తిగా రద్దు చేయుటకు కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి పూర్తి అధికారము కలదు.

సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళ శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, రాజన్న సిరిసిల్ల జిల్లా

సం/- కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, రాజన్న సిరిసిల్ల జిల్లా

DIPR R.O. No. : 3601-PP/CL/ADVT/1/2025-26, Date: 13-06-2025

# జనరల్
STATE & REGIONAL NEWS

## కాంగ్రెస్ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుంది

ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోను, ప్రభుత్వంలోనూ పదవుల పంపిణీ సామాజిక న్యాయ పరంగా జరుగుతున్నదన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులతో పాటు రాష్ట్ర స్థాయి సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో టిపిసిసి జూమ్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించింది. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో 'సమాజంలో ఎవరి వాటా వారికే' అనే సిద్ధాంతంతో కాంగ్రెస్ ముందుకు సాగుతున్నదన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన ప్రతి పదవిలోనూ సామాజిక న్యాయం పాటించామని, ఇకపై కూడా పార్టీ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి సరైన గుర్తింపునిస్తూ ముందుకు తీసుకెళతామన్నారు.

## పాతనగరంలో సాఫీగా మెట్రో రైల్ పనులు

మెట్రో పనులపై హైకోర్టు ఎటువంటి స్టే ఆర్డర్ ఇవ్వలేదు

ఇప్పటి వరకు 311 ఆస్తుల సేకరణ

రూ.283 కోట్ల పరిహారం పంపిణీ పూర్తి

హెచ్‌ఎంఎల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాతనగరంలో మెట్రో రైల్ పనులపై హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందంటూ జరుగుతున్న ప్రచారం ఊహాగానాలేనని, తప్పు దారి పట్టించేవిగా ఉన్నాయని హెచ్‌ఎంఎల్ ఎండి. ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో పనులపై హైకోర్టు ఎటువంటి స్టే ఆర్డర్ ఇవ్వలేదని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఎపిడబ్ల్యూఎఫ్) దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంకు ప్రతిస్పందనగా హెచ్‌ఎంఎల్ హైకోర్టుకు గతంలో దాఖలు చేసిన కౌంటర్‌లో పాతనగరంలో ఏ వారసత్వ నిర్మాణాన్ని తాకడం లేదా కూల్చివేయడం జరగదని వెల్లడించినట్లు ఆయన చెప్పారు. చార్మినార్, ఫలక్‌నుమా చారిత్రాత్మక నిర్మాణాలు మెట్రో రైల్ అలైన్‌మెంట్‌కి దూరంగా ఉన్నాయని అఫిడివిట్‌లో పేర్కొన్నామన్నారు. ఎటువంటి పురాతన కట్టడాలను, ప్రాంగణాలను తాకడం, లేదా కూల్చివేయడం జరిగే ప్రసక్తే లేదని హెచ్‌ఎంఎల్ తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ న్యాయస్థానానికి హామీ ఇచ్చారన్నారు. ఆ తరువాత పిటిషనర్, హెచ్‌ఎంఎల్ అదనపు అఫిడవిట్లు, కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశారన్నారు. కొన్ని రోజుల క్రితం పిటిషనర్ దాఖలు చేసిన తాజా అదనపు అఫిడవిట్లకు అదనపు అడ్వకేట్ జనరల్ హెచ్‌ఎంఎల్ తరఫున తన ప్రతిస్పందనను దాఖలు చేయడానికి కొంత సమయం కోరారన్నారు. హైకోర్టు సమగ్రమైన కౌంటర్ దాఖలు చేయడానికి 3 వారాల సమయం ఇచ్చిందన్నారు.

మధ్యంతర ఉపశమనం ఏదైనా ఇదివరకు ఇచ్చి ఉంటే, తదుపరి విచారణ తేదీ వరకు అది అమలులో ఉంటుందని మాత్రమే హైకోర్టు తన ఉత్తర్వులలో పేర్కొందని ఎన్‌విఎస్ రెడ్డి వివరించారు. హైకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తూ కొందరు తప్పుడు సమాచారం చేస్తున్నారన్నారు. ప్రభావిత ఆస్తుల యజమానులకు ఇచ్చే కన్సెంట్ అవార్డుల ఆధారంగా సముచితమైన పరిహారం చెల్లించిన తర్వాతే ప్రైవేట్ భవనాల కూల్చివేత పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 311 ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని, సహాయ పునరావాస నష్టపరిహారం కింద వాటి యజమానులకు ఇప్పటి వరకు రూ. 283 కోట్లు పంపిణీ చేశామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు.

**సవాల్‌గా మారిన కూల్చివేతలు..**

పాత నగరంలో ఆస్తుల కూల్చివేతలో ఉన్న సవాల్‌గా మారిందన్నారు. ఒకదానికొకటి అనుకోని ఉన్న భవనాలు, సంక్లిష్టంగా ముడిపడిన విద్యుత్, టెలికాం, ఇతర కేబుల్ వైర్లు ఉండటంతో, హెచ్‌ఎంఎల్ ఇంజనీర్లు, అధికారులు రాత్రిపూట ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా వారసత్వ కట్టడాలను మినహాయించి, మిగిలిన ప్రభావిత ఆస్తులను జాగ్రత్తగా కూల్చివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎన్‌విఎస్ రెడ్డి వివరించారు. విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి వారు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. కన్సెంట్ అవార్డులకు అంగీకరించేలా ప్రభావిత ఆస్తుల యజమానులను ఒప్పించడంలో హెచ్‌ఎంఎల్ అధికారులు, ముఖ్యంగా మహిళా అధికారులు చేస్తున్న కృషిని ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి అభినందించారు. పాతనగర వాసులు ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలన్న ఆకాంక్షతో ఉత్సాహంగా తమ సహకారాన్ని అందించడం పట్ల ఎండి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన పాతనగరంలో, మెట్రో రైల్ ప్రాజెక్టు పనుల ప్రగతిపై వారంతా సంతోషంగా ఉన్నారని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు.

## ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 'రిజిస్ట్రేషన్ల ధరల' పెంపు?

బహిరంగ మార్కెట్, రిజిస్ట్రేషన్ల ధరల వ్యత్యాసాన్ని తగ్గించే యోచన

పేదలపై భారం పడకుండా జాగ్రత్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్, జిల్లాలు మినహా హెచ్‌ఎండిఎ పరిధిలో రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువను త్వరలోనే పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. హైదరాబాద్‌లోని అవుటర్ రింగ్ రోడ్(ఒఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) మధ్య ఉన్న జిల్లాల పరిధిలోని ప్లాట్లు, ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ ధరలను పెంచనున్నట్టు తెలుస్తోంది. బహిరంగ మార్కెట్ విలువకు,రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువకు మధ్య అంతరాన్ని తగ్గించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సన్నద్ధమైంది. అపార్ట్‌మెంట్లపైన 30 శాతం, ఓపెన్ ప్లాట్లపై వంద శాతం, అంతకంటే ఎక్కువ పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పేదలపైన భారం పడకుండా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వాస్తవానికి మార్కెట్ విలువల మార్గదర్శకాల ప్రకారం ఏటా మే, జూన్ నెలలో రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలను సవరించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే ఒఆర్ఆర్,ట్రిపుల్ ఆర్ మధ్య పలు పరిశ్రమలు, క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో స్థిరాస్తి వ్యాపారం గతంలో కంటే కొంత ఊపందుకుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. స్థిరాస్తి వ్యాపార లావాదేవీలు ఆశించిన స్థాయిలే లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ శాఖ నుంచి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఆదాయం రాలేదన్న వాదన వినిపిస్తోంది. 202425 ఆర్థిక ఏడాదిలో రూ. 18,500 కోట్లను లక్ష్యంగా నిర్దేశించుకోగా, రూ 14,300 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది.

బహిరంగ మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు రకాల ప్రతిపాదనలు అందజేసినట్టు సమాచారం. ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలకు గజానికి రూ 2,000ల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వాస్తవ ధరలు ఆయా ప్రాంతాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ 50 వేల ధరలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలను 20 శాతం, 50శాతం, మరి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో 100 శాతం, 200ల శాతం వరకు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. సగటున అపార్ట్‌మెంట్ రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలపై 30 శాతం, ఖాళీ స్థలాలపైన 100 శాతం ధరలను ప్రభుత్వం పెంచే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ల ధరలను పెంచితే రాష్ట్ర ప్రభుత్వానికి మొత్తం మీద రూ. 3వేల కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో స్టాంపు డ్యూటీ 5.5శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5శాతం, ట్రాన్స్‌ఫర్ ఫీజు1.5శాతం, మ్యూటేషన్ ఫీజు0.1శాతం మొత్తంగా 7.6శాతంగా అమలులో ఉన్నది. రుణాల కోసం పెట్టుబడులు పెట్టే వారికి ఎలాంటి నష్టం వాటిల్లదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇందులో ఒక్కశాతం స్టాంపు డ్యూటీ తగ్గించే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. తద్వారా పేద, సామాన్య వర్గాల ప్రజలకు మేలు జరగడంతో పాటు అగ్రిమెంట్లు కాకుండా క్రయవిక్రయల లావాదేవీలు కొనసాగుతాయని భావిస్తున్నారు.

## నేడు హైటెక్స్‌లో గద్దర్ ఫిలిం అవార్డుల ప్రదానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతిష్టాత్మక 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు' ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం హైటెక్స్‌లో ఘనంగా జరగనుంది. తెలంగాణ ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా ఈ అవార్డులను అందుకోబోతున్న నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సంగీత, సాహిత్యకారులు, సాంకేతిక నిపుణులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.తెలంగాణ కళారంగంలో వేగుచుక్కలాంటి వారైన గద్దర్ పేరిట వివిధ విభాగాల్లో సినిమా కళాకారులకు అవార్డులు అందించటం గర్వకారణమని సిఎం పేర్కొన్నారు. 2014 నుంచి 2024 వరకు తెలంగాణ ఏర్పడిన పదేళ్ల కాలానికి గానూ ఉత్తమ సినిమాలకు అవార్డులు అందించటం, చలనచిత్ర వైతాళికుల పేరుతో ప్రత్యేక పురస్కారాలను ప్రకటించటం అభినందనీయమని అన్నారు. అవార్డుల ఎంపికలో జ్యూరీ సభ్యుల కృషిని ముఖ్యమంత్రి అభినందించారు.

**అవార్డు గ్రహీతలకు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు :**

రాష్ట్రంలో సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతిష్టాత్మక 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు' అందుకోబోతున్న నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సంగీత, సాహిత్యకారులు, సాంకేతిక నిపుణులందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ కళారంగంలో వేగుచుక్కలాంటివారైన గద్దర్ పేరిట వివిధ విభాగాల్లో సినిమా కళాకారులకు అవార్డులు అందించటం గర్వకారణమన్నారు. 2014 నుంచి 2024 వరకు తెలంగాణ ఏర్పడిన పదేళ్ల కాలానికిగానూ ఉత్తమ సినిమాలకు అవార్డులు అందించటం, చలనచిత్ర వైతాళికుల పేరుతో ప్రత్యేక పురస్కారాలను ప్రకటించటం అభినందనీయమన్నారు. అవార్డుల ఎంపికలో జ్యూరీ సభ్యుల కృషిని ముఖ్యమంత్రి అభినందించారు. శనివారం హైదరాబాద్ హైటెక్స్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరగనుంది.

## బిజెపి కార్యాలయం ముందు ధర్నా చేయాలి

ఈరవతి అనిల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్ సభ్యులు ఆర్.కృష్ణయ్య ధర్నా చేయాల్సింది గాంధీ భవన్ ముందు కాదని, బిజెపి కార్యాలయం ముందు చేయాలని చేయాలని మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌ఈరవత్రి అనిల్ అన్నారు. ఆర్.కృష్ణయ్య బిసి సంఘాల నాయకుడుగా మాట్లాడుతుండా లేక బీజేపీ నాయకుడిగా మాట్లాడుతున్నడో చెపాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఈరవతి అనిల్ కుమార్ మాట్లాడుతూ 74 ఏండ్ల నుండి ఇప్పటి వరకు దేశంలో కులగణనే జరగలేదని, ఆలాంటి పరిస్థితుల్లో బిసిలకోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని విమర్శిస్తుండా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు సిఎం రేవంత్‌రెడ్డి విమర్శిస్తున్నారా ? చెప్పాలన్నారు. ట్రిపుల్ టెస్ట్ ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ వేసి కులగణన పై సర్వే చేసిందన్నారు. ఆర్.కృష్ణయ్య కు రాజ్యసభ సీటువస్తే సరిపోద్దా?బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరం లేదా ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## సిజిఎఫ్ నిధులు పారదర్శకంగా వినియోగించాలి

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సిజిఎఫ్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎండోమెంటు డిపార్టుమెంటు అధికారులు ప్రధానంగా ఈ అంశంపైనే ఫోకస్ పెట్టాల్సిన అనివార్యత ఉందని మంత్రి ఉద్ఘాటించారు. సచివాలయంలో శుక్రవారం ఎండోమెంటు డిపార్టుమెంటు సిజిఎఫ్ కమిటీ మీటింగు జరిగింది. ఈ సమావేశం మంత్రి సురేఖ నేతృత్వంలో జరగ్గా, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఇతర ఉన్నతాధికారులు, ఈఓలు, సిజిఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఆషాఢ బోనాలు ఈ దఫా వరంగల్ భద్రాకాళి టెంపుల్ లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పండగను, సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నదే తమ ఉద్దేశమన్నారు. మన రాష్ట్ర ప్రజలను ధార్మిక చింతన వైపు తీసుకెళ్ళడంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు.

**అధికారు కృషి అవసరం :**

రాష్ట్రంలో చిన్న చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ఈఓలు, ఆ శాఖ ఉన్నతాధికారుల కృషి అనివార్యమని మంత్రి అభిప్రాయపడ్డారు. సీజీఎఫ్ లో భాగంగా, చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సురేఖకు అధికారులు వివరించారు. బడ్జెట్ అనుమతులు,సిజిఎఫ్ నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల మీద అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. శుక్రవారం జరిగిన సిజిఎఫ్ సమావేశంలో రూ. 72.47 కోట్ల విలువైన, మొత్తం 297 వర్కులు ఆమోదం తెలిపారు.

## ఇష్టానుసారంగా 'యాంటిబయోటిక్' మందుల విక్రయం

193 మెడికల్ షాపులకు షోకాజు నోటీసులు

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలే

డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ షాపులు తమ ఇష్టానుసారంగా 'యాంటిబయోటిక్' మందులను విక్రయిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డిసిఎ) దాడుల్లో తేలింది. పలు మెడికల్‌షాపులు నియమ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని గుర్తించింది. ఇలాంటి 193 మెడికల్ షాపులకు డిసిఎ షోకాజు నోటీసులను జారీ చేసింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలు మెడికల్ షాపులపై దాడులను నిర్వహించినట్టు డిసిఎ డైరక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం తెలిపారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటిబయోటిక్ మందులను విక్రయించే మెడికల్ షాపులపైన ఔషధాలు,కాస్మోటిక్ చట్టం1940 ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో యాంటి మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) నియంత్రణ చర్యలలో భాగంగా తెలంగాణ రాష్ట డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా యాంటిబయోటిక్ మందుల విక్రయాల్లో అనేక ఉల్లంఘనలు జరుగుతున్నట్టు గుర్తించారు. వైద్యుల సూచనలు లేకుండానే ఇష్టానుసారంగా యాంటిబయోటిక్ మందుల విక్రయిస్తున్నారని, మరి కొన్ని మెడికల్ షాపులు బిల్ లేకుండా విక్రయిస్తున్నారని, ఫార్మసిస్ట్ లేకుండానే షాపులను నడిపిస్తున్నారని ఇలా పలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డిసిఎ జాయింట్ డైరక్టర్ జి.రామ్‌దాన్ తెలిపారు. ఆన్ లైన్ ,ఆఫ్‌లైన్ మార్కెట్లలో యాంటీబయోటిక్స్‌ను నిర్లక్ష్యంగా ఉపయోగిస్తున్నారని,ఈ మందులను సాధారణ వ్యాదిగ్రస్తులకు ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉన్నదని డిసిఎ అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఎఎంఆర్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 10 ప్రధాన ఆరోగ్య ముప్పులలో అనవసరంగా యాంటిబయోటిక్స్ వాడకం కూడా ఒకటి అని డిసిఎ చెబుతుంది. యాంటిబయోటిక్స్ సక్రమంగా వాడితే ప్రాణాలను కాపాడుతుందని, కానీ అనవసరంగా, సరైన మోతాదు లేకుండా, ఈ మందులను వాడితే అవి పనిచేయకపోవచ్చని, పైగా ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని ప్రజలకు డిసిఎ అధికారులు సూచించారు.

వైద్యుడు సూచించినప్పుడు మాత్రమే యాంటిబయోటిక్స్ వాడాలని, సాధారణ జలుబు, తలనొప్పి, లేదా వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటిబయోటిక్స్ వాడకూడదని, పూర్తిగా ప్రిస్క్రిప్షన్ మోతాదు మేరకే మందులను వాడాలని, ఒకరికి రాసిన మందులను మరొకరు వాడకూడదని డిసిఎ జాయింట్ డైరక్టర్ జి.రామ్‌దాన్ సూచించారు.

## కక్షసాధింపు చర్యలకు పాల్పడితే బిఆర్‌ఎస్ నాయకులు జైల్లో ఉండేవారు

టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు చేస్తే ఇప్పటికే మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, ఎంఎల్‌సి కవిత చర్లపల్లి జైలులో ఉండేవారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు, నేతల అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విచారణ చేసి తీహార్ జైలుకు పంపుతుందని, ప్రజలు వారిని తెలంగాణ నుండి తరిమికొడతారన్నారు. కెటిఆర్ మరోసారి సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఆయన ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనే కెసిఆర్‌ను విచారణకు పిలిచారని, అవినీతి జరిగితే ముఖ్యమంత్రి అయినా, ప్రధాని అయినా విచారణకు పిలుస్తారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్‌ఎస్ నేతలే అవినీతికి పాల్పడింది నిజం కాదా?, బిఆర్‌ఎస్ నేతల ఆస్తులు రూ.3 లక్షల కోట్లు ఎక్కడి నుండి వచ్చాయని ఆయన నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారన్నారు.



## సిఎంను కలిసిన పలువురు మంత్రులు, ఎంఎల్‌ఎలు, సిపిఆర్‌ఓ

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చోటు కల్పించిన నేపథ్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆ సామాజిక వర్గం ఎంఎల్‌ఎలు శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో పాటు పలువురు ఎంఎల్‌ఎలు కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి ప్రధాన ప్రజాసంబంధాల అధికారి (సిఎం సిపిఆర్‌ఓ)గా నియమితులైన గుర్రం మల్సూర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



## గవర్నర్‌కు ఆహ్వానం అందించిన నందమూరి బాలకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 25వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలంటూ సినీ నటుడు, ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ఆహ్వానం అందించారు. ఆసుపత్రి ట్రస్ట్ బోర్డు సభ్యులు డాక్టర్ కె.కృష్ణయ్యతో కలిసి బాలకృష్ణ శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్సిస్టిట్యూట్ యొక్క 25 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని గవర్నర్ కు ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యొక్క 25 వ సంవత్సరముల ప్రయాణాన్ని గవర్నర్ కు వివరించి ప్రస్తుతం రజతోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం గౌరవనీయులైన గవర్నర్ సంస్థ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ 25 వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావడానికి సూత్రప్రాయ అంగీకారాన్ని తెలియజేశారు.

## కొమ్మినేనికి ఊరట

### విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశం



**అమరావతి :** సాక్షి టీవీ వ్యాఖ్యాత, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస రావుకు ఊరట దక్కింది. ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇటీవల ఆ..టీవీ చర్చా వేదికలో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలతో కొమ్మినేనిపై అనేక కేసులు నమోదయ్యాయి. ఈనెల 9న విజయవాడ పోలీసులు ఆయనను హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. మంగళగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో కొమ్మినేనిని గుంటూరు జైలుకు తరలించారు. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన కొమ్మినేనికి ఊరట లభించింది. వెంటనే విడుదల చేయాలంటూ కోర్టు ఆదేశించింది. కేసు నిబంధనలు ట్రయిల్ కోర్టు చూసుకుంటుందని జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. మరెప్పుడు కూడా ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని, వాటిని ప్రోత్సహించవద్దని సూచించింది.

**చంద్రబాబుకు చెంపపెట్టు : జగన్**

సుప్రీం కోర్టు తాజా ఉత్తర్వులను మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వాగతించారు. కొమ్మినేని విడుదల సిఎం చంద్రబాబుకు చెంపపెట్టు అని అన్నారు. 'నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు కోర్టు బుద్ధి చెప్పింది. ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు భంగం కలిగించేదిగా ఈ అరెస్టును కోర్టు పేర్కొనడం ముదావహం' అని జగన్ వ్యాఖ్యానించారు. అమరావతి నిర్మాణం పేరిట వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన శాంతి భద్రతలపై చర్చ నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి తన ముఠాతో కలిసి కృత్రిమ వివాదాన్ని చంద్రబాబు సృష్టించారని ఎక్స్ వేదికగా జగన్ విమర్శించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలన నుంచి మళ్లించడానికి, చేయని వ్యాఖ్యలను కొమ్మినేనికి ఆపాదించి, ఎల్లో గ్యాంగ్ ద్వారా విష ప్రచారం చేయించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రౌడీయిజం చేశారని, ఆస్తులను ధ్వంసం చేశారని ఆరోపించారు. మహిళల నిరసన నెపంతో సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించారని, మీడియా స్వేచ్చను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారని జగన్ మండిపడ్డారు. తన తప్పును తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైసీపీకి, సాక్షి మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా చంద్రబాబు మాట్లాడంతోనే ఆయన రాజకీయ లబ్ధి కోసం ఈ కుట్ర పన్నారని అర్థం అవుతోందన్నారు. 'విశ్లేషకుడు వ్యాఖ్యలతో యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేనికి సంబంధమేమిటి? సుప్రీం కోర్టు ఉత్తర్వులు చంద్రబాబు కుట్రను ఎండగట్టింది. రాష్ట్రంలో అక్రమ అరెస్టుల అంశం దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటు కాబోవు. సత్యమేయ జయతే..' అంటూ జగన్ ట్వీట్ చేశారు. కొమ్మినేనికి బెయిల్‌పై మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజని, మాజీ ఎంపీ వంగా గీత, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

## కర్ణాటకలో 'థగ్‌లైఫ్'పై అనధికార నిషేధం

ప్రభుత్వ సమాధానం కోరిన సుప్రీం

**న్యూఢిల్లీ:** 'థగ్‌లైఫ్' చిత్రాన్ని థియేటర్లలో ప్రదర్శించకుండా కర్ణాటకలో నోటిమాటద్వారా అనధికారికంగా నిషేధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సిద్ధరామయ్య ప్రభుత్వం తగిన సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు శుక్రవారంనాడు ఆదేశించింది. ఈ విధంగా ప్రదర్శన నిషేధం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్'చిత్రాన్ని థియేటర్లలో ప్రదర్శించడంపై బెదిరింపులు రావడంతో తగిన రక్షణ ఇవ్వాలని కోరుతూ ఒక పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలైంది. ఈ చిత్రం జూన్ ఐదో తేదీన దేశవ్యాప్తంగా విడుదలైంది. 1987లో నాయకన్ చిత్రం తర్వాత మణిరత్నం,కమల్ హాసన్ కాంబినేషన్‌లో మళ్ళీ విడుదలైన చిత్రం ఇదే. కన్నడభాషకు జన్మనిచ్చింది తమిళమేనని ఇటీవల కమల్‌హాసన్ వ్యాఖ్యానించడంతో పెద్ద వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో 'థగ్‌లైఫ్'పై కర్ణాటకలో అనధికార నిషేధం వచ్చిందని భావిస్తున్నారు. దీనిపై స్పందించి సమాధానం చెప్పాలని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఈనెల 17 నాటికి సమాధానం చెప్పాలని కోరింది. తమిళ ఫీచర్ ఫిలిమ్‌ను ప్రదర్శించకుండా నిషేధం విధించడాన్ని సవాలు చేస్తూ ఎం.మహేశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. కమల్ హాసన్ నటించిన ఈ చిత్రానికి మణిరత్నం దర్శకత్వం వహించారు. మహేశ్ రెడ్డి తరపున న్యాయవాది వి.వేలన్ కోర్టుకు హాజరై వాదనలు వినిపించారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిమ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి అనుమతి ఇచ్చినప్పటికీ కర్ణాటకలో నిషేధించారని ఆయన ఫిర్యాదు చేశారు. తమ చిత్ర ప్రదర్శనకు అనుమతించి రక్షణ ఇవ్వాలని కోరారు. అధికారికంగా ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వకుండా నోటిమాట ద్వారా నిషేధించి పోలీసులు జోక్యం చేసుకున్నారని, పోలీసులు ఎలాంటి ఎఫ్‌ఐఆర్ కూడా దాఖలు చేయలేదని ఆయన కోర్టుకు తెలియజేశారు. రాజ్యాంగంలోని 19 (1) ఎ,19 (1)జి, 21 ప్రకారం భావప్రకటనాస్వేచ్ఛకు, తీవ్ర ఆటంకం కలిగించారని, ఇది అక్రమం, అన్యాయం, ఇది రాజ్యాంగ విరుద్ధమని న్యాయవాది వేలన్ ధర్మాసనం ముందు వాదించారు.

పోలీసులు పూర్తి భద్రత ఇచ్చి ప్రదర్శనకు భరోసా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈనెల తొమ్మిదోతేదీన సుప్రీంకోర్టు ఈ కేసును అత్యవసర ప్రాతిపదికపై విచారణ చేసేందుకు తిరస్కరించింది. కర్ణాటక హైకోర్టును ఆశ్రయించడానికి బదులుగా కర్ణాటక థియేటర్ అసోసియేషన్ ద్వారా న్యాయం కోరాలని చెప్పింది. ఈ చిత్రంవల్ల చట్టబద్ధ ప్రక్రియ కింద ఎలాంటి హింస చెలరేగే అవకాశం లేదని, కానీ ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ప్రచారం చేసినట్లవుతుందని, దీనివల్ల థియేటర్ల దహనాలు, పెద్దెత్తున మతహింసను పురిగొల్పడం, భాషాపరమైన మైనారిటీలే లక్ష్యంగా దాడులు చేయడం వంటి పరిస్థితులు ఏర్పడేందుకు ఉద్దేశపూర్వక ప్రచారం చేసినట్లు కాగలదనే పేరుతో నిషేధం విధించారని పిటిషనర్ పేర్కొన్నారు.

## నీటిపొదుపే నేటి మంత్రం

**ప్రజాపక్షం/బిజినేపల్లి:** రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలోభాగంగా శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాగర్కర్నూల్ మండలంలోని మంతటి రైతువేదికలో బిఎస్సి కళాశాల పాలెం అసోసియేట్ డీన్ డాక్టర్ పుష్పవతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ వివిధ పంటలకు నీటిని పొదుపుగా పంటలకు వాడుకోవడమే నేటిమంత్రం అని ప్రస్తుత వ్యవసాయరంగంలో నీటిని ఎక్కువగా పారించకుండా సకాలంలో నీటితడులు ఇచ్చి పొదుపుగా వాడుకోవడంద్వారా నీటిని ఆదా చేయడంద్వారా అనేక లాభాలున్నాయన్నారు. ఎక్కువతడుల్లు ఇచ్చినష్టపోకూడదని రైతన్నలకు ఆమె సూచించారు. అదేవిధంగా పొలాల గట్లపై చెట్లునాటి అదనపు ఆదాయం పొందడంలాంటి అంశాలపై వారు క్షుణ్ణంగా రైతన్నలకు వివరించారు. తమ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు రైతన్నలకు సకాలంలో కావాల్సిన సలహాలు సూచనలు అందించడంలో ఎప్పటికి ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భానుశ్రీ, ఉద్యానశాఖ అధికారులు జగన్, వ్యవసాయ విస్తరణ అధికారులు విజయ్, సతీష్, కోటేశ్వరరావులతోపాటు ఎంపిడిఓ అనంతయ్య, పిఎసిఎస్చైర్మన్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

## 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన

**ప్రజాపక్షం / కొత్తకోట:** కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలో 5 కోట్ల 75 లక్షలతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి కొత్తకోటలో ఆసుపత్రిని నిర్మించలేక పోయిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నెలకొల్పిన ఆరుపడకల ఆసుపత్రిలోనే ఇప్పటికి ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని, నేడు 30పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు.



## ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/మద్దూర్:** మద్దూర్ మున్సిపాలిటీ లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెనివట్లలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్, ఏక రూపదుస్తులు పంపిణీ చేశారు. మద్దూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్‌లతోపాటు పోషకాల తో కూడిన మధ్యాహ్నం భోజనం, ఉదయం అల్పాహారం అందిస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు వీరయ్య, బాల రాజ్, బ్రహ్మయ్య, సాయి కుమార్, భాను ప్రకాష్, రాజేష్, సల ఉద్దీన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎర్రమట్టి అక్రమ తరలింపు అడ్డుకోండి



**ప్రజాపక్షం/ ధన్వాడ:** ధన్వాడ మండల కేంద్రంలో గల పెద్ద చెరువులో అక్రమంగా వంద్రు మట్టిని తరలిస్తున్నారు. రైతులకు తరలించకుండా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు.వెంటనే ధన్వాడ పెద్ద చెరువు నుండి ఒంద్రు మట్టిని ఆపివేయాలని, ఇటుక బట్టీలపై చర్య తీసుకోవాలని ధన్వాడ మండల బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మద్దెలబిడ్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. అక్రమ దందా ఆపకపోతే బీఆర్ఎస్ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ధన్వాడ ఎస్సై కి, ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేసారు.ధన్వాడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎం. వెంకట్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, గున్ముకుల మాజీ ఎంపీటీసీ డి. సుధీర్ కుమార్ రావు, సీనియర్ నాయకులు జుట్ల సత్యనారాయణ గౌడ్, మురళి ధర్ రెడ్డి, చంద్రశేఖర్, కె. శివరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు వడ్ల శాంతి కుమార్, మైనారిటీ నాయకులు నాసర్, గౌని రాజేందర్ రెడ్డి, ఎల్. వెంకటయ్య గౌడ్, జీ. నర్సింహులు, జీ. గోవిందు, యువజన విభాగం నాయకులు కృష్ణ దాస్, ఇఫ్రాన్, అలుగు మీది వెంకటేష్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.


## గురుకులాల్లో..ప్రతి విద్యార్థికి సీటు కల్పించాలి : పి.వెంకటేష్

**ప్రజాపక్షం/ ధన్వాడ:** ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, బీసీలు, గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని సిపిఐ నారాయణపేట జిల్లా కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్ కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల సొసైటీ సాంఘిక సంక్షేమ హాస్టల్ కస్తూర్బా గాంధీ పాఠశాల,ఇంటర్మీడియట్ డిగ్రీ కళాశాల, మాడల్ హై స్కూల్ దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ అవకాశం కల్పించాలని సూచించారు.

## 16న ఉచిత మెగా వైద్య శిబిరం


**ప్రజాపక్షం/జడ్చర్ల:** కొడుగల్ గ్రామంలో క్రీ.శే.చర్లకోల శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం ఎస్‌విఎస్ హస్పిటల్ వారి వైద్య బృందం సౌజన్యంతో ఈ నెల 16న ఉచిత మెగా వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నారు. కరపత్రాలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు విడుదల చేశారు. కొడుగల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ శ్వేతా లక్ష్మారెడ్డి వారి జీవిత కాలంలో జడ్చర్ల నియోజకవర్గ ప్రజల మనసులు చురకొనడం వల్ల వారి ఆత్మశాంతి కోసం ఉచిత వైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిబిరం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటలకు వరకు కొనసాగునని తెలిపారు.

## జెడ్‌పి హైస్కూల్లో శతాబ్ది సంబరాలు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** మనం నివసిస్తున్న పట్టణంలో వందేళ్ల హై స్కూల్ ఉండటం మనందరికి గర్వకారణమని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. బాదేపల్లి జడ్పీహైస్కూల్ ప్రాంగణంలో శతాబ్ది సంబరాల్లో భాగంగా శుక్రవారం కమిషనర్ లక్ష్మారెడ్డి తో కలిసి మొక్కలు నాటారు. పాఠశాల అభివృద్ధిలో పాలకవర్గం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని వందేళ్ల హై స్కూల్ ను పరిరక్షించుకోవడంతో పాటు భావి తరాలకు స్ఫూర్తినిచ్చేలా శతాబ్ది సంబరాల్లో తమవంతు పాత్ర పోషిస్తామని భరోసా కల్పించారు. 100 సంవత్సరాల సందర్భంగా 100 మొక్కలు నాటడం అభినందనీయమని పూర్వ విద్యార్థులను కొనియాడారు. ఆ మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత పూర్వ విద్యార్థులే తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్, ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, ఉపాధ్యాయులు సునీల్, గోపాల్, కృష్ణయ్య, సయ్యద్, ఇబ్రహీంతో పాటు పూర్వ విద్యార్థులు కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు బి.రవి శంకర్, వి.కృష్ణ, జయప్రకాశ్, బాబర్, పరమటయ్య, సత్యం, ఆనంద్, దత్తు బికెఆర్ మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

## విమాన ప్రమాదం కలచివేసింది




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన తీవ్రంగా కలిచివేసిందని, మృతులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురవరం వెంకట్రాంరెడ్డి భవన్ సిపిఐ ఆఫీసులో బి.బాలకిషన్ మాట్లాడుతూ అహ్మదాబాద్ విమానాశ్రాయం నుండి లండన్‌లోని గాట్విక్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం కూలిపోయిందని, ఈ ఘటనలో సిబ్బందితో సహా 242 మందితో ప్రయాణిస్తున్న ఈ విమానం విమానాశ్రయ సమీపంలో ఉన్న వైద్య కళాశాలలోకి దూసుకెళ్లి కూలిపోయిందని, బిల్డింగ్‌లో ఉన్న డాక్టర్లు కూడా చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు సిపిఐ నాయకులు వెంకటయ్య, శ్రావణ్ కుమార్, హనుమంతు తదితరులు ఉన్నారు.

# భూ సేకరణలో మరింత వేగం



### నాగర్‌కర్నూలు కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న కెఎస్ఐ, పాలమూరు రంగారెడ్డి, మార్కేండేయ, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తదితర నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో కలెక్టర్ బదావత్‌సంతోష్ రెవెన్యూ అధికారులతో భూసేకరణ పురోగతి పనులపై ప్రతివారం నిర్వహించే సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ఆటంకాలు కలగకుండా చూసేందుకు ఈభూసేకరణ కీలకమని తెలిపారు. జిల్లాలో వివిధదశల్లో నిర్మాణాల్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగవంతంగా భూసేకరణ పనులు కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతవారం జిల్లా కలెక్టర్ నిర్దేశించిన మేరకు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను ప్రాజెక్టులవారిగా అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల పురోగతిని గమనిస్తూ, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.అమరేందర్, రెవెన్యూ, వివిధ ప్రాజెక్టుల నీటిపారుదలశాఖల అధికారులు పాల్గొన్నారు.

### వరిధాన్యం కొనుగోళ్లు చరిత్రాత్మకం

నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా రైతుల అభ్యున్నతి, సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు చేరవేయడంతోపాటు రైతులకోసం నిరంతరం జిల్లా అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తుందని కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో



కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో 1లక్షా60 వేల ఎకరాల్లో వరిపంట జరిగిందని, వ్యవసాయశాఖ అధికారు ల అంచనా ప్రకారం 3లక్షల మెట్రిక్‌టన్నుల వరిధాన్యం దిగుబడి అయ్యిందని, రైతుల అవసరాలకు , విత్తనాల వినియోగానికి అవసరమైన మేరకు వరిధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందన్నారు. జిల్లా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా ప్రప్రథమంగా పెద్ద మొత్తంలో వరిధాన్యం నేరుగా రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగిందని, అదే సమయంలో ధాన్యం డబ్బులనుకూడా వారిఖాతాల్లో జమచేశామని వివరించారు.

## అచ్చంపేట ఆస్పత్రి సమస్యలపై ఆందోళన

**ప్రజాపక్షం/అచ్చంపేట:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆస్పత్రిముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిముందు సిపిఐ ఆధ్వర్యంలో నియోజకవర్గపు కార్యదర్శి పెరుమాళ్లగోపాల్, తాలుకా నాయకుడు ఎస్.మల్లేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.వారు మాట్లాడుతూ గతంలో 70పడకల ఆస్పత్రిని ఐదుమంది డాక్టర్లు నిర్వహించేవారన్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడ్‌చేసి వందపడకల ఆస్పత్రినిచేసిందన్నారు. నామమాత్రంగా ఆస్పత్రి కనబడుతుంది కాని అందులో కనీస సౌకర్యాలుకూడా లేవన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో శానిటేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఐదునెలల జీతాలురాలేదన్నారు. ఇటీవలనే ప్రారంభించిన ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయడంలేదన్నారు. గర్భిణీలకు మూడోనెల, 9నెల స్కానింగ్ తీయాలని డిమాండ్ చేశారు. మంగళ, గురువారం కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయాలన్నారు. కాంట్రాక్టు డాక్టర్లను తొలగించి వారిని పర్మినెంట్ ఉద్యోగులను ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం డాక్టర్ ప్రదీప్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐపార్టీ తాలుకానాయకులు తిరుపతమ్మ, భాస్కర్, మాధవి, చంద్రయ్య పాల్గొన్నారు.

## బైరాపురం పాఠశాలలో అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/ఉండవల్లి:** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. మం డల విద్యాధికారి రామకృష్ణ బైరాపురం ప్రాథమిక పాఠశాల సందర్శించి ఇక్కడ విద్యార్థులకు అక్షరాభ్యాసం నేర్పించారు. అందులో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, టెస్టు పుస్తకాలు , దుస్తులు వంటివి అందజేశారు. రోజు వారి కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో అక్షరభ్యాసం కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. అనంతరం మధ్యాహ్న భోజనాలు ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు.

## ఇవిఎం గోడౌన్ పరిశీలన



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా కేంద్రంలోని బస్టాండ్ దగ్గర లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం అదనపు కలెక్టర్ లోకల్ బాడీ, రెవెన్యూ ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిపీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆర్.డి.ఓ. రాంచందర్ సిబ్బంది , రాజకీయ పార్టీ ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, మనివర్ధన్, వెంకట్రాం రెడ్డి, వెంకటయ్య, మొహమ్మద్ అబ్దుల్ తదితరులు ఉన్నారు.

## డిగ్రీ అడ్మిషన్లకు చివరి అవకాశం




**ప్రజాపక్షం/ మద్దూర్:** మద్దూర్ మున్సిపాలిటీ కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ విడత అడ్మిషన్స్ కు చివరి అవకాశం 13వ తేదీ నుండి 19 వరకు ఉందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. కృష్ణ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఈనెల 13వ తేదీ నుండి 19వ తేది వరకు అడ్మిషన్లు పొందగలరని తెలిపారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నుండి స్కాలర్షిప్, ఫీజు రీఎంబర్ మెంట్ ఉంటుందన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ బి. కృష్ణ రెడ్డి, అధ్యాపకులు జనార్ధన్, నజీర్, బాలరాజ్, ఈశ్వర్, గ్రీష్మ పాల్గొన్నారు.

## బండ్లగేరీ అంగన్‌వాడీలో ‘అమ్మ మాట—అంగన్‌వాడీ బాట’

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి:** జిల్లా కేంద్రం బండ్ల గేరి అంగన్ వాడి 2 కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట అంగన్ వాడి బాట నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అంగన్ వాడి కేంద్రంలో టిహెచ్‌ఆర్, హెచ్‌సిఎం ద్వారా పౌష్టికాహారం గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిడబ్ల్యుఓ జరీనా కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ 3+ పిల్లలను అంగన్ వాడిల్లో చేర్పించి వారి భవిష్యత్తుతో మంచి బాట వేయాలని కోరారు. పౌష్టిక ఆహారం ప్రాధ్యాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ప్రసన్న, అంగన్ వాడి టీచర్లు కవిత, కౌసల్య, రాజేశ్వరి, సరస్వతి, కుర్మమ్మ, భాగ్యవతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యలుంటే వైద్య పరీక్షలు తప్పనిసరి



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** గ్రామాలలో ప్రజలు ఆరోగ్య సమస్యలుంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శుక్రవారం పాన్‌గల్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో సమగ్ర ఆరోగ్య శిబిరాలు నిర్వాణలో భాగంగా ఆరోగ్య సమస్యలున్న ప్రజలకు వైద్య పరీక్షలలు నిర్వహించారు. జిల్లా వైద్య బృందం , ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపేన్ బృందం, ఎన్జిఓ టీమ్ సభ్యుల సహకారంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్న పరీక్షలు చేయించుకోవాలని డయాబెటిస్ , బిపి క్షయవ్యాధి నిర్ధారణ కు స్పూటమ్ సేకరణ, ర్యాండమ్ బ్లడ్ పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు మొదలగు వాటికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సక్రమిత వ్యాధులు అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధులు తదితర వాటిని 63 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయనతెలిపారు. ఎమ్ఎల్‌హెచ్‌పి డాక్టర్స్ నీహారిక, సూపర్వైజర్ శాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ బుద్ధమ్మ , నిర్మల, సతీష్ కుమార్ , ఆశ కార్యకర్తలు శివరాంని , లలిత, సునిత, ఎన్జీఓ టీమ్ శివాణి, లింక్ వర్కర్ , హెచ్‌ఐవి టీమ్ సభ్యులు బంగారయ్య, హెచ్‌ఐవి కౌన్సిలర్ , లక్ష్మణ్ ల్యాబ్ టెక్నీషియన్ , క్షయవ్యాధి బృందం ప్రవీణ్ కుమార్ , లక్ష్మి నారాయణ, ఖాజా, నగేష్ , వినోద్ , శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే ‘షీ టీమ్స్’ లక్ష్యం

### ఎస్పీ యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన గానీ, మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణ పేట్ జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీం లు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, గృహహింసకు గురైన ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తు నిందితుల పై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు, బస్టాండ్ల దగ్గర, గ్రామాలలో, కాలనీలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లకు గురైనా, ఉద్యోగ మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికల పై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీటీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఎస్పీ తెలిపారు. షీటీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ద్వారా మహిళలు సామాజిక మద్యమాలైన ఫెస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో పోటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు షీటీమ్ 8712670398 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని అట్టి వ్యక్తుల పై చట్ట ప్రకారం కఠిన చ్యలు తీసుకోవడం జరుగుతుందిన ఎస్పీ తెలిపారు.

# అభివృద్ధి.. ప్రజా ప్రభుత్వ ఎజెండా : మేఘారెడ్డి

**ప్రజాపక్షం / పెబ్బేరు:** ప్రజల అవసరాలను సకాలంలో సమకూరుస్తున్న ప్రజాప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం విద్యా క్రీడా రంగాలను బలోపేతం చేసేందుకుగ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా విద్యా కమిషన్ ను ఏర్పాటు చేసి ప్రణాళికా బద్దంగా ముందుకెల్తూ పాఠశాలల పునః ప్రారంభం కన్నా ముందే పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట బుక్కులు, ఏక రూప దుస్తులు చేరాయన్నారు.పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు అందజేశామన్నారు. తూడి మేఘారెడ్డి పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాలలో పర్యటించారు. శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిం చారు. అయ్యవారిపల్లిలోబడిబాట, అక్షరాభాస్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న ఏకరూప దుస్తువులను నోట్ బుక్కులను పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , యాపర్ల రాంరెడ్డి, పెబ్బేరు మండల యూత్ అధ్యక్షులు రాజేష్ , నాయకులు రంజిత్ కుమార్ , వెంకట్రాములు, శ్రీహరిరాజు, యుగేందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ కురుమూర్తి, గంధం రాజశేఖర్ , వెంకటేష్ సాగర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వేగవంతం

### నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట :** గుండుమాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. కోస్గి మండలంలో శుక్రవారం సుడిగాలి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గుండుమాట్ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని బేస్‌మెంట్ లెవెల్ పరిశీలించారు. అలాగే బొగరం గ్రామ పంచాయితీలో పాఠశాలలో పనులను పర్యవేక్షించడం జరిగింది. బొగరం నుండి అంలికుంట్ల రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. కడంపల్లి నుండి హనుమాన్‌పల్లి గ్రామాలకు కలుపుతూ బ్రిడ్జి నిర్మాణం పనులు పరిశీలించి అక్టోబర్ వరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్ కి తెలిపారు. తోగపూర్ గ్రామం నుండి పందిరి హనుమాన్ గ్రామ పంచాయితీ వరకు 4 కిటోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను ఆగస్టు మొదటి వారం వరకు పూర్తి చేయాలని సూచించారు. కోస్గి మండలం సర్జఖాన్ పేట్‌లో జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాల పనులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. ఉదయం బ్రేక్ ఫస్ట్ ఇచ్చారా లేదా అనే విషయాన్ని విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను ఇవ్వాలని అలాగే పాఠ్యపుస్తకాలను నోటు పుస్తకాలను అందించాలని ఆదేశించారు. గత సంవత్సరం విద్యార్థుల సంఖ్య ఇప్పుడున్న విద్యార్థుల సంఖ్య ఇప్పుడున్న విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోతిరెడ్డిపల్లి నుండి గుండాల్‌వయా, సర్జఖాన్ పేట్ రోడ్లను పరిశీలించారు. పోతిరెడ్డిపల్లి నుంచి జిన్నారం రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన కొడంగల్ నియోజకవర్గంలో పంచాయితీరాజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంబడి సంబంధిత అధికారులు కోస్గి ఎంపీడీవో శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## గర్భిణులకు మెడికల్ కిట్లు



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి మండలంలోని సుద్దకల్ గ్రామంలో ఉప్పల చారిటబుల్‌ట్రస్టుచైర్మన్, తెలంగాణ మిషన్‌భగీరథ మాజీ వైస్‌చైర్మన్, బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పలవెంకటేష్ సహకారంతో గ్రామంలోని గర్భిణీస్త్రీలకు మెడికల్ కిట్లని అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌రాంరెడ్డి, కాశన్న, ఆంజనేయులు, చంద్రశేఖర్, ఆశ వర్కర్లు, గ్రామపెద్దలు , మహిళలు పాల్గొన్నారు.

## డిఇఒ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని కొట్రగ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డిఇఓ రమేష్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల గణిత, ఆంగ్ల సామర్థ్యాలను పరిశీలించి సబ్జెక్టును బోధించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషిచేయాలని సూచించారు. ఇదిలా ఉండగా మండలపరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఎంఈవో చంద్రుడు ప్రాథమిక విద్యనభ్యసించేందుకు చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** (నేడు) శనివారం జరిగే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా కోరారు. శుక్రవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్, కంపౌండబుల్ కేసులు, సివిల్ తగదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన కేసులు, డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులు, మోటార్ ట్రాన్స్‌పోర్టు రోడ్డు నిబంధనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరి, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజమార్గమన్నారు. చిన్న, చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టు తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లోక్ ఆదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు.

## ప్రభుత్వ కళాశాలలో అడ్మీషన్ల సంఖ్య మెరుగుపరచాలి

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య మెరుగుపరచాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి ఆదేశించారు. బీద కుటుంబం విద్యార్థులకు చదువుతూనే పేదరికం పోయి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కళాశాల ప్రిన్సిపల్స్ తో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కళాశాల వారిగా ఇచ్చిన అడ్మిషన్ల టార్గెట్‌ను ఎన్ని అడ్మిషన్లు వచ్చాయని సమీక్షించారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి వారికి మంచిగా అర్థం అయ్యే విధంగా బోధన అందించాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విదార్థి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న సకల సౌకర్యాల, బోధన గురించి తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. ఈ సమీక్షలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



## పేదలకు మెరుగైన సేవలందించాలి

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్ ఆసుపత్రులు పేదలకు వైద్య సేవలు అందించాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం లోటస్ ఆసుపత్రిని వారు ప్రారంభించి మాట్లాడారు. నేడు వైద్యం ఎంతో ఖరీదుతో కూడుకుందని, వ్యాపార దృక్పదంతో కాకుండా సేవా దృక్పదంతో పేద వర్గాలకు వైద్య సేవలను అందించేందుకు ముందుండాలని సూచించారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని వైద్యులను రోగులు దేవుళ్లుగా పరిగణిస్తారని అన్నారు. ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మిర్యాలగూడలోనే అన్ని వసతులతో లోటస్ ఆసుపత్రిని ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కొండ రాంబాబు, డైరెక్టర్, వైద్యులు సంజయ్‌కుమార్, ఎముకల వైద్యులు జగదీష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో పి.శ్రీనివాస్, ప్రాజెక్టు ఆఫీసర్ అరుంధతి, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలో పిఆర్‌జి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భువనగిరి శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులందరికి నిలువ నీడను కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టిందన్నారు. పేదల సొంత ఇంటి కలను ప్రభుత్వం దశలవారీగా నెరవేరుస్తుందని ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయన్నారు. రేకులు, పైకప్పులు లేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటూ బేస్మెంట్ కట్టుకున్న వారికి లక్ష రూపాయలు, లెంటల్ లెవెల్ వరకు నిర్మించుకున్న వారికి మరో లక్ష రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఈ విధంగా మొత్తంగా ప్రతి ఇంటికి ఐదు లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మండల స్పెషల్ అధికారి సుభాషిని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతితో భూ సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/మోతె:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన భూభారతి రెవిన్యూ చట్టంలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ సదస్సులు అని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని విభలాపురం రెవిన్యూ గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ సదస్సు జూన్ 20వ తేదీ వరకు కొనసాగుతుందని ఈ సదస్సులో రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చుసుకోవచ్చని అన్నారు. మండలంలో నేటితో గ్రామ రెవిన్యూ సదస్సు చివరి రోజు కావడంతో మండలం మొత్తంలో అన్ని గ్రామాలలో కలిపి 2077 దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ తెలిపారు. ఎం.వెంకన్న, సీనియర్ అసిస్టెంట్ సుజిత్, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు నాగయ్య, సుధాకర్, ఉపేంద్ర, రూపా, వంశీ రైతులు పాల్గొన్నారు.

## బస్‌పాస్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/గుండాల:** రాష్ట్రంలో ఆర్టీసి యాజమాన్యం పెంచిన విద్యార్థుల బస్ పాస్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు బద్దుల శ్రీను శుక్రవారం ఆర్టీసి యాజమాన్యాన్ని కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పది లక్షలకు పైగా పేద, మధ్య తరగతి గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి ఆర్టీసి బస్సుల ద్వారా పట్టణాలకు వెళుతుంటారని ఈ బస్ పాస్ చార్జీలు పెంచడం ద్వారా వారిపై పెనుభారం పడుతుందని ఆయన అన్నారు. నెలకు రూ. 400 ఉన్న బస్‌పాస్ చార్జీలను 600లకు, మూడు నెలల ప్యాకేజీని రూ. 1200 నుండి 1800లకు పెంచుతూ పేద మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్ షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్‌లు ఇవ్వకుండా బస్‌పాస్‌ల చార్జీల పెంచి విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తక్షణమే పెంచిన బస్ పాస్ చార్జీలను వెనక్కి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, ఆర్టీసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

## ఘోర విమాన ప్రమాదంపై సిపిఐ దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/దేవరకొండ:** గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి శుక్రవారం ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. విమానం పడిన భవనంలో నివసిస్తున్న మెడికల్ విద్యార్థులు సైతం చనిపోవడం తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. చనిపోయిన ప్రయాణికులకు, విద్యార్థులకు, సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా దేశ పౌర విమానయాన శాఖ కట్టుదిట్టమైన నిర్వహణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి):** రైతులు వ్యవసాయం ద్వారా మంచి లాభాలు సంపాదించేందుకు ఎప్పుడూ పండించే సాధారణ పంటలు కాకుండా, ఉద్యాన, వాణిజ్య పంటలను సాగు చేయాలని ఈ పంటల వల్ల అధిక దిగుబడి, ఆదాయం వస్తుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో పలువురు రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ మంచి లాభాలను పొందుతున్నారని, జిల్లా లో విభిన్న పంటలను పండించి అధిక ఆదాయం ఆర్జిస్తున్న రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తిప్పర్తి మండలం,అంతాయ గూడెంలో రైతు కమలాకర్ రెడ్డి సాగు చేస్తున్న అంజీర తోటను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంజీర కు బ్రాండింగ్ చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని, అలాగే మార్కెటింగ్ లో సహాయం చేసే అంశం, స్థానిక స్వయం సహాయక మహిళా సంఘాల సహకారంతో వీలైతే ఒక రైతు ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించి దాని ద్వారా మార్కెటింగ్ కు చర్యలు తీసుకోవాలని,ప్యాకింగ్ హౌస్‌కు ఆర్థిక సహాయం అందించే విషయం పరిశీలించాలని ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతు కమలాకర్ రెడ్డి సుగుణమ్మ దంపతులను శాలువాతో సన్మానించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి అనంత రెడ్డి, తహసీల్దార్ పరశురాం ఉన్నారు.

**సాధారణ ప్రసవాలను పెంచాలి**

తిప్పర్తి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని,సాధారణ ప్రసవాలను పెంచాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అలాగే శిశుమరణాల సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని , ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. తిప్పర్తి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏఎన్ సి రిజిస్టర్, ఓ పి రిజిస్టర్, హై రిస్క్ రిజిస్టర్‌లను పరిశీలించారు. కాగా పి హెచ్‌సిలో శుక్రవారం వరకు 40 ఎఎన్‌సిలు అయినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి ఎం ప్రదీప్ బాబు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆసుపత్రి సేవల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిప్పర్తికి నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాల నిర్మాణానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థలాన్ని పరిశీలించారు.

# దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మితం

### కుడకుడ ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మాతమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ అకస్మికంగా సందర్శించారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అడ్మిషన్ రిజిస్టర్‌లు, హాజర్ రిజిస్టర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మొత్తంలో నూతనంగా విద్యార్థులు చేరేలా చూడాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల నుండి ఐదో తరగతి అయిపోయిన విద్యార్థులను వెంటనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించే విధంగా చూడాలని అదేశించారు. ఇప్పటి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 మంది నూతనంగా అడ్మిషన్ పొందారని ఉపాధ్యాయులు వివరించారు. తదుపరి ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న షేక్ ఉమేజా, షేక్ హైరసభ లకు అక్షరభ్యాసం చేపించి ఆంగ్లంలో ఎబిసిడిలు రాపిచ్చారు. తదుపరి రెండో తరగతిలోని విద్యార్థులకు బుక్స్, యూనిఫాం అందజేశారు. ప్రాథమిక స్థాయి నుండే మంచిగా చదువుకోని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్‌ఎస్ ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ కవిత, ఉపాధ్యాయులు వెంకటనర్సమ్మ, ప్రతాప్‌కుమార్, రాజు, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి , అనురాధ, సత్తయ్య, కోటయ్య, రవీందర్ పాల్గొన్నారు.



## భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి,మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం నల్లగొండ మిషన్ భగీరథ ఎస్‌ఈ నాగేశ్వర్ రావుకు ఎఐటియుసి ఆధ్వర్యంలో మెమోరాండము ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో పెంచాల్సిన వేతనాలు నేటికీ కూడా పెంచకుండా కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తున్నారని అన్నారు. రోజు రోజుకు నిత్యావసర సరుకులు ధరలు పెరుగుతున్న మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు మాత్రం పెరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినిత్యం ప్రజలకు తాగు నీరూ అందించే కార్మికులకు ప్రతినెల వేతనాలు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీస వేతనం చట్టాలు అమలు చేయకుండా మిషన్ భగీరథ కార్మికులను శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల వేతనాలు వెంటనే పెంచి 2024 నుంచి ఏరియర్స్ తో సహా కలిపి చెల్లించాలని కోరారు. ఏజెన్సీలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి వేతనాలు పెంచకపోతే పోరాటం చేయాల్సి వస్తుందని దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కే ఎస్ రెడ్డి, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండీ జానీ, ఏ సైదులు, టీ సత్యనారాయణ,ఎం రామకృష్ణ, ఎస్ మహేష్, రాజు, లింగయ్య పాల్గొన్నారు.

## తల్లీ, శిశువు మృతికి కారకులైన డాక్టర్లపై చర్యలు : ఎల్‌హెచ్‌పిఎస్ డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తల్లీ, శిశువుల మరణానికి కారకులైన డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.ప్రసవం కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీతో పాటు కడుపులో ఉన్న బేబీ మరణించడంతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బంధువులతో కలిసి లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెలివరీ కోసం గుడిపల్లి మండలం కేశినేని తండాకు చెందిన జటావత్ ఝాన్సీ ఈనెల 6 వ తేదీన ఆసుపత్రులో అడ్మిట్ అయిందనీ డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తల్లి, శిశువులు మృతి చెందారని దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం మని ఆరోపించారు. అయితే ఆమెకు ప్రథమ చికిత్సనందిస్తున్న క్రమంలో పురిటినొప్పులు రావడంతో పరిశీలించిన డాక్టర్లు స్కానింగ్ రాసి అనంతరం పరిశీలించగా కడుపులోని పాప చనిపోయిందని నిర్ధారించారనీ మృత శిశువును డాక్టర్లు డెలివరీ చేశారనీ. ఈ క్రమంలో తల్లి పరిస్థితి విషమించడంతో హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారనీ తెలిపారు.గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి కూడా మృతి చెందిందని తల్లి, శిశువుల మృతికి ప్రభుత్వ డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని, వైద్యం వికటించి చనిపోయారని తల్లి శిశువుల మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కరమవుతాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం లోని పెంచికల్ పహాడ్ గ్రామంలో భూ భారతి రెవిన్యూ సదస్సులో పాల్గొని భూభారతి రెవెన్యూ సదస్సు సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ గ్రామసభల పై రైతులు ప్రత్యేకంగా అవగాహన పెంచుకొని వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులను పక్కాగా వినియోగించుకోవాలన్నారు. అధికారులు పహానీలతో రెవెన్యూ సదస్సులకు హాజరయ్యి సమస్యలు పరిష్కార దిశగా రైతులకు అవగాహన పరచడం జరుగుతుందన్నారు. అందుకనుగుణంగా దరఖాస్తులను పూర్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ ద్వారా సహకరిస్తున్నామని అనంతరం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని రైతులకు తెలియజేశారు. భూ భారతి చట్టంలో రైతుల భూముల సమస్యలు తప్పనిసరిగా పరిష్కారం అవుతాయని రైతులకు తెలియజేశారు. దరఖాస్తు చేయడం కోసం వచ్చే వారికి హెల్ప్ డెస్క్ లు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రైతులకు తెలియజేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/యాదాద్రి :** మహిళా శిశు, దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 10.00 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల భువనగిరి ఆవరణలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవ ర్యాలీ జెండా ఊపి ప్రారంబించారు. బాలకార్మిక నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన పోస్టర్స్ , కరపత్రాలను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ బాల కార్మిక చట్టాల గురుంచి , కర్మగారాలు ఫ్యాక్టరీ, హోటల్స్, కిరాణషాపులు, ఇటుకబట్టీలు, కోళ్ల ఫారాలలో 18 సంవత్సరాల లోపు బాలలను పనులలో పెట్టుకున్నట్లయితే యాజమనులపై కేసులు నమోదు అవుతాయని ఒకవేళ పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే 2 సంవత్సరాల జైలు శిక్ష 50 వేల రుపాయాల జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామాలలో, పట్టణాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు జరిపించాలన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు ర్యాలీలో పాల్గొని షాపు యజమానులు బాల కార్మికులను పనిలో పెట్టుకోకూడదని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ నాగిరెడ్డి, డిఐఈఓ రమణీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాపిరెడ్డి, సిడీపిఓ శైలజ, ఏఎల్‌ఓ మోయిజుద్దీన్, జిల్లా బా లల పరిరక్షణ విభాగం, సఖీ విభాగం డిఎల్‌ఎస్‌ఏ సి బ్బం ది, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంధి, స్కోప్ ఎన్జిఓ, అంగన్వాడీ టీచర్లు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# 2026 నాటికి 'టిబి రహిత జిల్లా'గా నల్లగొండ

### క్షయ వ్యాధిని నియంత్రించడంలో స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి



**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :** క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు పెంచాలని స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా టిబి ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025/26 నాటికి జిల్లాలో టి బి లేకుండా చూడాలన్నారు .ఇందులో భాగంగా టిబి పరీక్షలను వేగవంతం చేయడం, గుర్తించిన వారికి సరైన విధంగా చికిత్స అందించడం, గుర్తించిన ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలలోసైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా టి బి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో క్షయ వ్యాధిని నియంత్రించడంలో స్వచ్ఛంద సంస్థలు పూర్తిగా సహకరించాలని కోరారు. టి బి నియంత్రణలో భాగంగాకేంద్ర ప్రభుత్వం టీబి సోకిన వారికి నెలకు వెయ్యి రూపాయలు చొప్పున ఇస్తున్నదని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10 మిలియన్ల మంది క్షయ వ్యాధికి గురవుతున్నారని, భారతదేశంలో 27 నుండి 29 లక్షలు, తెలంగాణలో 60 నుండి 70 వేల మంది, నల్గొండ జిల్లాలో మూడు వేల మంది నమోదవుతుండగా ఈ సంవత్సరం ఇది 2200కు తగ్గిందని తెలిపారు. టి బి సోకిన వారిని త్వరగా గుర్తించడంతో పాటు ,సరైన విధంగా చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, టి బి సోకిన వ్యక్తుల కుటుంబాలకు పరీక్షలు నిర్వహిస్తున్నామని ,డిసెంబర్ 2025 నాటికి పూర్తిగా టి బి ని నిర్మూలించే దిశగా కృషి చేయడం జరుగుతున్నదని, గత నెల 26 నుండి టి బి నివారణ ప్రచారాన్ని తీవ్రతరం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఇందులో భాగంగా 67 శిబిరాలను నిర్వహించి, 13 వేల మందికి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్ ఓ వేణు గోపాల్ రెడ్డి, ఆర్డిఓ వై అశోక్ రెడ్డి, ఇంచార్జి జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాసరావు, వరల్డ్ ఆరోగ్య సంస్థ ప్రతినిధి బ్లేస్సి ఎస్తర్ హాజరయ్యారు.

## విద్య విలువైన సంపద : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్య విలువైన సంపద అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. షాబునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందచేశారు. అదే విధంగా మాజీ కౌన్సిలర్ బంటు లక్ష్మీ నారాయణ సహకారంతో నిర్మిస్తున్న ప్రహరీ గోడ 50మీటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాన్నారు. ఎంఇఒ బాలునాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈనెల 14న లోక్ అదాలత్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 14 న నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయమూర్తి ఎం. నాగరాజు తెలిపారు. జూన్ 9 నుండి 14 వరకు చెక్ బౌన్స్ కేసుల ప్రత్యేక లోక్ అదాలత్ లో సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూవివాదాలు, సైబర్ క్రైమ్ కేసులు ఇతర సివిల్ దావాలు పరిష్కరించుకోవచ్చని సూచించారు.ఈ జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, న్యాయవాదులు, ఇన్సూరెన్సు అధికారులు, రెవిన్యూ, అధికారులు బ్యాంకు అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.ఈ అవకాశాన్ని కక్షిదారులందరు వినియోగించుకొని తమ కేసులను రాజీ చేసుకోగలరని కోరారు.

# క్రీడ



# న్యూజిలాండ్‌తో వైట్‌బాల్ సిరీస్..

## ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్!

ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత పురుషుల జట్టు వచ్చే ఏడాది ఆరంభంలో స్వదేశంలో కీలక సిరీస్‌లు ఆడనుంది. జవనరిలో న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఎనిమిది మ్యాచ్‌ల సిరీస్ కోసం కివీస్ రానున్న నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి వేదికలను ఖరారు చేసింది. శుక్రవారం చూచాయగా 8 స్టేడియాలను బిసిసిఐ ఎంపిక చేసింది. ఇందులో ఉప్పల్ స్టేడియం కూడా ఉండడం హైదరాబాద్‌లోని అభిమానులకు తీపికబురులాంటిదే. న్యూజిలాండ్‌తో భారత జట్టు మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. అన్నీ వైట్‌బాల్ మ్యాచ్‌లే కావడంతో ముందస్తుగానే వేదికలను ఖరారు చేసింది భారత బోర్డు. హైదరాబాద్ జైపూర్, మొహాలీ, ఇండోర్, రాజ్‌కోట్, గువాహటి, త్రివేంద్రం, నాగ్‌పూర్ వేదికగా మ్యాచ్‌లు జరపాలని బిసిసిఐ నిర్ణయించింది. నేడు (జూన్ 14) జరగబోయే బిసిసిఐ సమావేశంలో వేదికలు, మ్యాచ్ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

**రెండు టెస్టుల సిరీస్**

కివీస్‌తో సిరీస్ అనంతరం అక్టోబర్‌లో వెస్టిండీస్, టీమిండియాల మధ్య రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. ఆ వెంటనే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో వైట్ బాల్ సిరీస్ ఉంటుంది. ఈమధ్యే విండీస్, సఫారీ సిరీస్ వేదికలను మార్చిన విషయం తెలిసిందే. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో పిచ్, ఔట్ ఫీల్డ్ మరమ్మతుల నేపథ్యంలో వెస్టిండీస్‌తో టెస్టులను అహ్మదాబాద్, ఢిల్లీలో జరపాలని బీసీసీఐ భావిస్తోంది. ఇక దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులకు ఈడెన్ గార్డెన్స్, గువాహటి వేదిక కానుండగా.. మూడు వన్డేలను రాంచీ, రాయ్‌పూర్, వైజాగ్‌లో నిర్వహించనున్నారు.



## విమాన ప్రమాద మృతులకు టీమ్‌ఇండియా నివాళులు

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరికి టీమ్ ఇండియా ఆటగాళ్లు శుక్రవారం నివాళులు అర్పించారు. భారత జట్టు.. ఇంగ్లాండ్ పర్యటన సందర్భంగా జూన్ 20 నుంచి అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఇందులో భాగంగా శుక్రవారం బెకెన్‌హామ్‌లో ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతోంది. దీనికి ముందు టీమ్‌ఇండియా ఆటగాళ్లు, సహాయక సిబ్బంది.. గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం చేతికి నల్లటి బ్యాండ్‌లు ధరించి మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ మేరకు చిత్రాలను బిసిసిఐ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.

## జాతీయ కియో కరాటే పోటీల్లో తెలంగాణ బాలిక ఆరాధ్యకు కాంస్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉత్తరాఖండ్ రాష్ట్రం డేహ్రాడూన్ లో జరుగుతున్న 4వ జాతీయ కియో కరాటే ఛాంపియన్ షిప్ పోటిల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలిక ఆరాధ్య తాళపత్రి కటా విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నారు. శుక్రవారం జరిగిన పోటీలో ఆరాధ్య వ్యక్తిగత మహిళా క్యాడెట్ లో కాంస్య పతకం గెలుచుకోవడం ద్వారా రాష్ట్రానికి కీర్తిని తెచ్చిపెట్టారు.

కియో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా టిపిసిసి ప్రెసిడెంట్, ఎంఎల్‌సి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వ్యవహరిస్తున్నారు. కరాటే కోచ్ సేన్ నరేష్ సారథ్యంలో ఆరాధ్యజాతీయ స్థాయి కియో కరాటే పోటిల్లో కాంస్య పతకం గెలుచుకున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో దక్షిణ ఆఫ్రికా దర్బన్ లో జరిగిన కామన్వేల్త్ అంతర్జాతీయ కరాటే పోటిల్లో ఆరాధ్య గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు.

# ఫోకస్ సైన్స్




## అవి కిల్లర్ గ్రహశకలాలు!

అంతరిక్షంలో దూసుకెళ్లే గ్రహశకలాల్లో ఎక్కువ శాతం భూమి నుంచి దూరంగా వెళతాయి. కొన్ని భూమిని ఢీకొన్నప్పటికీ, అవి చాలా చిన్నవి కావడంతో, దాదాపుగా పెను ప్రమాదాలేవీ చోటు చేసుకోలేదు. అయితే, శుక్ర గ్రహానికి సమీపంలో ఉన్న గ్రహశకలాల వల్ల భూమికి ఎప్పటికైనా ముప్పు తప్పదని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. సావో పాలో స్టేట్ యూనివర్సిటీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు చేసిన కొత్త అధ్యయనం ప్రకారం, ఒక నగరాన్ని నాశనం చేసే శక్తి ఉన్నందున వీటిని 'సిటీ కిల్లర్' గ్రహశకలాలుగా పిలుస్తున్నారు. ఇవి ఎప్పుడు వస్తాయో... ఎప్పుడు భూమిని ఢీకొంటాయో తెలియదు. వీటి కదలికలను ట్రాక్ చేయడం చాలా కష్టం. కోఆర్బిటల్ ఆస్టరాయిడ్స్ అని కూడా పిలిచే ఈ అతిపెద్ద గ్రహశకలాల సమూహంతో భూమికి సమస్యలు తప్పవని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వాటికి స్థిరమైన గతి మార్గం అంటూ ఏదీ ఉండదు. అందుకే, తరచూ గ్రహాల కక్ష్యలో ప్రయాణించకుండానే గ్రహాల సమీపంలోకి వస్తుంటాయి. కాబట్టి, వాటి రాకను గుర్తించడం చాలా కష్టం. శుక్ర గ్రహం చుట్టూ 20 అతిపెద్ద గ్రహశకలాలు ఉన్నాయి. వీటిలో 'ట్రోజన్' గ్రహశకలాలు కూడా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి ఓ గ్రహం ముందు లేదా వెనుక భాగంలో ఉన్నాయి. సూర్యుడి చుట్టూ ఆ గ్రహం తిరిగే కక్ష్యలో ఆ 'ట్రోజన్' గ్రహశకలాలు కనపడ్డాయి. ఆ 20 అతిపెద్ద గ్రహశకలాల్లో 'ట్రోజన్' గ్రహశకలాలే కాకుండా జూజీ్వగా పిలిచే క్వాసీ మూన్ కూడా ఉంది. క్వాసీమూన్ అంటే నిజమైన చందమామ కాదు. ఈ 20 కిల్లర్ గ్రహశకలాలు మన సౌర వ్యవస్థకు చెందిన అంగారక, బృహస్పతి గ్రహాల మధ్య ఆస్టరాయిడ్ బెల్ట్ నుంచి ఉద్భవించాయి. ఒక్కో గ్రహశకలం 140 మీటర్ల సైజులో (460 అడుగులు) ఉంటుంది.అవి భూమిని తాకితే, ఓ నగరం మొత్తాన్ని నాశనం చేసేస్తాయి. ఆ గ్రహశకాలు ప్రస్తుతం ఉన్న చోటు ఉంటే మనకు ఎలాంటి ప్రమాదమూ ఉండదు. అయితే, వాటికి స్థిరమైన కక్ష్య మార్గం లేదు. దీంతో భూ గురుత్వాకర్షణ శక్తి ఆ గ్రహశకలాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వాటిని.. వాటి ప్రస్తుత కక్ష్య మార్గం నుంచి లాగితే అవి భూమిని ఢీ కొట్టే ముప్పు ఉంది. అవి ఎప్పుడు దూసుకొస్తాయన్న విషయాన్ని కూడా గుర్తించలేం. భారీ విధ్వంసాన్ని, ప్రాణ నష్టాన్ని కలిగించే శక్తి ఉన్నవి కాబట్టే వీటిని కిల్లర్ ఆస్ట్రరాయిడ్స్ అని శాస్త్రవేత్తలు అంటున్నారు.

## సోడియం ఎయిర్ ఫ్యూయల్ సెల్స్‌దే భవిష్యత్తు

సాధారణ బ్యాటరీలతో పోలిస్తే ఎన్నో రెట్లు అధిక లాభాలున్న సోడియం ఎయిర్ ఫ్యూయల్ సెల్స్ భవిష్యత్ మార్కెట్‌ను ఆక్రమిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీని నిర్మాణం, పనితీరు అద్భుతంగా ఉండడమే ఇందుకు కారణం. ఈ ఫ్యూయల్ సెల్‌లో రెండు ఛాంబర్లు ఉంటాయి. ఒకదానిలో ద్రవ సోడియం మెటల్, మరొకదానిలో తేమతో కూడిన గాలి ఉంటుంది. మధ్యలో ఉండే ఘన సెరామిక్ ఎలక్ట్రోలైట్ ద్వారా సోడియం అయాన్లు గాలి ఛాంబర్‌కి వెళ్తాయి. అక్కడ ఆక్సిజన్‌తో రసాయనికంగా ప్రతిస్పందించి విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్రక్రియలో సోడియం ఆక్సైడ్ అనే ఉఉత్పత్తి ఏర్పడుతుంది. ఇది గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను ఆకర్షించి సోడియం బైకార్బొనేట్ (బేకింగ్ సోడా)గా మారుతుంది. దీని ప్రధాన ప్రయోజనాలను పేర్కోవాలంటే, ముందుగా అధిక శక్తి సాంద్రతను ప్రస్తావించుకోవాలి. లిథియంఅయాన్ బ్యాటరీల కంటే 3 రెట్లు ఎక్కువ శక్తి (1000–1700 కిలోవాట్స్) కలిగి ఉంటుంది, కాబట్టి విమానాలు, ఓడలు వంటి భారీ రవాణా కోసం అనుకూలం. సోడియం లభ్యత ఎక్కువగా ఉండడం వల్ల తయారీ ఖర్చు తక్కువ. సాధారణ బ్యాటరీల మాదిరి దీనిని రీఛార్జ్ చేయాల్సిన అవసరం లేదు. కొత్త సోడియం ఫ్యూయల్‌ను నింపితే సరిపోతుంది. దీని వల్ల పర్యావరణ ప్రయోజనం కూడా ఉంది. ఉత్పత్తి అయ్యే సోడియం బైకార్బొనేట్ సముద్రంలో కలిస్తే, ఆమ్లత్వాన్ని తగ్గిస్తుంది. లిథియంఅయాన్ కంటే తక్కువ దీని వల్ల అగ్ని ప్రమాదాలు తక్కువగా సంభవిస్తాయి. ఈ విధంగా, సోడియంఎయిర్ ఫ్యూయల్ సెల్‌లు శక్తి, భద్రత, పర్యావరణ పరిరక్షణలో కొత్త దారిని చూపిస్తున్నాయి. కాగా, సోడియంఎయిర్ ఫ్యూయల్ సెల్‌లు, సాధారణ లిథియమ్‌అయాన్ బ్యాటరీలతో పోల్చితే, పనితీరు కొంత భిన్నంగా ఉంటుంది. సోడియంఎయిర్ ఫ్యూయల్ సెల్‌లు సోడియం మెటల్‌ను, గాలిలోని ఆక్సిజన్‌ను ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. ఇవి ఎక్కువ శక్తి సాంద్రతను కలిగి ఉంటాయి, అంటే తక్కువ బరువుతో ఎక్కువ శక్తిని నిల్వ చేయగలవు.




సోడియం భూమిలో విస్తృతంగా లభిస్తుంది, అందువల్ల సోడియం ఎయిర్ సెల్‌ల తయారీ ఖర్చు తక్కువగా ఉంటుంది. లిథియమ్ అయాన్ బ్యాటరీల్లో ఉపయోగించే లిథియమ్ పరిమితంగా లభిస్తుంది, అందువల్ల వాటి తయారీ ఖర్చు ఎక్కువగా ఉంటుంది. సోడియంఎయిర్ బ్యాటరీలు ఎక్కువ కాలం పనిచేసే సామర్థ్యం కలిగి ఉండే అవకాశం ఉంది, అయితే ప్రస్తుతం వాటి సైకిల్ లైఫ్ పరిమితంగా ఉంది. ఈ బ్యాటరీలు గాలి (ఎయిర్)ను నేరుగా క్యాథోడ్‌గా ఉపయోగిస్తాయి, అందువల్ల వాటి నిర్మాణం లిథియమ్‌అయాన్ బ్యాటరీల కంటే భిన్నంగా ఉంటుంది. సోడియంఎయిర్ ఫ్యూయల్ సెల్‌లు భారీ రవాణా (విమానాలు, ఓడలు) వంటి అప్లికేషన్లకు ఎక్కువగా అనుకూలంగా ఉంటాయి. లిథియమ్‌అయాన్ బ్యాటరీలు చిన్న ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలకు ఎక్కువగా వాడతారు. ఈ విధంగా, సోడియంఎయిర్ ఫ్యూయల్ సెల్‌లు అధిక శక్తి, తక్కువ ఖర్చు, పర్యావరణ అనుకూలత వంటి ప్రత్యేక లక్షణాలతో లిథియమ్‌అయాన్ బ్యాటరీలకంటే భిన్నంగా ఉంటాయి. మొత్తం మీద ఇందులోని ప్రతి భాగం తనదైన విధంగా పనిచేస్తూ, మొత్తం ఫ్యూయల్ సెల్‌ను సమర్థవంతంగా విద్యుత్ ఉత్పత్తికి సహాయపడుతుంది.

## ఎన్నికల హామీలు మరచితిరా?

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాలప్రతినిధి :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసి, ఏ హామీ కూడా అమలు చేయకుండా ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా 4వ మహాసభల కర పత్రాలను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీలలో జరగనున్న సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండ్లు ఎండ్లు గడిచినా, ఆరు గ్యారంటీలు కేవలం వాగ్దానాలుగానే మిగిలిపోయాయని, చేయూత కింద రూ.4,000 పెన్షన్, మహాలక్ష్మి కింద మహిళలకు రూ.2,500, రైతు భరోసా కింద రైతులకు రూ.15,000 సహాయం వంటి హామీలలో ఏదీ అమలులో లేవని తక్షణమే వీటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పుకుంటున్నప్పటికీ పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో లేకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కొరత కారణంగా ప్రజలు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, వరంగల్ నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసంఘటిత రంగ కార్మికుల జీవితం దయనీయంగా మారిందని, ముఖ్యంగా ఓపెన్ కాస్ట్‌లలో పనిచేసే కార్మికులు జీతభత్యాల విషయంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నెల 21, 22 తేదీలలో జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. కార్మికులు, పేదల సమస్యలపై విస్తృత చర్చలకు వేదిక కానున్నాయన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కలిందర్ అలీ ఖాన్, లింగం రవి, ఇప్పకాయల లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, మిరియాల రాజేశ్వరరావు, మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, దొడ్డిపట్ల రవీందర్, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## జులై 5, 6తేదీలలో మహబూబాబాద్ సిపిఐ జిల్లా మహాసభలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** జూలై 5,6 తేదీల్లో కురవి మండల కేంద్రంలో జరిగే సిపిఐ మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభల లోగోను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కురవి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను విస్తరింప చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కరానికి పోరాటాలు, సంక్షేమ ఫలాలు పేదలకు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవడానికి చురుకైన నాయకత్వాన్ని ఎంపిక చేసుకోవడానికి జరిగే మహసభలకు సహకరించాలన్నారు.సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న, కలగూర నాగరాజు, ఇరుగు సుగుణ, నిలుగొండ నాగేశ్వరావు ఉన్నారు.

## కార్మికులను అవమానపరుస్తూ.. ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్న సింగరేణి

### ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో కార్మికులను, గుర్తింపు కార్మిక సంఘాన్ని అవమాన పరుస్తూ సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి గులాంగిరి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణిలో ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పలు డిమాండ్ లను యాజమాన్యం ముందు పెట్టడం జరిగిందని అందులో భాగంగా సింగరేణి కార్మికుల పిల్లలు సింగరేణి లో ఉన్న స్కూల్లో విద్యా సౌకర్యాలు బాగా లేదని, లక్షల రూపాయలు వెచ్చించి హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ నగరాల్లో ప్రైవేటు స్కూల్స్ లో చదివిస్తున్నారని, దీని వల్ల చిన్న పిల్లలు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారని కార్మికులు మా దృష్టికి తీసుకురావడం జరిగిందని, వారి ఆలోచన మేరకు సింగరేణి యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశం లో సిబిఎస్ఇ సిలబస్ ను సింగరేణి లో ప్రవేశ పెట్టాలని ఏఐటియుసి డిమాండ్ చేసిందని ఆయన పేర్కొన్నారు. ఏఐటియుసి చేసిన డిమాండ్ యాజమాన్యం సింగరేణి లో రామగుండం, బెల్లంపల్లి రీజియన్ లలో సిబిఎస్ఇ సిలబస్ ను ప్రవేశపెడుతామని అంగీకరించి, దానికి సంబంధించిన అన్ని అనుమతులు యాజమాన్యం తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. అందులో భాగంగా రామగుండం రీజియన్ పరిధిలోని సెక్టార్ త్రీ లో ఉన్న సింగరేణి స్కూల్ నందు శుక్రవారం సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రారంభించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేసిందని ఆయన అన్నా రు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి యాజమాన్యం ప్రచురించినఆహ్వానపత్రికలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్లు పైన పెట్టారని, వారి కింద చిన్నగా సి అండ్ ఎండి, డైరెక్టర్ల పేర్లు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల పేర్లు ముద్రించి కార్మికుల ను, గుర్తింపు సంఘాన్ని అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్న తీరు యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి గులాం గిరి చేస్తుందని ఆయన ఆరోపించారు. సిబిఎస్ఇ సిలబస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం కు ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు, సింగరేణి సొమ్ము తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అవసరం ఏమిటని ఆయన యాజమాన్యాన్ని ప్రశ్నించారు. సింగరేణి లో ఉన్నతాధికారులు తమ స్వార్థం కోసం, వారి పదవులు కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కు ఊడిగం చేస్తూ సింగరేణి సంస్థ ను నష్టం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, అధికారులు తమ విధానాలను మానుకోవాలని, లేకుంటే కార్మికుల్లో వ్యతిరేకత ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, ఆర్జీ టూ కార్యదర్శి జీగురు రవిందర్, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి బాజిసైదా, నాయకులు రంగు శ్రీను, సిర్ర మల్లికార్జున్, కారంపూడి వెంకన్న, ఆకునూరి శంకరయ్య, సూర్య, దాసరి శ్రీనివాస్, బలుసు రవి, ఎం.ఎ.గౌస్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసేది ఎర్రజెండానే

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిరంతరం ఎర్ర జెండా పోరాడుతుందని కార్మిక కర్షక బలహీన వర్గాలకు ఎర్రజెండా అండగా ఉంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏవిఆర్ ఫంక్షన్ హాల్‌లో సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పార్టీ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులుసిరిపురపువెంకటేశ్వర్లు ఎగరవేశారు. అనంతరం కొండా వీరయ్య, కిలారి ముత్యాలు అధ్యక్షతన జరిగిన గ్రామ శాఖ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. బ్రిటిష్ పాలకుల కబంద హస్తాల్లో మగ్గుతున్న భారతదేశానికి విముక్తి కలిగించేందుకు ఆవిర్భవించిన సిపిఐ నాటి నుండి నేటి వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతోందని, నూరేళ్ళ పార్టీగా జనం గుండెల్లో సిపిఐ మహోన్నత స్థానం సంపాదించుకుందని తెలిపారు. స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న సిపిఐని మొగ్గలోనే తుంచి వేయాలని అనేక కుట్రలు పన్నినా ప్రజాబలంతో కుట్రలను ఎదురించి నాటి నుండి నేటి వరకు అజేయంగా నిలిచిందని అన్నారు.అనంతరం సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎర్ర జెండా పోరాడుతుందని పేద ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లల్లో రాజకీయ జోక్యం లేకుండా నిరుపేదలకు గుర్తించిసంక్షేమ పథకాలు అందజేయాలని కోరా రు. స్థానిక సంస్థల ఎన్నికలలో బలమైన స్థానాల్లో గెలుపు పొందాలని కోరారు. అనంతరం జూలూరుపాడు వెంగన్న పాలెం నూతన గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాగుల్ మీరా, సిపిఐ నాయకులు ఎల్లంకి మధు, ఎస్‌కే చాంద్ పాషా, గుండె పిన్ని మధుసూదన్‌రావు,చెరుకుమల రాజేశ్వరరావు, కంచర్ల రాఘవేంద్రరావు, అనుమల అశోక్, తాత నరసింహారావు,ఎల్లంకిశ్రీను, తాళ్లూరి లక్ష్మయ్య, ఎలబాక రాంబాబు, కత్తి గోపి, బదుగు వీరస్వామి, బరగడ రమేష్, ఎస్‌కే బొలె మియా, దేవినేని రాము, పత్తిపాటి మహేష్, పసుపులేటి పవన్, ఇంజము శ్రీను, ఎస్‌కే మీరా వాలీ, కొండా హనుమంతరావు,బర్ల ప్రేమమ్మ, సిలం సావిత్రి, కల్లోజి రజిని, చల్లగుండ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వానాకాలం రైతు భరోసా ఎప్పుడిస్తారు?



**ప్రజాపక్షం/కొణిజర్ల :** వానాకాలం రైతుభరోసా నిధులు వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిదిలోని అంజనాపురంలో సిపిఐ గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో రైతుభరోసా కింద ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని తరువాత మాట మార్చి రూ 12 వేలు చేసిందని, అవి కూడా 2024లో ఒక దఫా పూర్తిగా అన్నారని, అవికూడా నాలుగు ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇచ్చిందన్నారు. ఈ సంవత్సరం అయినా పరిమితిలేకుండా పంటలు వేసే ప్రతిరైతుకు పెట్టుబడి సాయం కింద నిధులు అందించాలన్నారు.అనంతరం అంజనాపురం గ్రామశాఖ కార్యదర్శిగా బాణోత్ రమేష్, సహాయ కార్యదర్శిగా నల్లమోతు శ్రీను, గుబ్బగుర్తి కార్యదర్శిగా దొబ్బనబోయిన వెంకటనర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బండారు వెంకన్న, మద్దిన్ని కోటేశ్వరరావు, చల్లగుండ్ల మురళి, నల్లమోతు పిచ్చయ్య, దొబ్బనబోయిన శేషయ్య, స్వచ్ఛ శ్రీనివాసరావు, రామనబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


## 17న కార్మిక హక్కుల ధర్నా



### ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

### 11 ఏళ్లుగా కార్మిక హక్కులను కేంద్ర బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శ

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** రాష్ట్ర ఎఐటియుసి పిలుపు మేరకు ఈ నెల 17న హైదరాబాదులో జరగబోయే భారీ ధర్నాలో అన్ని రంగాల భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పిలుపునిచ్చారు. వేములవాడలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు.44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం 4 కార్మిక కోడ్‌లుగా మారుస్తూ కార్మికుల సంక్షేమానికి నష్టకరమైన విధానాలను అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డ్ ద్వారా, లేబర్ కార్డులు మరియు 1% సెస్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించిన విషయం గుర్తు చేశారు. అయితే ఇటీవలి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ బోర్డ్ నిధులను ఎల్ఐసి వంటి ప్రైవేట్ రంగాలకు అప్పగిస్తూ, కార్మికుల హక్కులను హరిస్తున్నాయన్నారు. ఈ విధానాలను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల పోశెట్టి, కుమ్మరి కొమురయ్య, కోరేపు శ్రీను, ఎల్ల దేవరాజు, ఎల్ల స్వామి, దప్పు శ్రీను, పరెపెల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## మంత్రి వివేక్‌ను కలిసిన నారేగూడ గ్రామస్తులు



ప్రజాపక్షం/నవాబుపేట : మైనింగ్, కార్మిక శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం నారేగూడ గ్రామస్తులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి మాజీ సర్పంచ్ పర్మయ్య, గ్రామస్తులు కిష్టయ్య, వెంకట్, దేవ్ కుమార్, శివకుమార్, ఈశ్వర్, భీమ్ రావు పుష్పగుచ్చాలు అందించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాల సామాజిక వర్గానికి చెందిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి దక్కడం ఆనందంగా ఉందన్నారు. మాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నారేగూడ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## యువత క్రీడలపై దృష్టి సారించాలి



కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/ నిజాంపేట్ : యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లో ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 3లో నివాసముండే దస్తగిరి, కవితల కుమారుడు కృష్ణ కిషోర్ బాక్సింగ్ నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గెలుపొంది బంగారు పతకాన్ని సాధించిన సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి కిషోర్‌ని అబినందించారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద క్రీడాకారులకు తనవంతు సహాయ, సహకారాలను ఎల్లప్పుడు అందిస్తానని అన్నారు. ఇదేవిధంగా బాక్సింగ్‌లో మరింతగా ముందుకు వెళ్లాలని సూచించారు. క్రీడల పట్ల విద్యార్థులు, యువత ప్రత్యేక శ్రద్ధ వహించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని అన్నారు.

## ఉప్పల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




ప్రజాపక్షం/చర్లపల్లి : డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ, విఎన్‌రెడ్డి నగర్ కాలనీ, సాయికృష్ణ ఎన్‌క్లేవ్, శివసాయి నగర్, న్యూవాసవి శివ నగర్,వైష్ణవి ఎన్‌క్లేవ్, సోనియా గాంధీ నగర్ కాలనీ, డిసి కాలనీ, చర్లపల్లి, బిఎన్ రెడ్డి కాలనీలో ఎంఎల్‌ఎ మంజూరు చేసిన పలు అభివృద్ధి పనులను అధికారులతో కలసి వాటర్ వర్క్స్, డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

## నాగారంలో 100 రోజుల ప్రణాళిక



ప్రజాపక్షం/నాగారం : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్ హాలులో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ పోషక ఆహార సంస్థ ఆధ్వర్యంలో రోజువారి పోషక ఆహార విలువలు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వారు తయారు చేసిన ఉత్పత్తులను మేళలో ప్రదర్శించారు. రాబోయే వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాంపల్లిలోని 3వ వార్డు డిఆర్‌ఎస్ ఎన్‌క్లేవ్‌లో నాలా క్లీనింగ్ చేశారు. రాంపల్లి వార్డు కార్యాలయంలో సిబ్బందికి హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎస్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ సురేష్‌రెడ్డి, జాతీయ పోషక ఆహార సంస్థ ప్రతినిధి ఋషికేష్, మెప్మా ఎడిఎంసి నరసింహ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో ఎమార్వో తనిఖీ



పాత స్టాక్‌ను వెంటనే గోదాంలకు పంపిణీ చేయాలి

ప్రజాపక్షం/నవాబుపేట : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గల రేషన్ షాపులను తహసీల్దార్ బుచ్చయ్య తనిఖీలు చేశారు. యావాపూర్, నవాబుపేట, పుల్లమామిడి, లింగంపల్లి గ్రామాల్లో గల రేషన్ షాపులను తనిఖీలు చేసిన అనంతరం మాదిరెడ్డిపల్లి రేషన్ షాపును కూడా శుక్రవారం తనిఖీ చేశారు. షాపుల్లో గల పాత స్టాక్‌ను గోదాములకు తిరిగి పంపియాలని మండల పరిధిలోగల రేషన్ డీలర్లకు తహసీల్దార్ బుచ్చయ్య మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మూడు నెలల రేషన్‌ను కలిపి ఒకేసారి ఇవ్వడంతో ఏమైనా చిన్న చిన్న సమస్యలు వస్తే రేషన్ డీలర్లు సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. ఏమైనా అవకాతవకలు జరిగినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

## ఒక మార్పు అభివృద్ధికి మలుపు




ప్రజాపక్షం/దుండిగల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ గండి మైసమ్మ చౌరస్తా వద్ద కళా జాతర ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారుల బృందం, తడి చెత్త పొడి చెత్త పైన అవగాహన కార్యక్రమం, పాటల రూపంలో వినిపించినారు, అదేవిధంగా ప్లాస్టిక్ బ్యాన్, పరిసరాల పరిశుభ్రత మొదలగు వాటిపైన పాటల రూపంలో కళాకారులు అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి.సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు మెప్మా మహిళ గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధుల చొరవతోనే.. స్వచ్ఛ భారత్ సాధ్యం

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారతదేశం ప్రజాస్వామిక దేశమని, ప్రజల ద్వారా ఎన్నుకున్న నాయకులకే భారత రాజ్యాంగం పట్టం కట్టిందని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధులు చురుగ్గా పాల్గొన్నప్పుడు అభివృద్ధి బాగా జరుగుతుందని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. 543 మంది పార్లమెంట్ సభ్యులు, 4123 మంది ఎమ్మెల్యేలు, సుమారు రెండున్నర లక్షల మంది గ్రామ సర్పంచులు కాకుండా జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్స్, కౌన్సిల్ సభ్యులు, వార్డు సభ్యులు దేశం మొత్తంలో వేలల్లో ఉంటారని, వీరందరి ప్రధాన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ప్రజలకు అందేలాగా కృషి చేయడమన్నారు. స్వచ్ఛ భారత్ ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌పై టౌన్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు ఇచ్చే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ రామేశ్వర్ రావు శుక్రవారం ఎస్కీలో ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా రామ్ దుర్గ్ టౌన్ మున్సిపల్ సభ్యులు 36 మంది పాల్గొన్న ఈ సమావేశంలో రామేశ్వర్ రావు మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంటే ఘన వ్యర్థాల నిర్వహణ అని, జనాభా పెరుగుతున్నపుడు, పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. మనిషి అవసరాలు కూడా పెరిగిపోయి, ఘన వ్యర్థాలు అధిక మొత్తంలో ఉత్పత్తి జరిగి పట్టణాన్ని నాశనం చేస్తాయన్నారు. ఘన వ్యర్థాలను సేకరించడం, శుద్ధి చేయడం, పారవేయడం అనే ప్రక్రియను మునిసిపల్ కౌన్సిల్ సభ్యులుగా చేపట్టాల్సిన బాధ్యత కౌన్సిల్ సభ్యులపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఘన వ్యర్థాలను తగ్గించడం, తిరస్కరించడం, తిరిగి వాడే విధానం, తిరిగి ప్రయోజనం పొందడం తదితరమైనవి అవలంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో స్వచ్ఛ భారత మిషన్ ఎక్సపర్ట్ ఎస్.ఎ ఖాదర్ సాహెబ్ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ పాలసీ, ఆచరణపై మాట్లాడితే, మాగంటి జె.ముత్తుకుమార స్వామి వివిధ సంఘ సభ్యుల ద్వారా గ్రౌండ్ లెవెల్ నుండి స్వచ్ఛ భారత్ మిషన్ ఆచరణ, నిర్వహణపై మాట్లాడారు. రియల్ టైం మానిటరింగ్, అక్యురేట్ డేటా కలెక్షన్, స్ట్రీమ్ లైన్ ఆపరేషన్స్ ద్వారా స్వచ్ఛ భారత్‌ను సాధించవచ్చని శివ సుబ్బారాయుడు కస్తూరి మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా రామ్ దుర్గ్ టౌన్ మునిసిపల్ కౌన్సిల్ సిబ్బంది శనివారం సూర్యాపేట మున్సిపాలిటీని సందర్శించనున్నారు. ఈ సమావేశంలో ఎస్కీ పర్యావరణ విభాగం హెడ్ అనితా అగర్వాల్, ప్రోగ్రాం మేనేజర్ జి.నాగ మల్లేశ్వర రావు, అసిస్టెంట్ మేనేజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

## భూ సమస్యలు రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : భూ సమస్యలను సాధ్యమైనంతవరకు రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నెపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా సందర్శించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నయని వీటిని సద్వినియోగం చేసుకోవిఆలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాలను దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా, వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని సంబంధిత రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయలని తెలిపారు. రిజిస్టర్లను పరిశిలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ పక్కాగా రికార్డులను పొందపర్చాలని అన్నారు. సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యహరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. దరఖాస్తులను క్షుణంగా పరిశీలిస్తూ ,పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఆర్ఐ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

వైకల్యం కలిగిన వారిని గుర్తించి శస్త్ర చికిత్సలు చేయించినట్లుయితే గౌరవప్రదనమే జీవితాన్ని ఇచ్చిన వారమవుతమని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న అంబేద్కర్ భవనంలో ఆకర్ ఆశ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యలో వికారాబాద్ ,పూడూర్ మండలాలకు చెందిన వైద్య అధికారులు, ఐసిడిఎస్ ,సిడిపివోలు ,సూపర్వైజర్లు ,ఎఎన్ఎం ,ఆశవర్కర్లకు ముందస్తు వైకల్యం పరీక్షలు నిర్వహించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో పుట్టుకతోనే కాకుండా ఇతరత్రా కారణాల వల్ల వైకల్యం పొందిన వారిని గుర్తించి శస్త్ర చికత్సలు చేయించడానికి ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. వైకల్యం కలిగిన వారిని గుర్తించి ఉచిత శస్త్ర చికిత్స చేయించడం మనం అందరం అదృష్టంగా భావించాలని కలెక్టర్ తెలిపారు. శస్త్ర చికిత్సల సందర్భంగా ఉచిత భోజన, రవాణా సౌకర్యం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చికిత్సలు చేసేందుకు వీలుగా గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా వివిధ శాఖలకు సంబంధించిన ,సిబ్బంది సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ తెలిపారు. వైకల్యం ఉన్నవారికి శస్త్ర చికిత్సలతో పాటు ప్లాస్టిక్ సర్జరీలు కూడా ఉచితంగా చేయడానికి ముందుగా వచ్చిన ఆకర్ ఆశ చారిటబుల్ ట్రస్ట్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటమణ, డిప్యూటీ డిఎంహెచ్ఓ ప్రవీణ్ ,వైద్యఅధికారి శాలిని నిఖిల్, మహమ్మద్, సౌమ్య కృప దేవికలు పాల్గొన్నారు.

## కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మనుచౌదరి

కొత్త కలెక్టర్‌కు స్వాగతం, పూర్వ కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మేడ్చల్ జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన మిక్కిలినేని మనుచౌదరి శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయనకు కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు వేదోచ్చరణ మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారిణి, హరిప్రియ, జిల్లా స్థాయి పలు ప్రభుత్వ శాఖాధికారులు ఎమ్మార్వోలు పుష్పగుచ్చాలు అందచేసి స్వాగతించారు. మేడ్చల్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు జి.వినోద్‌కుమార్, కార్యదర్శి కె.కురుమూర్తి, సహ అధ్యక్షులు కె.వెంకటేశం, ఉపాధ్యక్షులు రవీందర్, ఎం. రఘునందన్‌గౌడ్, ఎం.కృష్ణ, ఝాన్సిరాణి, జె. విజయకుమారి, సంయుక్త కార్యదర్శి ఆర్ఎంవి ఆనందరావు, కోశాధికారి డి.కరుణాకర్‌రావు, కార్యాలయ కార్యదర్శి సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులు ఎం.తిరుపతిలు కలిసి పూలమాలందించటం ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

**ఘనంగా గౌతంకు వీడ్కోలు**

సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా బదిలీ అయిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పొట్రుకు జిల్లా రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. 2023 అక్టోబర్ 13న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి 20 నెలల పాటు విధులు నిర్వహించిన ఆయన లోక్‌సభ, శాసన సభా ఎన్నికలను సమర్థరంతంగా జరిపించారు. అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, డిఆర్‌ఓ హరిప్రియ, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, పలువురు తహసీల్దార్లు, వివిధ శాఖాధికారులు, సిబ్బంది పూల బొకేలు, శాలువాలు, పూల మొక్కలతో వీడ్కోలు పలికారు.

## సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని ప్రవేశాలు సద్వినియోగం

ఎమ్మెల్యే కెపి వివేకానంద



ప్రజాపక్షం/నిజాంపేట్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలను నిరుపేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద సూచించారు. కుత్బుల్లాపూర్ గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట కళాశాలలో 2025–26 సంవత్సరానికి గాను ప్రవేశాలకు సంబంధించిన కరపత్రం, గోడపత్రికను ఎమ్మెల్యే కెపి వివేక్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ మహిళలు ఉన్నత విద్యలో దూసుకుపోయినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళా విద్యతో ఆ కుటుంబమే కాకుండా ప్రాంతం, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నిరుపేద కుటుంబాలకు చెందిన బడుగు, బలహీన వర్గాల మహిళలు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత చదువులతో మహిళలు బంగారు భవిష్యత్తును రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మాట్లాడుతూ కళాశాలలో బిఎస్సీ, (బిజెడ్, ఎంజెడ్సీ, ఎంఎస్‌డిఎస్, ఎంఎస్‌సిఎస్, ఏఐఎంఎల్), బికాం, (కంప్యూటర్స్, బిఏ) కోర్సులలో సీట్లు కలవని, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 23వ తేదీలోపు అభ్యర్థులు పదవ తరగతి మెమో, ఇంటర్ మెమో, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఇంటర్ టీసి, ఎనిమిది పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ డిగ్రీ కళాశాల శామీర్‌పేటలోని సిద్ధిపేట ప్రధాన రహదారిలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఉంటుందని, మరింత సమాచారం కోసం 9640373202, 8309042565, 966676726, 6301211683 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చేతన్, అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ




ప్రజాపక్షం/కుల్కచర్ల : పరిగి నియోజకవర్గంలోని కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం వికారాబాద్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ గ్రామాలల్లోని ప్రధాన చౌరస్తాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. దొంగతనాలు నియంత్రణల్లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోసిస్తాయని పేర్కొన్నారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం రవాణా అరికట్టాలని ఆదేశించారు. రోడ్డు భద్రత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో డీఎస్‌పి శ్రీనివాస్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ప్రణీత్ నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా పేర్ల ప్రణీత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి గురువారం నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రణీత్ మాట్లాడుతూ తనను గుర్తించి, కీలకమైన పదవి బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల పక్షాన నిలుస్తూ వారి సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేస్తానని ప్రణీత్ తెలిపారు. ప్రణీత్ నియామకం పట్ల పలువురు ఐఎన్‌టియుసి కార్మిక సంఘాల నేతలతో పాటు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైలు అదాలత్

ప్రజాపక్షం/చర్లపల్లి : కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఉపయోగపడుతాయని మేడ్చల్ మల్కాజ్‌గిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రవీందర్ అన్నారు. శుక్రవారం చర్లపల్లి కేంద్రకారాగారంలో జైల్ అదాలత్‌ను నిర్వహించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని గౌరవ న్యాయస్థానంలో ఉన్న 35 కేసులను పరిష్కరించి 27 మంది ఖైదీలకు విముక్తి కల్గించారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఎన్.శివకుమార్ గౌడ్, ఉప పర్యవేక్షణాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో గౌతంనగర్ ఆర్‌యుబి నిర్మాణ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/మల్కాజిగిరి : త్వరలో గౌతంనగర్ ఆర్‌యుబి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రవిప్రకాష్, సతీష్‌బాబులు తెలిపారు. దీని కోసం గౌతంనగర్ రైల్వే గేట్ సమీపంలో ఆర్‌యుబి పనులకు గాను ఎంపిక చేసిన స్థలాన్ని శుక్రవారం విద్యుత్ విభాగ ఏడిఇ చంద్రశేఖర్, జలమండలి ఏఈ నవీన్,జిహెచ్‌ఎంసి ఏఈ దివ్యజ్యోతిలు పరిశీలించగా వారి వెంట స్థానిక నేతలు మేకల రాము యాదవ్, బైరు అనిల్, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : రానున్న రోజుల్లో మేడ్చల్ జిల్లాలో కురవనున్న భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ అంటు వ్యాధులు సోకకుండా సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవటంలో ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమాగౌరి సూచించారు. శుక్రవారం తమ కార్యాలయంలో మున్సిపల్, పంచాయతి, గ్రామీణ, సంక్షేమ శాఖాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో సీజనల్, వెక్టర్ బోర్న వ్యాధులు జిల్లాలో ఎక్కువగా నమోదవుతున్నాయ, ప్రజల కాపాడటంలో సమర్థవంతంగా పని చేస్తేనే నివారణ సాధ్యమవుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శుభ్రత, డ్రైనేజి, తాగు నీటి సరఫరా తదితర అంశాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తూ సకాలంలో కార్యాచరణ చేపట్టాలన్నారు.. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం డాక్టర్ శ్రీదేవి వర్షాకాల వ్యాధుల నివారణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటి జిల్లా డిఎంహెచ్ఓ డా.శోభ,సత్యవతి,జిల్లా ప్రోగ్రాం అధికారులు డా.చంద్రకళ,కౌశిక్, డా.వినోద్ తదితరల అధికారులు పాల్గొన్నారు.

## రైతాంగానికి వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందించాలి

ప్రజాపక్షం/కొడంగల్ : రైతాంగానికి అవసరమైన వ్యవసాయ యంత్రాలను, విత్తనాలను సబ్సిడిపై ప్రభుత్వం అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే ప్రారంభమైన వ్యవసాయ పనుల సీజన్ నేపథ్యంలో రైతాంగమంతా ఎంతో ఆశతో వ్యవసాయ పనులు ప్రారంభించారన్నారు. రైతులకు అవసరం అయ్యే విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాకపోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారస్థుల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో మాదిరిగానే కల్తీ విత్తనాలతో నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీతో రైతులకు సరిపడ విత్తనాలు ఎరువులు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు డాక్టర్ స్వామి నాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం పెంచాలన్నారు. రైతులందరికి పంట భీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలని కోరారు. వ్యవసాయ యంత్రీకరణ పథకం ఎప్పుడు అమలు అవుతుందోనని రైతులు ఎదురుచూపులు చూస్తున్నారని పాలకుల నిర్లక్ష్యంతో ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయన్నారు. ఒక్కో వ్యవసాయ పరికరాన్ని బయట కొనుగోలు చేయాలంటే రైతులకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతోందని ప్రభుత్వం సబ్సిడీ యంత్రాలను రైతులకు అందించాలని కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు




ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రజాపక్షం/పూడూర్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పూడూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో 360 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి అతి తక్కువ ధరకే స్టీల్ ,సిమెంట్, అందించే విధంగా కంపెనీలతో మాట్లాడతాం అని తెలిపారు. నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూడూర్ మండల అధ్యక్షులు సురేందర్ ముదిరాజు, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంలో భాగంగా శుక్రవారం తుర్కయాంజల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన లభించింది. రెవిన్యూ సదస్సుకు అర్జీ దారులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్టు మండల తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అర్జీ దారుల దరఖాస్తులను పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. చిన్న, చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, జఠిలమైన సమస్యలను కంప్యూటర్ లో నమోదు చేసుకొని, క్షేత్ర పరిశీలన చేసి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

## అహ్మదాబాద్ విమానం ఘటన మృతులకు సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి సిపిఐ తరపున పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శుక్రవారం స్థానకంగా వారు మాట్లాడుతూ ఎయిర్ ఇండియా విమానం మెడికల్ కళాశాల హాస్టల్ భవనంపై కూలడంతో విమానంలో ఉన్న వారు, మెడికల్ విద్యార్థులు దుర్మరణం చెందడం బాధకరమన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మాజీ వైస్ ఎంపిపి మౌనిక హరికృష్ణ గౌడ్, మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, బాబురావు, జెకె నర్సింలు, జనార్ధన్ గౌడ్, వెంకటేష్, మాజీ ఉప సర్పంచులు నర్సింలుగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, నేతలు రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, దర్గా రామచంద్రయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండి

### జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ లచ్చిరెడ్డి వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శుక్రవారం వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీల్లో అభివృద్ధి పనుల ప్రారంభానికి నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌కు కోరినట్లు లచ్చిరెడ్డి తెలిపారు.

## ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధి

### కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్‌ను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఈస్ట్ హస్తినాపురం, వీడియో కాలనీలో నూతన సీసీ రోడ్లను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు భూపతిరెడ్డి, కటకం వెంకటేష్, రవీందర్‌రెడ్డి, రఘువంశీ, హరినాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సునంద, కాలనీ వాసులు నిరంజన్, హరేందర్‌రెడ్డి, సాయి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించడంతోపాటు ఉచితంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందని, అన్ని మౌళిక సౌకర్యాలతో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రతి విద్యార్థిని సర్కారు బడుల్లోనే చేర్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని, ప్రైవేట్‌లో చేర్పించి అప్పుల పాలు కావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపిడిఒ కిష్టయ్య, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు విద్యావతి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు సీతారామ్, అపర్ణ, స్వప్న, లోకేశ్వరీ, మాజీ సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అనసూయ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దివ్యసింగ్, పంచాయతీ కార్యదర్శి విద్యావతి పాల్గొన్నారు.

## మంత్రి శ్రీహరిని సన్మానించిన మాజీఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ముదిరాజుల ముద్దిబిడ్డగా పేరుగాంచిన వాకిటి శ్రీహరికి సామాజిక న్యాయం దక్కిందని వివరించారు. కార్యక్రమంలో కొత్తూరు మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, వ్యక్తిగత పిఎ శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరా పునరుద్ధరణ

### చింతల్‌బస్తీలో హైడ్రా కూల్చివేతల్లో ధ్వంసమైన తాగునీటి పైప్‌లైన్

### యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిన జలమండలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే మరమ్మతులు పూర్తిచేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. చింతల్ బస్తీ వద్ద ధ్వంసమైన 300 ఎంఎం డయా మెయిన్ పైప్‌లైన్ అత్యవసర మరమ్మతుల పనులను జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. కొత్తగా నిర్మించిన పైప్‌లైన్‌ను బలోపేతం చేయడానికి సరైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం హైడ్రా నాలా ఆక్రమణ తొలగింపు సమయంలో బంజారా హిల్స్ సంప్ ఔట్‌లెట్ నుండి మాసబ్ ట్యాంక్, ఏసి గార్డ్స్‌కు తాగునీటిని సరఫరా చేసే 300 ఎంఎం డయా పైప్‌లైన్ దెబ్బతింది. వెంటనే స్పందించిన జలమండలి అధికారులు, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు పనులు వేగంగా పూర్తి చేశారు. తర్వాత నీటి సరఫరాను పునరుద్ధరించారు. నీటి సరఫరా యథావిధిగా ప్రారంభించారు. అంతకు ముందు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచిత ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు.

## 'కురుమ సంఘానికి యెగ్గె మల్లేశం రాజీనామా చేయాలి'

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కురుమ సంఘం పేరిట అక్రమాలకు పాల్పడుతున్న యెగ్గె మల్లేశం సంఘం పదవికి రాజీనామా చేయాలని కురుమ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఉపాధ్యక్షులు కోశికె శ్రీనివాస్, సీనియర్ నేతలు దేవరాజు శ్రీనివాస్, దొడ్డి శ్రీనాథ్, వంశీ జక్కుల మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఆయన అవినీతిపై హైకోర్టును ఆశ్రయించామన్నారు. ఏకపక్షంగా కొన్నేండ్లుగా సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్న మల్లేశం కురుమ సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ అనేక ఆస్తులు కూడబెట్టుకొన్నారని ఆరోపించారు. సంఘానికి విరాళాల రూపంలో వచ్చిన లక్షల నగదును కాజేస్తున్నారని ఆరోపించారు. కుల సంఘం అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సంఘం సీనియర్ నేతలు చిల్లంపల్లి సురేశ్, రాకేశ్, బిడ్ల శ్రీనివాస్, రామ్ గోపాల్, దేవరాజు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## ఫార్మా ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఫార్మా కంపెనీల ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఆర్గో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నఖీ అబ్బాస్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థ ప్రతినిధులు వనితా కట్టర్, రాఘవ గూడూరు, కల్యాణ చక్రవర్తితో కలిసి శిక్షణ తరగతులకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ రంగంలో సరైన శిక్షణ లేకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు తమ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. టీహబ్‌లో శనివారం నుంచి 21 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

### కాంగ్రెస్ జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి నైతిక బాధ్యత వహించి విమానయానశాఖమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ జిహెచ్‌ఎంసి పక్షనేత దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విమాన ప్రమాదం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. కేంద్ర మంత్రి బాధ్యత తీసుకొని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన విమానంపై రెండు సార్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సాంకేతిక లోపమున్న విమానం నడపడానికి అనుమతి ఇచ్చిన ఆఫీసర్ ఎవరని, గతంలో ప్రమాదాలు జరిగితే కాంగ్రెస్ మంత్రులు బాధ్యత వహించి రాజీనామా చేశారన్నారు.

# లాటరీ ద్వారా 25 బార్‌ల ఎంపిక

### జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ప్రొహిబిషన్, అబ్కారి శాఖ కమిషనర్ హరికిరణ్




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/గండిపేట్:** జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ అబ్కారి శాఖ బార్ షాపుల ఎంపిక ప్రక్రియ 25 బార్ షాపుల కేటాయింపులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తెలిపారు. జూన్ 13న తెలంగాణ ఎక్సైజ్ (గ్రాంట్ ఆఫ్ లైసెన్స్ ఆఫ్ సెల్లింగ్ బై బార్ అండ్ కండిషన్స్ ఆఫ్ లైసెన్స్) రూల్స్ 2005 ప్రకారం నాన్‌ఎస్టాబ్లిషెడ్ అయినటువంటి జల్పల్లి మున్సిపాలిటీ పరిదిలో (01) 2బి బార్ కొరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత డ్రా తీయడం జరిగినది. డ్రా లో సరూర్‌నగర్ మండలం శ్రీనివాసపురం కాలనీ చెందిన అంతటి వికాస్‌గౌడ్ టోకెన్ నెంబర్ : 029) ఎంపికయ్యారు. అదేవిధంగా జిహెచ్‌ఎంసి పరిధిలో 24 బార్లకు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ద అడ్రస్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ అబ్కారి శాఖ కమిషనర్ సి.హరికిరణ్ డ్రాను నిర్వహించారు. డ్రా నిర్వహించే ముందు అహ్మదాబాద్ ఎయిర్‌ఫోర్ట్ ప్రమాద మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. 24 బార్ల ప్రక్రియ పూర్తిగా పారదర్శంగా జరిగింది. బార్ల దరఖాస్తు దారుల సమక్షంలో డ్రా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఆయన అన్నారు. కార్యక్రమానికి సహకరించిన దరఖాస్తుదారులకు, ఎక్సైజ్ అధికారులందరికీ ధన్యవాదాలు,డ్రాలో గెలుపొందిన లబ్ధిదారులకు కమిషనర్ హరి కిరణ్ అభినందనలు తెలిపారు.నార్సింగి ప్రాంతంలో ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో జిహెచ్‌ఎంసి పరిధిలోని 24 బార్లకు 3,525 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల సమక్షంలో కమిషనర్ డ్రా తీశారు. డ్రా బాక్స్ లోని కమిషనర్ కాయిన్స్ తీసి ఇవ్వగా జాయింట్ కమిషనర్ హెడ్ క్వార్టర్స్ కెఎబి శాస్త్ర నెంబర్ దరఖాస్తుదారుల సమక్షంలో వెల్లడించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్లు పి.దశరథ్,కెఎబి శాస్త్ర,అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, అనిల్ కుమార్ రెడ్డి లతోపాటు హైదరాబాద్ రంగారెడ్డిలోని అన్ని డివిజన్ లకు చెందిన అధికారులను పేరుపేరునా కమిషనర్ అభినందనలు తెలిపారు. బాక్సులో కాయిన్స్ తిసి నటువంటి జీవన్ కిరణాన్ని కూడా కమిషనర్ అభినందించారు. జిహెచ్‌ఎంసితోపాటు మిగిలిన నిజామాబాద్ మహబూబ్నగర్ జాల్ పల్లి ప్రాంతాల్లో కూడా ప్రశాంతంగా జరిగిందని కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

# 16న సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 16న ప్రారంభించనున్న రైతు భరోసా, రైతు వేదికల ప్రారంభ కార్యక్రమాన్ని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వ్యవసాయ, ఉద్యానవన, ఆర్డీవోలు, మండల స్థాయి అధికారులతో రైతు భరోసా, రైతు వేదికలు ప్రారంభ కార్యక్రమంపై కలెక్టర్ నారాయణరెడ్డి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లాలో 23 రైతు వేదికలు ఉండగా సోమవారం 16న రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని రైతు భరోసా, మిగతా 35 రైతు వేదికలను కూడా లాంఛనంగా ప్రారంభిస్తారని దానికి సంబంధించి ఆయా డివిజన్ రెవెన్యూ అధికారులు ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. తమ మండల పరిధిలోని ప్రజాప్రతినిధులను మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు స్థానిక నాయకులను పాల్గొనే విధంగా ఆహ్వానించాలన్నారు. గ్రామపంచాయతీ సెక్రటరీలు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు,ఇతర అధికారులు సమన్వయంతో పని చేసి వీడియో ఆడియోను ఏర్పాటు చేసినట్లయితే ముఖ్యమంత్రి ఆయా మండలాల రైతులతో మాట్లాడే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు రైతువేదికలను అందంగా అలంకరణ చేస్తూ, షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల నుండి రైతులు వచ్చేందుకు తగిన ఏర్పాట్లు మండల వ్యవసాయ అధికారులు ముందే ప్రణాళికను సిద్ధం చేయాలని ఆ మండలాల్లో అందరూ రైతులు వేదికల వద్దకు వచ్చేటట్లు మండల ప్రత్యేక అధికారులు శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. రైతులు రైతు వేదిక నుండి వ్యవసాయ నిపుణులతో ఏ పంటలు వేసుకోవాలో తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు.. అనంతరం గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంపై మాట్లాడుతూ శనివారం హెచ్ఐటిఇలో జరుగుతున్నందున జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ అధికారి,ఆర్డీఓలు, ఎంపిడిఓలు,ఆయా వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే కామినేని హాస్పిటల్స్ రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఈనెల 14న వరల్డ్ బ్లడ్ డోనర్ డే సందర్భంగా తలసిమియా బాధిత పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కామినేని హాస్పిటల్స్ పిడియాట్రిక్ విభాగం హెడ్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నరసింహారావు, బ్లడ్ సెంటర్ హెడ్ డాక్టర్ వివేకానంద, మార్కెటింగ్ గ్రూప్ హెడ్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా ప్రజల్లో రక్తదానం పట్ల అవగాహన పెంపొందించి స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం కాకుండా తలసీమియా బాధిత పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కొరకు తోడ్పాటునందించాలని, ఆరోగ్యంగా ఉన్న యువతి, యువకులు శిభిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8985450534 కు సంప్రదించాలని తెలిపారు.


## కాంగ్రెస్ బలోపేతానికి మరింత కృషి

### టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి మరింత కృషిచేస్తానని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యధర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోల్ ఉప్పల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పలను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బండ్లగూడ దేవాలయ కమిటీ మాజీ చైర్మనే మెట్టు సత్యనారాయణ గౌడ్, నరేష్‌కుమార్, వెంకటేష్‌గౌడ్, రవీందర్, మెట్టు విజయ్, సాయిచరణ్, నరేందర్, సాయిగౌడ్, మహేందర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆధ్మాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :**ఆధ్మాత్మిక చింతనతో మానసిక ప్రశాతంత లభిస్తుందని టిపిసిసి సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌కెపురం డివిజన్ అల్కాపురికాలనీలోని శ్రీ శృంగేరి శారదాపీఠం శంకరమఠం వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో దేప సురేఖ భాస్కర్‌రెడ్డి దంపతులు, చిలుక మదుర ఉపేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ధర్మాధికారి శ్రీనివాస్‌శర్మ, అర్చకులు సుధాకర్‌శర్మ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన స్వరూప్‌రాజ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :**కాంగ్రెస్ పార్టీతో రాష్ట్ర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు వక్కలంక స్వరూప్‌రాజ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర క్రీడా యువజన, పశుసంవర్ధక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరిని శుక్రవారం స్వరూప్‌రాజ్ మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వరూప్ మాట్లాడుతూ పేద ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

# వరద ప్రభావానికి శాశ్వత పరిష్కారం చూపిస్తాం

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్ నగర్‌లో వరద ప్రభావం నుంచి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ప్రశాంత్ నగర్‌లో వాటర్ డ్రైన్స్ ఔట్‌లేట్ జరుగుతన్న పనులను కాలనీవాసులతో పాటు మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన డ్రైన్స్ పనులు జరుగుతున్న వరుసలో ప్రైవేటు స్థలం ఉన్న నేపథ్యంలో స్థల యజయానులను పిలిపించి నూతన డ్రైన్స్ నిర్మాణ పనులకు సహాకరించాలని కోరగా, వారిని ఒప్పించి తగు పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. డ్రైన్స్ పనులు త్వరితరగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో నాయకులు మిట్ట రామ్మోహన్, కాలనీ వాసులు బాలజీనాథ్, కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, పద్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే మానవ మేధస్సుకు పదును

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పుస్తక పఠనంతోనే మానవ మేదస్సుకు పదును లభిస్తుందని, ప్రతి ఒక్కరు పుస్తకాలు చదవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత ఖర్చులతో రూ.25వేలు విలువ చేసే పుస్తకాలను షాద్‌నగర్ గ్రేడ్1శాఖ గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రంథాయాలను నేటి యువత సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాపై దృష్టి తక్కువ చేసి గ్రంథాలయాలకు వెళ్ళి పుస్తకాలను చదివి మేదస్సును పెంచుకునేందుకు కృషి చేయాలని కోరారు. పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలను గ్రంథాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహనీయుల జీవిత చరిత్రలు, స్వాతంత్ర్య ఉద్యమాలకు చెందిన పాఠ్యంశాలను, రాజకీయ విలువలతో కూడిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మధన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి క్యూసెట్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నక్క బాల్‌రాజ్, వీరేశం, కోశాధికారి రవిగౌడ్, సహాయ కోశాధికారి కత్తి చంద్రశేఖర్ అప్ప, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్, డైరెక్టర్లు శివరాములు యాదవ్, ఆలోనిపల్లి రాజు, రవినాయక్, జుట్టు అనిల్, కృష్ణారెడ్డి, అనిల్ యాదవ్, సింగపాగ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# లీల

## ఏసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ చేతికి 'మార్గన్' హక్కులు






హీరోగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, పాటల రచయితగా, ఎడిటర్‌గా ఇలా మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోని ఎప్పుడూ ఆడియెన్స్‌ను కొత్త పాయింట్‌తో జపం ముందుకు వస్తున్నారు. బిచ్చగాడు ఫేం విజయ్ ఆంటోని తాజా చిత్రం 'మార్గన్'. లియో జాన్ పాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్ పై జె.రామాంజనేయులు సమర్పిస్తున్నారు. మర్డర్ మిస్టరీక్రైమ్ థ్రిల్లర్ గా రాబోతున్న ఈ మూవీని జూన్ 27న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా పరిచయం అవుతున్నారు. 'మార్గన్' మీదున్న నమ్మకంతో సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ సురేష్ బాబు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చారు. జూన్ 27న ఈ చిత్రాన్ని ఏసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ మేరకు హీరో, నిర్మాత విజయ్ ఆంటోని సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబు కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇతర పాత్రల్లో సముద్రఖని, మహానటి శంకర్, ప్రితిక, బ్రిగిడా, వినోద్ సాగర్, అజయ్ ధీషన్, దీప్శిఖ, కలక్క పోవదు యారు అర్చన, కనిమొళి, అంతగారం నటరాజన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## రేపు ఏపి సిఎంను కలవనున్న చిత్రసీమ


తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలవనున్నారు. ఈ నెల 15న చిత్ర పరిశ్రమ ప్రముఖులు కలవనున్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాతల మండలి, దర్శకుల సంఘం, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇలా అందరూ కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కలవనున్నారు. ఏపి సిఎం చంద్రబాబు నాయుడుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సినిమాటోగ్రఫీ శాఖ కందుల దుర్గేష్‌ను కలుస్తారు. సుమారు ఇరవై అయిదు మందికి పైగా సినీ ప్రముఖులు హాజరవుతారు. సురేష్ బాబు, అల్లు అరవింద్, కే కేస్ రామారావు, కె ఎల్ నారాయణ, అశోక్ కుమార్, ఆదిశేష గిరి రావు, హీరో నాగచైతన్య, జయప్రద, జీవితం, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, మా అసోసియేషన్ నుంచి మాదాల రవి తదితరులు వెళ్లి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కలవనున్నారు. ఇండస్ట్రీలో అనేక ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, టికెట్ ధరల పెంపు, లొకేషన్ లకు అనుమతులు, ఆంధ్రప్రదేశ్‌లో సినిమా పరిశ్రమ అభివృద్ధి వంటి అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకుని వెల్తారు. అందరూ కలిసి వినతిపత్రం సమర్పిస్తారు.



## 'వైల్డ్ బ్రీత్' పోస్టర్ విడుదల

రేవు సినిమా మూవీని నిర్మించిన ప్రొడక్షన్ హౌస్ సంహిత్ ఎంటర్ టైన్మెంట్స్ లో వస్తున్న మరో సినిమా 'వైల్డ్ బ్రీత్' ఈ సినిమాకు నిర్మాత పర్వతనేని రాంబాబు పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ పోస్టర్ ఫిలిం ఛాంబర్ హాలులో నటుడు శివాజీ రాజా, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ ఆవిష్కరించారు. చిత్రానికి హరినాథ్ పులి దర్శకత్వం వహిస్తున్నారు. డా.మురళీ చంద్ గింజుపల్లితో కలిసి పర్వతనేని రాంబాబు నిర్మిస్తున్నారు. నిర్మాతల తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కూడా ఉన్నారు.
నిర్మాత పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ నాకు అన్ని విధాలా సహకరిస్తున్న మా నిర్మాత డాం మురళి గింజుపల్లి నన్ను నమ్మి అంతా నాకు అప్పగించారు. అంతే నమ్మకంగా అయనకు మంచి పేరు వచ్చే సినిమా ఆయనకు ఇస్తాను. పర్వతనేని రాంబాబుకు పుట్టినరోజు కేక్ కట్ చేశారు.

## 'కుబేర' గ్రాండ్ ఈవెంట్‌కు కొత్త డేట్




ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల రూపొందించిన చిత్రం 'కుబేర'. రష్మిక కథానాయిక. నాగార్జున కీలక పాత్రలో నటించారు. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న నేపథ్యంలో శుక్రవారం 'కుబేర' ఈవెంట్ నిర్వహించాలని టీమ్ భావించిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం దృష్ట్యా ఆ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. కాగా, తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన కొత్త డేట్‌ను ప్రకటించింది. జూన్ 15న (ఆదివారం) సాయంత్రం నిర్వహించనున్నట్లు చెప్పింది. ముందు అనుకున్నవిధంగానే హైదరాబాద్ లోనే ఈ కార్యక్రమం జరగనుందని తెలిపింది.
సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇందులో హవాలా, మనీలాండరింగ్ తదితర అంశాలు మిళితమై ఉంటాయి. దీంట్లో నటులు ఎక్కడా కనిపించరు. కేవలం పాత్రలు మాత్రమే కనిపిస్తాయి' అని పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో దీనిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన 'కుబేర' ఈనెల 20న విడుదల కానుంది.

## ఆహాలో 'కార్తిక-మిస్సింగ్ కేస్'



విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకున్న తమిళ మర్డర్ మిస్టరీ 'యుగి'ని తెలుగులో 'కార్తిక మిస్సింగ్ కేస్' పేరుతో ఆహా ఓటిటిలో స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని భవాని మీడియా రిలీజ్ చేస్తుంది. జాక్ హారిస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, గొప్ప స్క్రీన్‌ప్లే, ఉత్కంఠభరితమైన కథనంతో ప్రేక్షకులను పూర్తిగా అలరించింది. కథిర్, నట్టి, ఆనందీ, నరైన్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమా, తమిళంలో మంచి విజయాన్ని అందుకుంది. ఒక డిటెక్టివ్ తన బృందంతో కలిసి అదృశ్యమైన యువతిని వెతుకుతున్నాడు. దర్యాప్తులో కార్తిక అనే అమ్మాయి గురించి బయటపడే షాకింగ్ నిజాలు, అనూహ్య మలుపులు తిరుగుతూ ఉత్కంఠభరితంగా సాగుతోంది.

## గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకను విజయవంతం చేయాలి

### ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు






సినిమా నటీనటులను, సాంకేతిక నిపుణుల ప్రతిభను ప్రోత్సాహించే సంప్రదాయ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం మళ్లీ శ్రీకారం చుట్టింది. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు వాటిలో నటించి ఉత్తమ ప్రతిభను చూపిన నటీనటులకు, సాంకేతిక నిపుణులతో పాటు 2014 జూన్ నుండి 2024 డిసెంబర్ 31 వరకు సెన్సారు జరుపుకున్న చిత్రాల్లో కూడా ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి ఇందులో భాగంగా అవార్డ్స్ ఇవ్వనున్నారు. ఇటీవల విజేతల జాబితాను కూడా ప్రటించారు. వేడుక కోసం హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. నేడు అంగరంగ వైభవంగా ఈ వేడుకను నిర్వహిస్తున్నామని ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు మీడియా సమావేశంలో పేర్కొన్నారు. 14 సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం చేయాలసిన బాధ్యత సినీ పరిశ్రమపై కూడా ఉందని అన్నారు. కార్యక్రమానికి ఐ అండ్ పిఆర్ ద్వారా లైవ్ ప్రసారం కానుంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఈ వేడుక ప్రారంభం కానుంది. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాల్లో ప్రతి ఏడాది నుంచి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి వాటికి ఈ వేడుకలో అవార్డులు అందిస్తున్నాం. ప్రతి సంవత్సరానికి సంబంధించి ఎంపికైన మూడు ఉత్తమ చిత్రాలకు పనిచేసిన హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు అందిస్తున్నాం. ఇలాంటి ఓ మంచి సాంప్రదాయాన్ని గద్దర్ ఫిల్మ్ అవార్డులతో పరిచయం చేస్తున్నాం. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ సాంకేతిక నిపుణులకు కూడా అవార్డులు అందజేస్తున్న సంగతి తెలిసిందే. 14 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ వేడుకను తెలుగు సినీ పరిశ్రమలోని అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను అని దిల్ రాజు అన్నారు.

## రఘు కుంచె కీలక పాత్రలో 'గేదెల రాజు'




ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె హీరోగా 'గేదెలరాజు' సినిమా తెరకెక్కుతోంది. ఒక పక్క సినిమాలకు సంగీతం అందిస్తూనే, కొన్ని సినిమాల్లో పాత్రలు పోషిస్తున్నారు. గేదెల రాజు సినిమాలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. రఘు కుంచె జన్మదినం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కాకినాడ తాలుకా ట్యాగ్‌తో రఫ్‌గా ఉండే మాస్ లుక్ తో ఫస్ట్ లుక్ రూపొందించారు. మాటూరి చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు.

## అసమానతలు ఎందుకు పోలే!

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే నిజమైన అర్థిభివృద్ధి సాధించినట్లు కూనంనేని స్పష్టం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి మందపవన్‌తో కలిసి మాట్లాడారు. దేశంలో సంపద అంత 10శాతం బడా పారిశ్రామికవేత్తలపై ఉందని, కేంద్ర సర్కార్ వారికి రెడ్ కార్పెట్ పరిచిందన్నారు. 90 శాతంకు పైగా పేద,మధ్యతరగతి ప్రజలు సామాన్య జీవితం గడుపుతున్నారన్నారు. ధన రాజకీయాలతోనే వ్యవస్థ కొనసాగుతుందన్నారు. ప్రజలను చైతన్యం చేయటం, వారి సమస్యలు పరిష్కరించటంలో ఎర్రజెండా ముందంజలోఉందన్నారు. మావోయిస్టులను, కమ్యూనిస్టులను అణిచివేసేందుకు కేంద్ర కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. మావోయిస్టులు లొంగిపోతామని,చర్చలకు సిద్ధమని చెప్పిన కేంద్రం పట్టించుకోకుండ మారణ కాండ కొనసాగిస్తుందన్నారు. మావోయిస్టులపై కొనసాగుతున్న దమనకాండను మానుకోవాలని హితవు పలికారు.

### కాళేశ్వరం విచారణలో కెసిఆర్ అధికారులను బాధ్యులను చేయటం తగదు

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ అంతతనదేనని..తానే ఇంజనీరుగా వ్యవహరించానని గొప్పలు చెప్పుకున్న కెసిఆర్ ఇప్పుడు విచారణలో అధికారులపై తప్పును నెట్టివేయటం సమంజసం కాదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కాళేశ్వరం కమీషన్ విచారణకు వెళ్లేటప్పుడు మాజీ సిఎం కెసిఆర్ వందలాది వాహనాల్లో, జన సమీకరణతో తరలివెళ్లటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన పథకాలతో పారదర్శకమైన పాలన అందించాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ సిపిఐ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలో డిసెంబర్ 26న 5లక్షల మందితో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ మండల, జిల్లా,మహాసభలతో భవిష్యత్ కార్యచరణ పోరాట ప్రణాళికను రూపొందించుకుంటామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక పాలసీని తీసుకరావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



### ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదం బాధకరం

ఆహ్మదబాద్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ కూలిపోయి 262కు మందికి మృతిచెందటం బాధకరమని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదంలో ఎక్కడో లోపం జరిగిందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఈలాంటి ప్రమాదాలు జరుగకుండ తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. విమానం ప్రమాద మృతుల పట్ల కూనంనేని సంతాపం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కనుకుంట్ల శంకర్, కిష్టపురం లక్ష్మణ్, దయాకర్‌రెడ్డి, వనం రమేశ్, ప్రసన్నకుమార్, వేల్పుల ప్రసన్నకుమార్,బన్సిలాల్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎడ్ల గురువారెడ్డి సేవలు చిరస్మరణీయం : కూనంనేని

సిపిఐ నేత, సిద్దిపేట మొట్టమొదటి ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో మాజీ ఎమ్మెల్యే గురువారెడ్డి వర్థంతి పురస్కరించుకొని మున్సిపల్ పార్కులోని విగ్రహానికి సిపిఐ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, తెలంగాణ అకాడమి మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి, విద్యావంతుల వేదిక నేత పాపయ్య, ఎడ్ల వెంకట్రామ్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌లు ఎడ్ల గురువారెడ్డి సేవలను కొనియాడారు.

## 54 ఎకరాల పరిమితి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా రాజకీయ, సామాజిక, వ్యవసాయ పరిస్థితులపై పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ సాగుకు సంబంధించి పలు వివరణలు ఇచ్చారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రైతు భరోసా సాయం పెట్టుబడి కోసమే చేస్తున్నామని పెట్టుబడి సమయంలోనే రైతు భరోసాను అందిస్తామని ఇదే విషయాన్ని ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ రంగంలో రసాయనాల వాడకం ముఖ్యంగా యూరియా వాడకం పెరిగి పోతుందని దీనిని తగ్గించాలని ఆయన తెలిపారు. ఒక్క యూరియా పైనే రూ. 1.70 లక్షల కోట్లు సబ్సిడీ ఇస్తుందని కాంప్లెక్స్ ఎరువులకు సబ్సిడీని అందించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తుమ్మల తెలిపారు. పామాయిల్ సాగులో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని ఇప్పటికే 2.54 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారని మరో లక్ష ఎకరాల్లో సాగుకు ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. అన్ని ఉమ్మడి జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయనున్నామని తుమ్మల రైతాంగానికి హామీ ఇచ్చారు ఖమ్మంజిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద ఏర్పాటు చేస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీలో గార్డెన్ సీడ్స్ ఉత్పత్తితో పాటు రీఫైనరీ కూడా అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలకు సంబంధించి ఎక్కడ ఎవరు విక్రయించినా, సరఫరా చేసినా పిడి యాక్ట్ నమోదు చేస్తామని తుమ్మల హెచ్చరించారు. నకిలీ విత్తనాలు దొరికితే వెంటనే ధ్వంసం చేయాలని సూచించారు.

### ఈటల వల్లనే స్పందించా :

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన కమిషన్ ఎదుట మాజీ మంత్రి ఈటల నా ప్రస్తావన తెచ్చినందునే నేను స్పందించాల్సి వచ్చిందని ఒక ప్రశ్నకు సమాధానంగా తుమ్మల తెలిపారు. అప్పటికి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి మాత్రమే మంత్రి వర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని దానికి 15 రోజుల ముందే కాళేశ్వరానికి అనుమతినిచ్చారని ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు కమిషన్‌కు సమర్పించినట్లు తుమ్మల తెలిపారు. ముఖ్యమంత్రులకు ఇబ్బందులు కలిగించే రీతిలో తాను ఎప్పుడు వ్యవహరించ లేదని తుమ్మల స్పష్టం చేశారు.

## సాగుకు సమాయత్తం

(మొదటి పేజీ తరువాయి)

సాగువైపు మొగ్గుచూపుతున్నారు. పత్తికి ప్రభుత్వం మద్దతు ధరగా క్వింటాకు 7521 రూపాయలను ప్రకటించింది. పత్తిసాగు చేసిన రైతులకు ఓ వంద,రెండు వందలు అటూ ఇటుగా ప్రభుత్వ మద్దతు ధర లభిస్తున్నది. మిర్చి కన్నా పత్తికి పెట్టుబడి తక్కువకావడంతో పాటు అలాగే ఆదాయం కూడా తక్కువే అయినప్పటికీ... నష్టాల ఊబిలోకి నెట్టబడటంలేదు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిర్చి రైతులు పత్తిసాగువైపు చూస్తున్నారు. ప్రతి ఏటా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏడున్నర లక్షల ఎకరాలకు పైగా పత్తిపంటను సాగుచేస్తున్నారు. అత్యధికంగా వరంగల్, జనగామ, మహబూబాబాద్, హనుమకొండ ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో మిరప పంటలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. మిర్చి ధరల దెబ్బకు రైతులు పత్తిసాగుకు మొగ్గుచూపడంతో ఈసారి మరో 50 వేల ఎకరాలు అదనంగా సాగుకావచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగు కానున్నది.

### ఇటీవల వర్షాలతో మెట్టదుక్కులు ప్రారంభం

మునుపెన్నడూలేని విధంగా గత నెలరోజుల నుంచి యావత్తు తెలంగాణలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వర్షాకాలం తరహాలోనే నాలుగైదు సెంటి మీటర్లవర్షపాతం నమోదవుతున్నది. మెట్ట దుక్కులు దున్నుకోవడానికి తొలుత కురిసిన అకాల వర్షాలు రైతులకు ఉపయోగకరంగా మారాయి. వరి, మొక్కజొన్న తదితర పంటలను సాగుచేసిన రైతులకు నష్టాలు చేసినప్పటికీ.. పత్తి పంటను సాగుచేసిన నేలల్లో తిరిగి విత్తనాలు నాటుకునేందుకు దుక్కులు సిద్ధం చేయడానికి ఆకాలవర్షాలు ఉపయోగంగా మారాయి. వాతావరణ శాఖ రుతుపవనాలు రావడంతో వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించినపుడే రైతులు సంసిద్ధమయ్యారు. అలాగే తెలంగాణాలో కూడా రుతుపవనాలు పూర్తి స్థాయిలో విస్తరించాయని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో గత వారం, పది రోజుల నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు ఎక్కడో ఓ చోట కురుస్తూనే ఉన్నాయి. నల్లరేగడి నేలల్లో దుక్కులు దున్నేందుకు అనువుగా లేనప్పటికీ ఎర్ర నేలలు, ఇసుక నేలలు ఈ వర్షాలకు దుక్కులను సిద్ధం చేసుకోవడానికి అనువుగా ఉండటంతో పత్తి, అపరాలు, మొక్కజొన్న వంటి మెట్ట పంటల సాగుకు సిద్ధమయ్యారు.

### అందుబాటులోకి వచ్చిన పత్తి విత్తనాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏడున్నర నుంచి ఎనిమిది లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. దీంతో ఎకరానికి రెండు ప్యాకెట్లు చొప్పున విత్తనాలు అవసరమవుతాయి. ఒక ప్యాకెట్ వచ్చి 450 గ్రాముల విత్తనాలు ఉంటాయి. గతంలో ఎకరానికి ఒక ప్యాకెట్ విత్తనాలతోనే సరిపెట్టుకునేది. నాటిన విత్తనాలు పూర్తిగా మొలకెత్తకపోతే.. అదనంగా మరో సగం ప్యాకెట్ విత్తనాలను పోగుంటలుగా నాటుకునేది. ఎనిమిది లక్షలఎకరాల్లో పత్తిసాగుకు 20 లక్షల ప్యాకెట్లకు పైగా అవసరం ఏర్పడనున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 లక్షల ప్యాకెట్లు వచ్చాయి. మరో పదిలక్షల ప్యాకెట్లు జూన్ రెండవవారంలో రానున్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సాగు అత్యధికంగా వరంగల్, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ జిల్లాల్లో సాగవుతున్నది. అయితే కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత వ్యవసాయ శాఖ విత్తనాలను వరంగల్, హనుమకొండ జిల్లాలతో పాటు అన్ని జిల్లాల్లోని వ్యాపారులు తెప్పించుకుంటున్నారు. అత్యధికంగా మాత్రం వరంగల్ జిల్లాలోనే అమ్మకాలు జరుగుతుంటాయి. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు విత్తనాలను అందుబాటులోకి తెచ్చారు.

### నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి

కల్తీ విత్తనాలతో రైతులు ఏటా నష్టపోతున్నారు. మొన్నటికిమొన్న ములుగు జిల్లా వాజేడు, నూగూరు వెంకటాపూర్ మండలాల్లో నకిలీ మొక్కజొన్న విత్తనాలు రగడ జరిగిన విషయంతెలిసిందే. రైతులకు విత్తనాలు సరఫరా చేసిన వ్యాపారులు రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు ససేమిరా అనడంతో మంత్రి సీతక్క విత్తనాలు తయారు చేసిన కంపెనీల ప్రతినిధులను హైదరాబాద్లోని మంత్రి క్యాంపు కార్యాలయానికి పిలిపించి రైతులకు నష్టపరిహారం అందించకపోతే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని కంపెనీ ప్రతినిధులను తీవ్రంగా హెచ్చరించిన విషయం తెలిసిందే. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని శాఖను ఆదేశించారు. అయినప్పటికీ ఇటీవల జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. నకిలీ విత్తనాల నుండి రైతులను కాపాడాలని పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు.

## కారకులెవరు?

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో మీ పిల్లలను మా బడికి పంపండి అంటే పంపక పోగా నిలదీస్తున్న తీరు ఆలోచింపజేస్తుంది. అదే సమయంలో హైస్కూల్ విద్యను కూడా పూర్తి చేయని నాలుగు అంకెల వేతనం సరిగ్గా పొందని వారు మీ పిల్లలను మా బడికి పంపండి అంటే తల్లిదండ్రులు సానుకూలంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల దుస్థితికి కారణం ఎవరు ప్రభుత్వమా ప్రభుత్వ ఉపాధ్యాయులా. ప్రభుత్వ పాఠశాలలు అత్యంత గడ్డుస్థితిని ఎదుర్కొంటున్నాయి. మౌలిక వసతులు, అర్హత కలిగిన బోధనా సిబ్బంది, విద్యార్థులు లేక బోసిపోతున్నాయి. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ బడిలో ఒక విద్యార్థి లేకపోగా నాలుగు ప్రైవేటు పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులు ఆ ఊరిలో రయ్ రయ్ మంటున్నాయి. ప్రభుత్వబోధనకు పెద్ద మొత్తంలో వేతనం ఇస్తున్నా విద్యార్థులను ఆకర్షించలేని ఉపాధ్యాయులు పిల్లలు రాకుంటే బాగు రోడ్డు సమీపంలోని పాఠశాలకు డిప్యూటేషన్ వెళ్లవచ్చు అన్న భావనలో ఉన్నారంటే అంకిత భావం ఏ స్థాయిలో ఉందో ఆలోచించుకోవచ్చు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని అష్ణగుర్తి గ్రామం ఒకప్పుడు విద్యా కేంద్రంగా ఉండేది. చుట్టూ పది గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆ గ్రామానికి వచ్చి పదవ తరగతి వరకు చదువుకునే వారు. ఎంతో మందిని ఉన్నత వంతులుగా తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేర్చింది. ఆ గ్రామ ఉన్నత పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులను నిత్యం స్మరించే వారు ఇప్పటికీ ఉన్నారు. ఆ గ్రామం ఉన్నత పాఠశాల కొన్నేళ్ల క్రితం విద్యార్థులు లేక రాక మూతపడింది. ఇప్పుడు ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల ఆ పాఠశాలకే చెందిన ఒక ఉపాధ్యాయుడు అనుమతి లేకుండానే విదేశాలకు వెళ్లి ఎంజాయ్ చేసి అధికారులకు దొరికి అపకీర్తి కూడబెట్టారు. ఆ ముగ్గురు ఒకరికి ఎదురుగా ఒకరు కూర్చుని బడికి రాకపోతే జీతం వస్తే విద్యార్థులు లేరు ఏమిటి దుస్థితి అని ఆలోచన చేస్తున్నారు. ఇది ఈ ఒక్క పాఠశాల దుస్థితి కాదు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది పాఠశాలలు మూసివేత దిశగా సాగుతున్నాయి.

**ప్రభుత్వ వైఫల్యమే దుస్థితికి కారణం :**
బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నాం, వేతనాలు ఇస్తున్నాం ఊరిలో వారు అడిగితే పాఠశాల భవనాలు కడుతున్నాం, వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం అనుకుంటుంది తప్ప పర్యవేక్షణ లేదు. మండల విద్యాశాఖాధికారులను నియమించమా, ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారా, చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారా అని ఆలోచించారా, ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లు ప్రభుత్వం వ్యవహరించింది. అత్యంత వేతనాలు ఇస్తున్నప్పుడు విద్యార్థుల సంఖ్య తగ్గడానికి లేకపోవడానికి ఉపాధ్యాయులను ఎందుకు బాధ్యులను చేయరు. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్న నిబంధన ఎందుకు తీసుకురారు అన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. గతంలో ఉపాధ్యాయుల పిల్లలు వారు పని చేస్తున్న పాఠశాలల్లోనే చదివే వారు. దాని వల్ల ఉపాధ్యాయులు పనిచేస్తున్న చోటే నివసించే వారు. మరి ఇప్పుడు ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్యం వెరసి ప్రభుత్వ విద్య పతనానికి కారణమైంది.

**హక్కులు తప్ప బాధ్యతల గురించి ఆలోచించని ఉపాధ్యాయులు :**
ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడాడేందుకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ సంఘాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ హక్కుల గురించి మాత్రమే మాట్లాడే నేతలు బాధ్యతల గురించి పెద్దగా మాట్లాడారు.
ఈ తరంలోని కొందరు బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం రేపటి ప్రభుత్వ ఉపాధ్యాయ తరాన్నే లేకుండా చేస్తుందన్న ఆలోచన రాకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వ బడులే లేనప్పుడు ఉపాధ్యాయులను ఎలా నియమిస్తారు అన్న ప్రశ్న మదిలోకి రావడం లేదా లేక మా తర్వాత ఎవరు ఏమైతేనేమి అన్న భావన అన్నది అర్థం కావడం లేదు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు నినదించడం కాకుండా చేపట్టిన కార్యాచరణ ఏది. ఏ ఉపాధ్యాయ సంఘానికి చెందిన సభ్యులు ఎక్కువ మంది విద్యార్థులను బడిలో చేర్చారు. ఏ ఉపాధ్యాయ సంఘం నేత పనిచేస్తున్న ప్రభుత్వ బడి పదిలంగా ఉంది. వేసవిలో ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వ బడుల పరిరక్షణ ఉద్యమాన్ని ఎందుకు చేపట్టరు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలకు ఎందుకు డిమాండ్ చేయరు. ఒక వ్యవస్థలో పనిచేస్తున్న వారిని కాపాడేందుకు ఏర్పడిన సంఘాలు ఆ వ్యవస్థ కనుమరుగవుతున్న స్పందించకపోవడం శోచనీయం. ఇదే సమయంలో తల్లిదండ్రులకు ప్రైవేటుపై మోజు పెరిగింది. పిల్లల చదువు కోసం ఆస్తులు అమ్మాల్సి వచ్చినా వెనకాడడం లేదు. రుగ్మతగా మారిన దీనిని కూడా రూపుమాల్సింది ఉపాధ్యాయులే. ఉపాధ్యాయుడు జ్ఞాన జ్యోతి సమాజాన్ని చైతన్యవంతం చేయగలదిట్ట. ఉపాధ్యాయులు ఆ ఆలోచన చేయాలి. ప్రభుత్వం ఏదో ఒక నిబంధన తెచ్చి ప్రభుత్వ విద్యను నిర్బంధం చేయాలి. లేకుంటే ప్రభుత్వ విద్య గతమే.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com